

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 52

సోమవారం 6-11-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీలో జనం ఉక్కిరిబిక్కిరి

పడిపోతున్న వాయు నాణ్యత.. ప్రైమరీ స్కూళ్లకు మరో 5 రోజులు సెలవు - 6లో



నడిపినోళ్లకు నడిపినంత!

కారు నడిపిన దూరానికే బీమా రక్షణ

25% వరకు తగ్గనున్న భారం - 13లో

న్యూస్‌రీల్

మూడు రోజులు వానలు!



రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అదే సమయంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు కూడా సంభవించవచ్చని పేర్కొంది.

వివరాలు 3లో ▸

హాకీ విజేత భారత్



ఆసియా మహిళల హాకీ చాంపియన్స్‌ ట్రోఫీలో భారత జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టీమిండియా 4–0 గోల్స్‌ తేడాతో జపాన్‌ జట్టును ఓడించింది. ఆసియా చాంపియన్స్‌ ట్రోఫీని భారత్‌ నెగ్గడం ఇది రెండోసారి.

వివరాలు 12లో ▸

అయోధ్యలో అక్షత పూజ మొదలు



అయోధ్యలోని శ్రీరామ మందిరంలో ప్రతిష్టాపన పూజలు అక్షత పూజతో మొదలయ్యాయి. 100 క్వింటాళ్ల బియ్యంతో అక్షత పూజ నిర్వహిస్తున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ తెలిపింది.

వివరాలు 6లో ▸

అణు జలాంతర్గామి నుంచి ఖండాంతర క్షిపణి పరీక్ష



అణు జలాంతర్గామి నుంచి ఖండాంతర బాలిస్టిక్‌ క్షిపణి ప్రయోగం విజయవంతంగా నిర్వహించినట్లు రష్యా ఆర్మీ ప్రకటించింది. ఈ క్షిపణి అణువార్‌హెడ్లను మోసుకెళ్లగలదని స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸

ఇదండీ సంగతి




సామాజిక రంగ వ్యయంలో ఏపీనే టాప్‌

బడ్జెట్‌ కేటాయింపుల్లో 55.71 శాతం వ్యయం

విద్య, వైద్యం, సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి రాష్ట్రం అత్యధిక ఖర్చు

ఈ ఆర్థిక ఏడాది తొలి ఆరునెలల గణాంకాలను వెల్లడించిన కాగ్‌

- 42.83 శాతం వ్యయంతో గుజరాత్‌ 2వ స్థానంలో..
- ఆస్తుల కల్పన వ్యయంలో ఏపీది రెండో స్థానం..
- కేటాయింపుల్లో 53.37 శాతం వ్యయం



సాక్షి, అమరావతి: సామాజిక రంగ వ్యయంలో ఆంధ్రప్రదేశ్‌ మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే అగ్రభాగాన నిలిచింది. ఆ తర్వాత గుజరాత్‌ రెండో స్థానంలో ఉందని కంప్ట్రోలర్‌ అండ్‌ ఆడిటర్‌ జనరల్‌ గణాంకాలు (కాగ్‌) పేర్కొన్నాయి. బడ్జెట్‌ కేటాయింపుల్లో ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలైన ఏప్రిల్‌ నుంచి సెప్టెంబర్‌ వరకు వివిధ రాష్ట్రాల వ్యయాలను కాగ్‌ వెల్లడించింది. సామాజిక రంగ వ్యయం అంటే విద్య, వైద్య, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, పౌష్టికాహారం, పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై చేసిన వ్యయంగా పరిగణిస్తారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలతో పాటు సంక్షేమం పథకాలపై ఇతర రాష్ట్రాలు కన్నా అత్యధికంగా వ్యయం చేసినట్లు కాగ్‌ పేర్కొంది. బడ్జెట్‌ కేటాయింపులు జరిగిన తొలి ఆరు నెలల్లోనే ఈ రంగంపై ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం 55.71 శాతం వ్యయం చేసినట్లు

మిగతా 10వ పేజీలో ▶

సచిన్‌ సరసన.. కోహ్లి 'శత'మానం



ఈడెన్‌ గార్డెన్స్‌ మైదానం.. దాదాపు 70 వేల మంది ప్రేక్షకుల హోరు.. తమ మొబైల్‌ ఫోన్లలో అరుదైన ఘట్టాన్ని చిత్రీకరించేందుకు సిద్ధమైన తరుణం.. రబడ వేసిన బంతిని బ్యాక్‌ఫుట్‌పై కవర్స్‌ దిశగా ఆడి సింగిల్‌.. అంతే స్టేడియం మొత్తం కోహ్లినాదంతో హోరెత్తిపోయింది.. అభిమానులు ఎన్నాళ్లుగానో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మైలురాయిని 'బర్త్‌డే బాయ్‌' అందుకున్నాడు. వన్డేల్లో 49వ సెంచరీతో దిగ్గజం సచిన్‌ టెండూల్కర్‌ రికార్డును సమం చేసిన కోహ్లి తన పుట్టిన రోజున తనకే ప్రత్యేక కానుక ఇచ్చుకున్నాడు. తన 289వ మ్యాచ్‌లో కోహ్లి ఈ రికార్డును చేరుకొని ఆల్‌టైమ్‌ గ్రేట్‌ సరసన నిలిచాడు.

12 లో

వన్డేలు 289

రన్స్‌ 13,626

సెంచరీలు 49

భారత్‌ ప్రతాపం.. దక్షిణాఫ్రికా దాసోహం

243 పరుగుల తేడాతో విజయం

రేపు రైతన్నలకు 'రైతు భరోసా'

ఈ ఏడాది రెండో విడత సాయాన్ని జమ చేయనున్న సీఎం జగన్‌

- వైఎస్సార్‌ రైతు భరోసాతో 53.53 లక్షల మంది ఖాతాల్లోకి రూ.2,204.77 కోట్లు
- ఇప్పటికే తొలి విడతగా 52.57 లక్షలమందికి రూ.3,942.95 కోట్ల సాయం



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌ రైతు భరోసా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత పెట్టుబడి సాయం పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ నెల 7వతేదీన శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌ నొక్కి రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేయనున్నారు. ఈ ఏడాది తొలి విడతలో రూ.7,500 చొప్పున 52.57 లక్షల మందికి రూ.3,942.95 కోట్ల మేర ఇప్పటికే పెట్టుబడి సాయాన్ని అందించగా తాజాగా రెండో విడతగా రూ.4 వేల చొప్పున 53.53 లక్షల మందికి రూ.2,204.77 కోట్ల లబ్ధి చేకూర్చనున్నారు.

ఏటా పెరుగుతున్న లబ్ధిదారులు

వైఎస్సార్‌ రైతు భరోసా ద్వారా ఇచ్చిన మాట కంటే మిన్నగా అర్హులైన రైతు కుటుంబాలకు ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. వెబ్‌ల్యాండ్‌ ఆధారంగా అర్హులైన భూ యజమానులతోపాటు దేవదాయ, అటవీ(ఆర్‌వోఎఫ్‌ఆర్‌) భూములను సాగు చేసేవారే కాకుండా సెంటు భూమి కూడా లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన

మిగతా 2వ పేజీలో ▶

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



ఇది మన స్వాభిమాన ఆత్మగౌరవ యాత్ర

2 లో

- వైఎస్సార్‌సీపీ వచ్చాకే సామాజిక సాధికారత
- పేదలు తలెత్తుకుని బతికేలా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు
- వారి జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం
- అందుకే చంద్రబాబు మా పథకాల కాపీకి తయారయ్యారు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చట్టసభలు, కార్పొరేషన్‌ పదవుల్లో పెద్దపీట
- బాబు, జగన్‌ పాలనకు మధ్యనున్న తేడాను ప్రజలు గమనించాలి
- వైఎస్‌ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవడం చారిత్రక అవసరం
- కాశీబుగ్గ సామాజిక సాధికార యాత్రలో స్పీకర్‌ తమ్మినేని, మంత్రులు ధర్మాన, సీదిరి
- యాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం.. ఇసుకేస్తే రాలనంతగా జనం

చిట్‌ఫండ్‌ మోసాలకు కళ్లెం

ఆన్‌లైన్‌లో చిట్‌ఫండ్‌ కంపెనీల పర్యవేక్షణ

- అందుబాటులోకి ఈ–చిట్స్‌ అప్లికేషన్‌
- అన్ని కంపెనీల చిట్ల వివరాలు ఇందులో నమోదు చేయాల్సిందే
- కొత్త విధానంలో ఆన్‌లైన్‌లోనే చిట్లకు అనుమతులు ఇవ్వనున్న అధికారులు
- చందాదారులకు ప్రతి విషయం తెలిసేలా ఏర్పాట్లు
- చిట్లు కట్టే చందాదారుల భద్రతే ప్రధాన లక్ష్యం
- ఇప్పటికే ఉన్న కంపెనీలు సైతం ఈ విధానం పరిధిలోకి రావాల్సిందే



సాక్షి, అమరావతి: 'మార్గదర్శి' వంటి కంపెనీల మోసాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటికి కళ్లెం వేస్తోంది. చిట్‌ఫండ్‌ వ్యవహారాలను కట్టుదిట్టం చేసేందుకు.. ఈ సంస్థల వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. సదరు కంపెనీలు నిర్వహించే చిట్ల వివరాలన్నీ ప్రజలకు తెలిసేలా ఆన్‌లైన్‌ విధానాన్ని రూపొందించి 'ఈ–చిట్స్‌' అప్లికేషన్‌ను అందుబాటులోకి

మిగతా 10వ పేజీలో ▶



ఇజ్రాయెల్‌ జరిపిన దాడిలో తన బంధువులను కోల్పోవడంతో రోదిస్తున్న వ్యక్తిని ఓదారుస్తున్న పాలస్తీనియన్లు

శరణార్థి శిబిరాలపై భీకర దాడులు

- గాజాలో నిప్పుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్‌ సైన్యం
- మూడు శిబిరాలపై దాడులు
- 24 గంటల్లో 73 మంది మృతి

- వివరాలు 6లో

చిన్నారుల ఆరోగ్యానికి రక్ష

- విశాఖ, విజయవాడల్లో పీడియాట్రిక్‌ సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి సన్నాహాలు
- ఒక్కో చోట 500 పడకల సామర్థ్యం
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన డీఎంఈ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చిన్నారుల ఆరోగ్యానికి మరింత భరోసానిచ్చేలా సీఎం జగన్‌ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో విజయవాడ, విశాఖపట్నంలో చిన్న పిల్లల సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను డైరెక్టర్‌ ఆఫ్‌ మెడికల్‌ ఎడ్యుకేషన్‌(డీఎంఈ) ప్రభుత్వానికి పంపింది. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్‌లో పిల్లల కోసం నిలోఫర్‌ ఆస్పత్రి ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ ఆ ఆస్పత్రి సేవలను కోల్పోయింది. దీంతో పిల్లలకు ఏదైనా జబ్బు చేస్తే సూపర్‌ స్పెషాలిటీ వైద్యం కోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌ నగరాలకు వెళ్లాల్సిన దుస్థితి. అయితే గత టీడీపీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ పిల్లలకు ప్రభుత్వ రంగంలో

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

వీఆర్వోలకు మేలు చేసేలా జీవోలు

వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు

సాక్షి, అమరావతి: వీఆర్వోలకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం 154, 64, 6538, 166, 31 జీవోలు జారీ చేసిందని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం (వీఆర్వో అసోసియేషన్) అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపేందుకు త్వరలో రాష్ట్రస్థాయిలో విజయోత్సవ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశంలో రవీంద్రరాజు మాట్లాడుతూ.. రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులలో వీఆర్వోలకు ప్రస్తుతం ఉన్న కోటా 40 శాతం నుంచి 70 శాతానికి పెంచాలని, ఖాళీగా ఉన్న సీనియర్ సహాయకుల పోస్టులలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ప్రకారం 70 శాతం పదోన్నతులను వీఆర్వోలతో భర్తీ చేయాలని కోరారు. సర్వే సప్లిమెంటరీ పరీక్షలు రాసిన గ్రేడ్–2 వీఆర్వోల ఫలితాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘాన్ని గుర్తింపు సంఘంగా ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, నాయకులు బాలాజీరెడ్డి, మౌళి భాష, లక్ష్మీనారాయణ, బాపూజీ పాల్గొన్నారు.

దీపావళి ప్రత్యేక రైళ్లు



సాక్షి, హైదరాబాద్: దీపావళి సందర్భంగా హైదరాబాద్–కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్–కటక్ (07165/07166) ప్రత్యేక రైలు ఈ నెల 7, 14, 21 తేదీల్లో రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మర్నాడు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 8, 15, 22 తేదీల్లో రాత్రి 10.30 గంటలకు కటక్ నుంచి బయల్దేరి మర్నాడు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

ఫేస్‌బుక్ యాడ్స్‌లో ఫేక్ లోన్‌యాప్స్

నమ్మి మోసపోవద్దని సైబర్ భద్రత నిపుణుల హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ మోసాలకు తెర తీసేందుకు సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతున్నారు. తాజాగా ఫేక్ లోన్ యాప్‌లను ఫేస్‌బుక్‌లో యాడ్స్ రూపంలో పంపుతున్నట్లు సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో వచ్చే ఆన్‌లైన్ లోన్‌యాప్‌లలో నిమిషాల్లోనే మీ బ్యాంకు ఖాతాల్లో రుణం మొత్తం జమ చేస్తామంటూ నమ్మబలుకుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఫేస్‌బుక్ వినియోగదారులను టార్గెట్ చేస్తూ ఈ తరహా ప్రకటనలు ఇస్తున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణానికి వడ్డీ కూడా అతి స్వల్పం అని ఊదరగొడుతున్నారన్నారు. ఇలా వారి వలకు చిక్కే అమాయకుల నుంచి ప్రాథమిక వివరాల కోసం అంటూ ఆధార్‌కార్డు, పాన్ కార్డుల వివరాలు సేకరిస్తున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్బీఐ నిబంధనల మేరకు పనిచేసే సంస్థల నుంచే ఆన్‌లైన్ రుణాలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.

నేటి భవితలో..

- బ్యాంక్ జాబ్స్:
  క్రెడిట్ ఆఫీసర్.. కొలువు అందుకుంటారా! ఎంబీఏ, సీఏ తదితర ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేశారా.. లేదా బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పాటు ఏదైనా బ్యాంకులో పనిచేసిన అనుభవం ఉందా..! అయితే.. బ్యాంకింగ్ రంగంలో మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. వంద క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా.. నియామకాలు ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలో..బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర క్రెడిట్ ఆఫీసర్ పోస్టుల వివరాలు.. ఎంపిక విధానం, వేతనాలు, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..
- గ్రూప్1, గ్రూప్ 2 ప్రత్యేకం– కరెంట్ అఫైర్స్: సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, ప్రాంతీయం, ఎకానమీ, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు వంటి తాజా పరిణామాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండ్ అప్..
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇది మన స్వాభిమాన ఆత్మగౌరవ యాత్ర

కాశీబుగ్గ సామాజిక సాధికార యాత్రలో స్పీకర్ తమ్మినేని, మంత్రులు ధర్మాన, సీదిరి



వేదికపై ప్రసంగిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో మంత్రి సీదిరి అప్పలరాజు తదితరులు



శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీ సంఖ్యలో హాజరైన జనసందోహంలో ఓ భాగం

ఇసుకేస్తే రాలనంతగా జనం..

ఇక ఆదివారం నిర్వహించిన ఈ యాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. పల్లె ప్రాంతాల నుంచి వెల్లువలా బహిరంగ సభకు తరలివచ్చారు. సభ నిర్వహించిన ప్రాంగణం ఇసుకేస్తే రాలనంతగా జనంతో కిక్కిరిసిపోయింది. నియోజకవర్గంలోని రామకృష్ణాపురం నుంచి కాశీబుగ్గ కేటీ రోడ్డు వరకు బస్సు యాత్ర సాగింది.

నేడు విశాఖ, కాకినాడ, ప్రకాశం జిల్లాల్లో యాత్ర..

ఈ సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం విశాఖపట్నం జిల్లా గాజువాక, కాకినాడ జిల్లా కాకినాడ రూరల్, ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గాల్లో జరుగుతుంది.

కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు/సాక్షి, అమరావతి : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే సామాజిక సాధికారత సాధ్యమైందని స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు చెప్పారు. రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా వైఎస్ జగన్ పాలిస్తున్నారని.. అందుకే తమ పథకాలను చంద్రబాబు కూడా కాపీ కొట్టడానికి తయారైపోయారని వారు ఎద్దేవా చేశారు. పేదల పక్షాన నిల్చొని పోరాడే దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవడం చారిత్రక అవసరమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక సాధికార యాత్రలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో జరిగిన బహిరంగ సభలో అశేష జనవాహినిని ఉద్దేశించి వీరు ప్రసంగించారు.

సభలో మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. చంద్రబాబు బడుగు బలహీన వర్గాల వారిని హీనంగా చూశారని.. కష్టం చెప్పుకోవడానికి వచ్చిన మత్స్యకారులతో అనుచితంగా మాట్లాడారని, అలాగే.. నాయీ బ్రాహ్మణులతో కూడా నీచంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని అవహేళన చేశారని ఆయన గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చట్టసభలు, కార్పొరేషన్ పదవుల్లో సీఎం జగన్ పెద్దపీట వేశారని సీదిరి అప్పలరాజు చెప్పారు. గతంలో మన పిల్లల బతుకులు మార్చాలన్న ఆలోచన ఏ నాయకుడికీ రాలేదని, కానీ.. జగన్ మాత్రం అమ్మఒడి అందించి పేదల చదువులు ఆగకుండా వారి బతుకుల్లో దీపాలు వెలిగించారని కొనియాడారు.

అవినీతి మరక లేకుండా 'సంక్షేమం' : ధర్మాన

అనంతరం.. మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచిని గుర్తుచేసేందుకే ఈ సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఒకప్పుడు ఏదైనా కార్యక్రమం తలపెడితే మూడు నాలుగు ప్రభుత్వాలు మారితే గానీ అది కార్యరూపం దాల్చేది కాదని.. కానీ, వైఎస్ జగన్ సీఎం అయ్యాక పనుల్లో వేగం కనిపిస్తోందని.. పాలనలో ఆయన కొత్త ఒరవడి సృష్టించారని తెలిపారు. ఉద్యమాలు జరిగితేగానీ జరగని పనులు ప్రస్తుత ప్రభుత్వం సులభంగా చేస్తూ పాలనలో సమూల మార్పులు తీసుకొచ్చిందన్నారు. సంక్షేమ పథకాల కింద రూ.రెండు లక్షల ముప్పై వేల కోట్లను ప్రజల ఖాతాల్లో ఒక్క రూపాయి అవినీతి మరక లేకుండా జమచేశారని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరుకు ఇది మచ్చుతునక అని ధర్మాన అన్నారు. చంద్రబాబు కూడా ఈ సంక్షేమ పథకాలపై ఎలాంటి అవినీతి ఆరోపణ చేయలేకపోయారన్నారు. బాబు పాలనకు, జగన్ పాలనకు మధ్యనున్న తేడాను ప్రజలే బేరీజు వేసుకోవాలని ఆయన కోరారు. బాబు జీవితమంతా తన వారికి దోచి పెట్టడానికి, దోచుకున్నది దాచుకోవడానికే సరిపోయిందని ధర్మాన ఎద్దేవా చేశారు.

పేదలు తలెత్తుకుని బతికేలా..

ఇక మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో పేదలు తలెత్తుకుని బతికేలా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు తన మనవళ్లను ఇంగ్లిష్ మీడియంలో చదివిస్తూ పేదలకు మాత్రం ఆంగ్ల మాధ్యమం వద్దంటూ కోర్టుకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి వంటివి పేద విద్యార్థులకు వరమని ఆయన తెలిపారు. తన దృష్టిలో ఇద్దరే ఇద్దరు మామలని.. ఒకరు చందమామ అయితే మరొకరు జగన్ మామ అని కొనియాడారు. మరోవైపు.. జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు నిర్వహించడం సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే సాధ్యమన్నారు. ఇది మన స్వాభిమాన ఆత్మగౌరవ యాత్ర అని తమ్మినేని అభివర్ణించారు. జగన్ బటన్ నొక్కితే నేరుగా లబ్ధిదారులకే వెళ్తుందని, మధ్యవర్తిత్వం లేని పాలన అందిస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ ఎన్ని బటన్‌లు నొక్కారో అందుకున్న వారికే తెలుసునన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పాలవలస శ్రీకాంత్, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, రెడ్డి శాంతి, విశ్వాసరాయి కళావతి, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు పావలా వడ్డీకే రుణాలు

- ఒక్కో లబ్ధిదారుకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు అదనంగా రూ.35 వేల రుణం
- రెండో దశలో మార్చి నాటికి 5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం
- ఇప్పటివరకు 12.61 లక్షల మంది లబ్ధిదారులకు పావలా వడ్డీ రుణాలు
- మిగతా లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోండి
- కలెక్టర్లతో సమీక్ష సందర్భంగా సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను సొంతంగా నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పావలా వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తోంది. ఇప్పటికే ఇళ్ల లబ్ధిదారుల్లో 79 శాతం మందికి పావలా వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుండగా.. ఈ మొత్తానికి అదనంగా ఒక్కో లబ్ధిదారుకు రూ.35 వేల చొప్పున పావలా వడ్డీకి రుణాలు మంజూరు చేయిస్తోంది. లబ్ధిదారులకు ఉచితంగానే ఇసుక సరఫరా చేస్తున్న ప్రభుత్వం ఇంటికి అవసరమైన ఇతర సామగ్రిని తక్కువ ధరకే సరఫరా చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 16,06,301 మంది లబ్ధిదారులు సొంతంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. ఇందులో 12,61,203 మందికి పావలా వడ్డీకి రూ.4,443.13 కోట్ల రుణాన్ని బ్యాంకులు మంజూరు చేశాయి. ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు మహిళల పేరుతో చేసినందున పావలా వడ్డీ రుణాలు మహిళల పేరుమీదే ఇస్తున్నారు.

నిర్మాణాలపై సీఎస్ సమీక్ష

ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పేదల ఇళ్ల నిర్మాణాల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్షించారు. వర్షాకాలం ముగిసిన దృష్ట్యా ఇళ్ల నిర్మాణాలను మరింత వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి వారం ఎన్ని ఇళ్లు పూర్తి చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించుకుని.. ఆ



లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు తరచూ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించాలని సూచించారు. పావలా వడ్డీ రుణాలు మంజూరు చేయించడంపై శ్రీకాకుళం, ఎన్టీఆర్, చిత్తూరు, నెల్లూరు, విశాఖ జిల్లా కలెక్టర్లు మరింత దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు.

వెనుకబడిన జిల్లాల్లో మరింత దృష్టి

లబ్ధిదారులకు మరింత ఆర్థిక వెసులుబాటు కల్పించేలా బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నామని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్‌జైన్ చెప్పారు. ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ప్రత్యేక సూచనలు ఇచ్చారన్నారు. పావలా వడ్డీ రుణాలు మంజూరులో నాలుగైదు జిల్లాలు వెనుకబడగా.. ఆయా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారన్నారు. ఇప్పటికే ఐదు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసినందున అదే స్ఫూర్తితో రెండో దశలో మరో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు వారం వారం లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జైన్ పేర్కొన్నారు.

జిల్లాల వారీగా పావలా వడ్డీ రుణాల మంజూరు ఇలా..

జిల్లా	లబ్ధిదారుల సంఖ్య	మంజూరు శాతం	రుణం (రూ.కోట్లలో)
పల్నాడు	39,507	100	139.18
ప్రకాశం	39,536	93	139.29
మన్యం	23,293	93	82.06
నంద్యాల	37,471	92	132.01
కర్నూలు	36,875	91	129.91
శ్రీసత్యసాయి	54,441	91	191.80
ప.గోదావరి	63,034	89	222.07
విజయనగరం	65,328	87	230.15
ఏలూరు	73,042	87	257.33
బాపట్ల	26,979	86	95.05
అన్నమయ్య	63,230	85	222.76
అనంతపురం	53,441	85	188.17
కోనసీమ	20,008	83	70.49
కృష్ణా	70,594	82	248.70
తూ.గోదావరి	53,241	82	187.57
తిరుపతి	56,679	81	199.68
గుంటూరు	52,264	79	184.13
వైఎస్సార్	76,020	78	267.82
అనకాపల్లి	43,904	77	154.67
కాకినాడ	53,337	77	187.91
శ్రీకాకుళం	55,125	77	194.21
ఎన్టీఆర్	55,942	69	197.08
చిత్తూరు	43,791	63	154.28
నెల్లూరు	42,394	54	149.35
విశాఖ	61,727	50	217.46
మొత్తం	12,61,203	79	4,443.13

ఏటా కొత్త వ్యాధికారకం!

- మూడు దశాబ్దాల్లో 30 వ్యాధికారకాల ఉద్భవం
- వాటిలో ఎక్కువ శాతం వ్యాధికారకాలు జంతువుల నుంచి వచ్చినవే
- ఏకీకృత కార్యాచరణతోనే అరికట్టవచ్చంటున్న డబ్ల్యూహెచ్‌వో

సాక్షి, హైదరాబాద్: మానవాళికి అంటువ్యాధుల ముప్పు పెరుగుతోంది. కోవిడ్ వైరస్ వ్యాప్తి కారణంగా యావత్ ప్రపంచమంతా దాదాపు మూడేళ్లపాటు అతలాకుతలమైంది. వందల ఏళ్లుగా ఈ వ్యాధికారకాలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రస్తుతం వాటి సంఖ్య మరింత ఎక్కువవుతోందని శాస్త్రవేత్తలు ఆందోళన చెబుతున్నారు. గత మూడు దశాబ్దాల్లో ఏకంగా 30 రకాల వ్యాధికారకాలు ఉద్భవించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పరిశోధనలో తేలింది. ఈ లెక్కన ఏటా సగటున ఓ వ్యాధికారకం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యాధికారకాల ఉద్భవంలో అత్యధికం జంతువుల నుంచే కావడం గమనార్హం.

అడవుల నరికివేత, జంతువుల వలసలు...

అంటువ్యాధుల కారకాలపై డబ్ల్యూహెచ్‌వో ఎప్పటికప్పుడు పరిశోధనలు చేస్తూనే ఉంది. ప్రధానంగా జంతువుల నుంచే వ్యాపిస్తున్నవి 60 శాతంగా ఉంటున్నట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అడవుల నరికివేత వల్ల జంతువుల వలసలు పెరగడంతో పాటు అటవీ జంతువులను ఆహారంగా మార్చుకోవడం, జంతు ఉత్పత్తుల వాడకంతో ఈ పరిస్థితులు ఎదురవుతున్నట్లు డబ్ల్యూహెచ్‌వో గుర్తించింది. మనుషుల ఆహార జాబితాలో గతంలో శాకాహార జంతువులే ఉండగా క్రమంగా మాంసాహార జంతువులూ చేరాయి. శాకాహార జంతువులతో పోలిస్తే మాంసాహార జంతువుల జీర్ణవ్యవస్థ పూర్తి భిన్నంగా ఉంటుంది. ఆహార అరుగుదల కోసం ఉపయోగపడే బ్యాక్టీరియా, ఇతరాత్ర మానవ శరీరానికి ప్రమాదకారిగా మారుతున్న సందర్భాలున్నాయి. కోవిడ్–19 వైరస్ ఇదే తరహాలో ఉద్భవించిందనే వాదనలు సైతం ఉన్నాయి. ఎబోలా, రేబిస్ మొదలైన వైరస్‌లు ఈ కోవకు చెందినవే.

కట్టడి కోసం 'వన్ హెల్త్'..

డబ్ల్యూహెచ్‌వో గణాంకాల ప్రకారం 2003 నుంచి ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధుల కారణంగా కోటి స్నరకుపైగా మరణాలు సంభవించాయి. అలాగే ప్రపంచ దేశాలు 4 ట్రిలియన్ డాలర్ల నష్టాన్ని మూటగట్టుకున్నాయి. జంతువుల నుంచి వచ్చే వ్యాధికారకాలను ఎదుర్కొనేందుకు, వాటిని నిలువరించేందుకు డబ్ల్యూహెచ్‌వో వన్‌హెల్త్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ, జంతు సంరక్షణ సంస్థలు, వైద్య నిపుణులు, వెటర్నరీ నిపుణులు కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తోంది. వీటివల్ల జంతు వ్యాధికారకాలను నిలువరించవచ్చని డబ్ల్యూహెచ్‌వో చెబుతోంది. ఆర్థికపరమైన భారం కూడా తగ్గుతుందని భావిస్తోంది.

కోవిడ్‌పై పోరులో 28 విభాగాల కృషి

కోవిడ్ వ్యాప్తి తర్వాత ఆరోగ్యంపై మరింత శ్రద్ధ పెరిగింది. కోవిడ్ టీకాల కోసం దేశంలో 28 విభాగాలు సమన్వయంతో పనిచేసి అద్భుత ఫలితాలు సాధించాయి. పర్యావరణం, మొక్కలు, జంతువులు, మానవాళి మధ్య సంబంధాల్లో సమతౌల్యం పాటించాలి. దాని అమలుకు సంబంధించినదే వన్ హెల్త్ విధానం. డబ్ల్యూహెచ్‌వో రూపొందించిన ఈ విధానం ఆర్థికంగా కలిసిరావడంతో పాటు ఎక్కువ ఫలితాలు వస్తాయి. ప్రస్తుతం ప్రయోగ దశలో ఉన్న ఈ అంశం అన్ని దేశాలు పూర్తిస్థాయిలో అమలు చేసే స్థాయికి చేరుకుంటాయని ఆశిస్తున్నా. – డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కమిటీ కన్వీనర్

వచ్చే ఏడాది 300 వర్సిటీల్లో ఆనర్స్ డిగ్రీ



- ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 150 వర్సిటీల్లో మాత్రమే అమలు
- ఇప్పటికే 105 వర్సిటీల్లో ప్రారంభం
- విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు ఆనర్స్ డిగ్రీతో మేలు

సాక్షి, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా 300కు పైగా విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ ఆనర్స్ (నాలుగేళ్ల డిగ్రీ) ప్రోగ్రామ్ అందుబాటులోకి రానుంది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా విద్యార్థులకు పరిశోధన స్పెషలైజేషన్ డిగ్రీని అందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నాలుగేళ్ల డిగ్రీని ప్రవేశపెట్టింది. ఆనర్స్ డిగ్రీ అందించేందుకు 150 విశ్వవిద్యాలయాలు ముందుకు రాగా, ఇప్పటికే 105 వర్సిటీలు కోర్సు ప్రారంభించాయి. 19 కేంద్రీయ, 24 రాష్ట్ర స్థాయి, 44 డీమ్డ్, 18 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఈ కోర్సులను అందిస్తున్నాయి.

నాలుగేళ్ల కోర్సు ఐచ్ఛికమే

నాలుగేళ్ల డిగ్రీ పాఠ్యాంశాలు, క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం రూపొందించారు. నాలుగేళ్ల డిగ్రీ విద్యార్థుల ఐచ్ఛికమే. మూడేళ్ల సాంప్రదాయ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఆసక్తి ఉన్న వారు నాలుగో ఏడాది ఆనర్స్ డిగ్రీని అభ్యసించవచ్చు. విద్యార్థులు 120 క్రెడిట్‌లు పూర్తి చేసిన తర్వాత మూడేళ్ల యూజీ డిగ్రీని, 160 క్రెడిట్‌లు పూర్తి చేస్తే ఆనర్స్ డిగ్రీని అందిస్తారు. పరిశోధన స్పెషలైజేషన్ అభ్యసించే వారు నాలుగేళ్ల యూజీ కోర్సుల్లో పరిశోధన ప్రాజెక్టు చేపట్టాలి. దీంతో వారికి రీసెర్చ్ స్పెషలైజేషన్‌తో పాటు ఆనర్స్ డిగ్రీ లభిస్తుంది. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది. విదేశాల్లో చదువుకునేందుకు భారతీయ విద్యార్థుల్లో డిమాండ్ పెరుగుతోంది. గతేడాది నవంబర్ వరకు 6 లక్షల మందికిపైగా ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లారు. కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, అమెరికాలో ఎక్కువ మంది భారతీయులు చదువుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

రేపు రైతన్నలకు 'రైతు భరోసా'

▶ మొదటి పేజీ తరువాయి

కౌలుదారులకు కూడా తొలివిడతగా మే నెలలో రూ.7,500, రెండో విడతగా అక్టోబర్‌లో రూ.4 వేలు, మూడో విడతగా జనవరిలో రూ.2 వేలు చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు. 2019–20లో 46,69,375 మందికి రూ.6,173 కోట్ల మేర పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందచేసింది. 2020–21లో 51,59,045 మందికి రూ.6,928 కోట్లు మేర లబ్ధి చేకూర్చగా 2021–22లో 52,38,517 మందికి రూ.7,016.59 కోట్ల సాయాన్ని పంపిణీ చేసింది. 2022–23లో 51,40,943 మందికి రూ.6,944.50 కోట్ల పెట్టుబడి సాయాన్ని నేరుగా ఖాతాలకు జమ చేశారు.

నాలుగున్నరేళ్లలో రూ.33,209.81 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి విడతలో 52,57,263 మంది అర్హత పొందారు. వీరిలో 50,19,187 మంది భూ యజమానులు కాగా 1,46,324 మంది కౌలుదారులు, 91,752 మంది అటవీ భూ సాగుదారులున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.7,500 చొప్పున తొలి విడతగా జూన్ 1వ తేదీన భూ యజమానులకు, సెప్టెంబర్ 1న కౌలుదారులు, అటవీ సాగుదారులకు రూ.3,942.95 కోట్ల మేర సాయాన్ని అందించారు. రెండో విడతలో 53,52,905 మంది అర్హత పొందారు. వీరిలో భూ యజమానులు 51,00,065 మంది కాగా 1,59,674 మంది కౌలుదారులు, 93,168 మంది అటవీ భూ సాగుదారులు ఉన్నారు. తొలి విడతతో పోల్చుకుంటే 80,878 మంది భూ యజమానులు, 13,350 మంది కౌలుదారులు, 1416 మంది అటవీ భూసాగుదారులు కలిపి 95,642 మంది కొత్తగా అర్హత పొందారు. వీరికి తొలి విడత సాయంతో కలిపి రూ.11,500 జమ చేయనున్నారు. అర్హత పొందిన 53.53 లక్షల మంది రైతు కుటుంబాలకు 7న రెండో విడతగా రూ.2,204.77 కోట్ల సాయాన్ని అందించనున్నారు. ఈ మొత్తంతో కలిపితే ఈ ఏడాది రూ.6,147.72 కోట్ల సాయాన్ని అందుకున్నట్లవుతుంది. తాజాగా జమ చేయనున్న రెండో విడత సాయంతో కలిపితే గత నాలుగున్నరేళ్లలో సగటున 53.53 లక్షల మందికి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.33,209.81 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందచేసినట్లవుతుంది.

రేపు పుట్టపర్తికి సీఎం జగన్

సీఎం వైఎస్ జగన్ మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి పుట్టపర్తి చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొని వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం అక్కడి నుంచి బయలుదేరి తిరిగి తాడేపల్లి చేరుకుంటారు.

చిన్నారుల ఆరోగ్యానికి రక్ష

▶ మొదటి పేజీ తరువాయి

సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల బలోపేతంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా టీటీడీ సహకారంతో తిరుపతిలో చిన్న పిల్లల హృదయాలయాన్ని ప్రారంభించింది. ఈ ఆస్పత్రి ప్రస్తుతం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోంది. అంతేకాకుండా అలిపిరి వద్ద రూ.450 కోట్లతో పీడియాట్రిక్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని టీటీడీ సహకారంతోనే ఏర్పాటు చేస్తున్నారు. ఆ తరహాలోనే విశాఖ, విజయవాడల్లోనూ ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో 500 పడకల సామర్థ్యంతో ఆస్పత్రి ఏర్పాటుకు డీఎంఈ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఒక్కో చోట ఆస్పత్రి భవనాల నిర్మాణం, ఇతర సివిల్ పనుల కోసం రూ.180 కోట్ల మేర ఖర్చు అవనున్నట్టు ఏపీఎంఎస్ఐడీసీ అంచనా వేసింది. అధునాతన వైద్య పరికరాల కోసం ఇంకా అదనంగా ఖర్చు పెట్టనున్నారు. గుండె, కిడ్నీ, మెదడు, కాలెయ సంబంధిత జబ్బులతో పాటు, చిన్న పిల్లల్లో క్యాన్సర్‌కు, ఇతర అన్ని రకాల వైద్య సేవలు అందించేలా 17 స్పెషాలిటీలు, సూపర్ స్పెషాలిటీలతో ఈ రెండు ఆస్పత్రులు ఏర్పాటు కానున్నాయి.

సీఎం జగన్ ఆదేశాల మేరకు..

ప్రభుత్వ రంగంలోనే చిన్న పిల్లలకు పూర్తి స్థాయిలో వైద్య చికిత్సలు అందుబాటులోకి తేవాలన్నది సీఎం జగన్ లక్ష్యం. విశాఖ, విజయవాడల్లో పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటి ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రజలకు మేలు చేకూరుతుంది. – డాక్టర్ నరసింహం, డీఎంఈ

కొనసాగిన పింఛన్ల పంపిణీ



చిత్తూరు జిల్లా బైటపల్లికి చెందిన రాజారెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కల్యాణి



పశ్చిమగోదావరి జిల్లా పాందువ్వలో సీతారామయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ హరీశ్



గుంటూరులో శ్రీహరికి వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వార్డు వలంటీర్ మహేష్

మూడు రోజులు వానలు!

- పలుచోట్ల మోస్తరుగా కురిసే అవకాశం
- కొనసాగుతున్న ఈశాన్య, తూర్పు గాలులు
- భారత వాతావరణ శాఖ వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: చాలా రోజుల తర్వాత రాష్ట్రంలో వానలు కురుస్తున్నాయి. రానున్న మూడు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర తమిళనాడు, దానికి ఆనుకుని ఉన్న పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సగటున సముద్రమట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. మరో వైపు రాష్ట్రంపైకి ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయి. అదే సమయంలో ఇన్నాళ్లూ స్తబ్దుగా ఉన్న ఈశాన్య రుతుపవనాలు ఒక మోస్తరు చురుకుదనాన్ని సంతరించుకున్నాయి. వీటన్నింటి ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది. అదే సమయంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు కూడా సంభవించవచ్చని పేర్కొంది. కాగా, ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి.

వైజాగ్ నేవీ మారథాన్ విజేతలు శిఖంధర్, ఆశా

విశాఖ స్పోర్ట్స్: విశాఖ సాగరతీరంలో ఆదివారం జరిగిన వైజాగ్ నేవీ మారథాన్ 8వ ఎడిషన్ ఓపెన్‌లో శిఖంధర్, మహిళల్లో ఆశా విజేతలుగా నిలిచారు. వైజాగ్ నేవీ మారథాన్ పరుగు సాగరతీరంలోని వైఎస్సార్ విగ్రహం నుంచి అథ్లెట్లు విజయమే లక్ష్యంగా ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల పరుగుపెట్టారు. ఔత్సాహికులు సరదాగా ఐదు కిలోమీటర్ల మేర ఫన్ రన్ చేపట్టారు. ఫుల్ మారథాన్ 42.2 కిలోమీటర్లు, హాఫ్ మారథాన్ 21.1 కిలోమీటర్లు, 10 కిలోమీటర్ల రేస్‌ను నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. మారథాన్ రేస్, ఫన్ పరుగు ఆర్కే బీచ్ మీదుగా నేవల్ కోస్టల్ బ్యాటరీ వైపు వద్ద యూటర్న్ తీసుకుని.. కాళీమాత ఆలయం మీదుగా వీఎంఆర్‌డీఏ ఎంజీఎం పార్క్ వద్దకు చేరుకోగానే ముగిసింది. పది కిలోమీటర్ల పరుగు తెన్నేటి వద్ద యూ టర్న్ తీసుకోగా, హాఫ్ మారథాన్ పరుగువీరులు రుషికొండ గాయత్రి కళాశాల దగ్గర యూ టర్న్ తీసుకున్నారు. పూర్తి మారథాన్‌లో అథ్లెట్లు ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని చేపలుప్పాడ దగ్గర యూ టర్న్ తీసుకుని ప్రారంభస్థానానికి చేరుకున్నారు. వీఎంఆర్డీఏ పార్క్‌లో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పురుషుల ఓపెన్ హాఫ్ మారథాన్‌లో దీపక్ కుంబార్, 10 కిలోమీటర్ల పరుగులో సోనుకుష్వా విజేతలుగా నిలిచారు. మహిళా విభాగం హాఫ్ మారథాన్‌లో లిలియన్ రుట్టో, 10 కిలోమీటర్ల పరుగులో మేరీగ్రేస్ విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు.



వైజాగ్ మారథాన్‌లో పాల్గొన్న అథ్లెట్లు, విద్యార్థినులు

రైతులను రెచ్చగొట్టాలన్నదే టీడీపీ పన్నాగం

- రాష్ట్ర విపత్తుల నిర్వహణ విధివిధానాల మేరకే కరువు మండలాల ప్రకటన
- కరువు రాక ముందే రామోజీ గగ్గోలు
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిబంధనల మేరకే కరువు మండలాల ప్రకటన ఉంటుందని, అయితే కరువు రాక ముందే రామోజీరావు తన పత్రికలో కథనాలతో గగ్గోలు పెడుతున్నారని, రైతులను రెచ్చగొట్టాలన్నదే టీడీపీ



పన్నాగమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నీటి పారుదల శాఖ ఇచ్చే వివరాల ప్రకారం రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ ప్రణాళికలు తయారు చేశామని, ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సాగునీరు అందక పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. రబీ సీజన్‌లో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, ఆర్బీకేల్లో అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు మంత్రి వివరించారు. 14 ఏళ్ల బాబు పాలనలో కరువు విలయతాండవం చేసిందని గుర్తుచేశారు. తెలుగు రైతుల స్టీరింగ్ కమిటీ పేరుతో టీడీపీ నాయకులు పొలాలను పరిశీలిస్తున్నారని, నాడు వ్యవసాయశాఖ మంత్రులుగా ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అప్పట్లో కరువు వస్తే ఏం వెలగబెట్టారో చెప్పాలన్నారు. రైతులకు హామీలిచ్చి ఓట్లు దండుకుని మోసం చేసిన టీడీపీ నేతలు ఏముఖం పెట్టుకుని అన్నదాతల వద్దకు వెళ్తారని ప్రశ్నించారు. ఎన్నికల నేపథ్యంలో రైతులను రెచ్చగొట్టాలన్న దుర్మార్గపు ఆలోచనలతోనే అచ్చెన్నాయుడు, లోకేశ్‌లు లేఖలు రాశారని ధ్వజమెత్తారు. కాగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో విడత రైతు భరోసా నగదును రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని పుట్టపర్తిలో ప్రారంభిస్తారని మంత్రి కాకాణి తెలిపారు.

పాడిరైతుల ఆర్థిక అభ్యున్నతికి చేయూత

కృత్రిమ గర్భధారణ పద్ధతిలో పిండోత్పత్తి.. పెయ్యల జననానికి 6వేల ఇంజెక్షన్లు సిద్ధం

ఒక్కో డోసుపై ప్రభుత్వం రూ.850 రాయితీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ)

పాడి రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే గ్రామాల్లో అమూల్ పాలసేకరణ కేంద్రాలును ఏర్పాటు చేసింది. మరోపక్క కృత్రిమ పద్ధతిలోఇంజెక్షన్ల ద్వారా పెయ్యదూడల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. తద్వారా పాడి పరిశ్రమను బలోపేతం చేయాలని సంకల్పించింది. ఆవులు, గేదెలు గతంలో చూలి కట్టాలంటే ఎద్దులు, దున్నలపై ఆధారపడాల్సి వచ్చేది. తర్వాత కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా పశువు గర్భం దాల్చి ఏదో ఒక దూడకు జన్మనిస్తే చాలని రైతులు అనుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. పెయ్యదూడ కావాలంటే ప్రత్యేకంగా ఇంజెక్షన్లు వచ్చాయి. వాటిని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. 'పెయ్యదూడలు పుట్టాలి– రైతన్నకు లక్ష్మీకళ రావాలి' అనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని తీసుకువచ్చింది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈనెల 1 నుంచి ఇంజెక్షన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

ప్రాంతీయ పశువైద్య ఆసుపత్రులు	56
పశువైద్యశాలలు	10
గ్రామీణ పశువైద్య కేంద్రాలు	54
కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రాలు	201

కృత్రిమ గర్భధారణ

రైతులకు పాడి పంటలు రెండు కళ్లు లాంటివి. ఇవి ఒక దానిపై మరొకటి ఆధారపడి రైతుల అభివృద్ధికి దోహదపడతాయి. కాలానుగుణంగా వచ్చిన మార్పులు వల్ల వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం సంతరించుకోవడంతో పాడి పరిశ్రమలో మగజాతి పశువులకు ప్రాధాన్యం తగ్గింది. దీంతో ప్రతీ రైతు తమ ఇంట పెయ్య పుడితే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని భావిస్తున్నారు. వారి ఆకాంక్షలను నిజం చేసేందుకు ప్రభుత్వం పెయ్యదూడల జననానికి కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది.



కృత్రిమ గర్భధారణ పుట్టిన పెయ్యదూడలు

జిల్లాలో 6 వేల దోసులు

పాడి పశువుల కృత్రిమ గర్భధారణకు జిల్లా వ్యాప్తంగా 6 వేల డోసుల ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచామని పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. వీటి ఆయా పశువైద్యశా కేంద్రాల వద్ద పాడి రైతులు పొందవచ్చునన్నారు. ఒక్క డోసు ప్రభుత్వానికి రూ. 1350 ఖర్చవుతుండగా ప్రభుత్వం రైతులకు రూ.850 సబ్సిడీ ఇస్తుంది. రైతులు రూ.500 చెల్లించి ఈ ఇంజెక్షను పశువులకు వేయించుకోవచ్చు. తద్వారా మేలుజాతి పెయ్యదూడలు జన్మించి పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది.

ఫలించకపోతే నగదు వాపసు

పెయ్యదూడలు కావాల్సిన రైతులు రూ.500 చెల్లించి ఆవుకుగానీ, గేదెకుగానీ ఇంజక్షన్ వేయించుకోవచ్చు. ఒకసారి తప్పితే రెండోసారి ఇంజక్షన్ వేస్తారు. వైద్యుల సూచనల మేరకు వాటిని పర్యవేక్షించాలి. అప్పటికీ గర్భంగా నిలబడకపోతే నగదు వాపసు ఇచ్చేస్తారు. పాడి రైతులకు ఇదొక చక్కని అవకాశం.

– యాళ్ల దొరబాబు, చైర్మన్ డీఎల్‌డీఏ

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని ఎదకు వచ్చిన ఆవులు, గేదెలకు ఇంజెక్షన్లు వేయించాలి. గత ఏడాది 2212 సెమన్ డోసులు సరఫరా చేశాం. ఈ ఏడాది 6 వేల కృత్రిమ గర్భదారణ డోసులు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆయా పశువైద్య కేంద్రాల్లో అందంచనున్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– డీబీఆర్ అంబేడ్కర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి

ఫుల్ జోష్

భారీగా పర్యాటకుల రాకతో మన్యం పులకించిపోయింది. వీకెండ్ కావడంతో సందర్శనీయ ప్రాంతాలు కిటకిటలాడాయి. మేఘాల కొండ, బొర్రా గుహలు, గిరిజన మ్యూజియం, చాపరాయి, కొత్తపల్లి జలపాతాల వద్ద సందడి నెలకొంది.



జెండాకొండపై మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



వంజంగి హిల్స్ వద్ద పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

సాక్షి, పాడేరు: జిల్లాలోగల ప్రముఖ పర్యాటక కేంద్రాలన్నీ ఆదివారం కళకళలాడాయి. పాడేరు మండలంలోని వంజంగి కొండ వద్ద ఉదయం నుంచి పర్యాటకులు సందడి చేశారు. ఆకాశాన్ని తాకుతున్న మేఘాలను, మంచు అందాలను తిలకించారు.

చెరువులవేనంలో..

చింతపల్లి రూరల్: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన చెరువులవేనంలో పర్యాటకుల సందడి నెలకొంది. వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను తిలకించారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం పర్యాటకుల రాకతో కళకళలాడింది. కుటుంబ సమేతంగా తరలివచ్చి జలపాతంలో స్నానాలుచేస్తూ సందడి చేశారు.

హుకుంపేట: జెండాకొండకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. పాల సముద్రాన్ని తలపించే మంచు అందాలు, సూర్యోదయం వేళ ప్రకృతి రమణీయతను తిలకించి మధురానుభూతి పొందారు. ధింసా రాళ్లు, తేనెపట్టు అందాలను తిలకించారు.

మురిసిన చాపరాయి

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం పర్యాటకుల రాకతో మురిసిపోయింది. జలపాతంలో రోజంతా స్నానాలు చేస్తూ సందడి చేశారు. వలిసె, పొద్దుతిరుగుడు తోటల్లో ఫొటోలు తీసుకుని సందడి చేశారు.

బొర్రా గుహలకు రూ.2.46 లక్షల ఆదాయం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు ఆదివారం రద్దీగా కనిపించాయి. బొర్రాగుహలను 2,972 మంది సందర్శించగా రూ.2.46 లక్షల ఆదాయం వచ్చినట్టు బొర్రా మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.తాటిగుడ, కాఫీ ప్లాంటేషన్, కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు కళకళలాడాయి.



తాటిగుడ వ్యూపాయింట్‌కు తరలివచ్చిన సందర్శకులు



చెరువులవేనంలో వ్యూపాయింట్ వద్ద సందడి



మేఘాల కొండపై కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు



పొద్దు తిరుగుడు తోటల్లో పర్యాటకులు

ఆయుర్వేదం సర్వరోగ నివారిణి



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న కేంద్ర ఆయుష్ శాఖ ఏడీ డాక్టర్ వెంకటేష్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): ఆయుర్వేదం సర్వరోగ నివారిణి అని కేంద్ర ఆయుష్ శాఖ ఏడీ డాక్టర్ డి.వెంకటేష్ అన్నారు. ధన్వంతరి జయంతి సందర్భంగా కేంద్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో విశాఖ ఆర్కే బీచ్ వద్ద బీచ్ రోడ్డులో రైడర్స్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ సిరిపురం, జూపార్కు, మద్దిలపాలెం మీదుగా ఏయూ మైదానానికి చేరుకొంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులంతా ఆయుర్వేద వైద్యాన్ని ఆదరించాలన్నారు. ఆయుర్వేదంలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. విమ్స్‌లో 50 పడకలతో ఆయుర్వేద ఆస్పత్రి నిర్మాణం త్వరలో చేపడతామన్నారు. ఆయుష్ పూర్వ సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఈశ్వరరావు మాట్లాడుతూ కేజీహెచ్, మధురవాడ, ఆనందపురం, ఉక్కునగరం, గాజువాకలో ఆయుష్ క్లినిక్‌లు ఉన్నాయన్నారు. ఆయుర్వేదంలో సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ పరిశోధక అధికారి ఎ.జె.వి. సాయి ప్రసాద్, వరల్డ్ రైడర్ ధవల భరద్వాజ్ పాల్గొన్నారు.

మగాళ్లు.. తగ్గేదేలే


ఫ్యాషన్‌లో మగువలతో పోటీ పడుతున్న పురుషులు

- ట్రెండ్స్‌కు తగ్గట్టుగా వస్త్రధారణ
- జుట్టు, గడ్డం గ్రూమింగ్ పై ప్రత్యేక శ్రద్ధ

సాక్షి, అమరావతి: ఫ్యాషన్.. ప్రపంచానికి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఫ్యాషన్ పేరు చెప్పి మన దేశంలో ఏటా రూ.వేల కోట్ల వ్యాపారం సాగుతోంది. ముఖ్యంగా మహిళలు సౌందర్యం, అలంకరణ వస్తువుల కోసం విపరీతంగా ఖర్చు చేస్తుంటారు. ఈ విషయంలో మగవారు మగువలకు ఏమాత్రం తక్కువ కాదని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా పురుషుల ఫ్యాషన్ మార్కెట్ 11 శాతం వృద్ధి చెందడమే దీనికి నిదర్శనంగా చూపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మార్కెట్ టర్నోవర్ ఏటా రూ.31 వేల కోట్లు అంటే ఆశ్చర్యం కలగక మానదు. ఇంతలా మగాళ్ల తగ్గట్లేదంటే మారుతున్న సామాజిక ధోరణులు (ట్రెండ్స్) దీనికి కారణమంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. చర్మ సంరక్షణ, జుట్టు సంరక్షణ, గడ్డం గ్రూమింగ్, ఫెర్ఫ్యూమ్స్‌కు సంబంధించి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వినియోగం పురుషులు ప్రపంచ ట్రెండ్‌లను అనుసరించేలా చేస్తోంది.

అలా మొదలై.. ఇలా పెరిగింది

పురుషులు వస్త్రధారణ, అలంకరణలో ప్రత్యేకత చూపించడమేది కొత్తగా వచ్చిన ట్రెండ్ కాదు. పూర్వకాలం నుంచీ రాజసాన్ని, దర్పాన్నీ ప్రదర్శించే విధంగా దుస్తులను ధరించే అలవాటు ఉండేది. మహారాణి, యువరాణులు మెడలో బంగారం, వజ్రాల నగలు వేసుకుంటే.. వారికి సమానంగా రాజు, యువరాజులు కూడా హారాలు, కిరీటాలు ధరించే వారు. రాజుల తరువాత మండలాధీశులు, వ్యాపారులు కొంతవరకూ ఇలాంటి అలంకరణలకు ప్రాధాన్యత ఇచ్చే వారు. అయితే సామాన్య ప్రజల్లో ఇలాంటివి చాలా అరుదుగా ఉండేవి. వారంతా సాధారణ వస్త్రాలు, మామూలు నగలు ధరించే వారు. కానీ.. కాలంతో పాటు పేద, ధనిక అనే తేడా లేకుండా ఎవరి స్థాయిలో వారు ఫ్యాషన్‌గా కనిపించేందుకు తాపత్రయపడటం ప్రారంభించారు. కేవలం విలువైన వస్తువులు ధరించడమే ఫ్యాషన్ అనుకునే స్థాయి నుంచి తాము ఏది ధరిస్తే అదే ఫ్యాషన్ అనే స్థితికి వచ్చారు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఏది ట్రెండింగ్‌లో ఉందో చూసుకుని ఆ ఫ్యాషన్ మోడల్‌ను ఫాలో అయిపోతున్నారు. కొందరు సినిమా, క్రికెట్ స్టార్లు తమ ప్రత్యేక వస్త్రధారణ, అలంకరణతో ట్రెండ్ సెట్ చేస్తూ, యూత్‌కి మార్గదర్శకం అవుతున్నారు. దీనికి తగ్గట్టుగానే కార్పొరేట్ దిగ్గజాలు వారి రిటైల్ అవుట్‌లెట్లలో మగవారి కోసం ప్రత్యేకంగా బ్రాండెడ్ వస్త్రాలు, వస్తువులను అందుబాటులో ఉంచుతున్నారు.



దుస్తుల తర్వాత ప్రాధాన్యం వాటికే..

పురుషులు ఎక్కువగా ఖర్చు చేస్తున్న వాటిలో మొదటి స్థానంలో దుస్తులున్నాయి. అంతర్జాతీయ ఫ్యాషన్లను యథాతథంగా అనుసరిస్తున్నారు. ఆన్‌లైన్ ఈ–కామర్స్ సైట్లలో ఆర్డర్ పెడితే ఎక్కడి నుంచైనా కావాల్సిన దుస్తుల్ని ఇంటికి తెప్పించుకునే వెసులుబాటు రావడంతో దుస్తుల ఫ్యాషన్‌లో సరిహద్దులు చెరిగిపోయాయి. మారుతున్న సాంస్కృతిక ప్రమాణాలు ఇందుకు దోహదపడుతున్నాయి. ఎండ ప్రభావం నుంచి మొహాన్ని.. చర్మాన్ని రక్షించే సన్‌బ్లాక్ క్రీమ్‌లు రాసుకోవడాన్ని మగవారు ఒకప్పుడు వింతగా భావించే వారు. కానీ.. ఇప్పుడు క్రీమ్‌లతో పాటు సువాసనలు వెదజల్లే ఫెర్ఫ్యూమ్స్ వాడకం పెరిగింది. పురుషులు మునుపెన్నడూ లేనివిధంగా వ్యక్తిగత సంరక్షణ పద్ధతులను పాటిస్తున్నారు. అంతర్జాతీయ ఫ్యాషన్, జీవనశైలి ధోరణులకు మన దేశంలో పురుషులు ఆకర్షితులవుతున్నారు. అందుబాటులో ఉన్న అనేక మాధ్యమాల ద్వారా తమకు అవసరమైన వాటిపై వారు అవగాహన పెంచుకుంటున్నారు. ఆరోగ్య స్పృహ పెరగడం కూడా ఇందుకు మరో కారణమని చెప్పవచ్చు. ఆడవారితో పాటు పురుషులకు కూడా జుట్టు సంరక్షణ ముఖ్యమని భావిస్తున్నారు. దీనికి తగ్గట్టు మెన్స్ బార్బర్ షాప్‌లు విపరీతంగా పెరిగాయి. ఇవి హెయిర్ కట్‌లతో పాటు గడ్డం ట్రిమ్మింగ్, మానిక్యూర్, పెడిక్యూర్, షేవ్, ఫేషియల్స్ వంటి సేవలను అందిస్తున్నాయి. అంతేకాదు ఇలాంటి చోటనే పురుషులు ఎక్కువగా విశ్రాంతి తీసుకుంటున్నారు. వివిధ వస్త్రధారణ పద్ధతులు, సౌందర్య ఉత్పత్తుల గురించి తెలిపే సామాజిక సమావేశ స్థలాలుగా సెలూన్స్ పరిణామం చెందాయి.



మనకు రెండు చెవులు, ఒక నాలుక ఎందుకున్నాయంటే – ఎక్కువ విని, తక్కువ మాట్లాడటానికి!
– డైయోజినీజ్

సాక్షి
సోమవారం, 6 నవంబర్ 2023

కాలాన్ని గెలిచినవాడు

గతం అనేది ఎక్కడుంది? గతంలో జీవించిన మనుషులు కాలపు పొరల్లో ఎక్కడ చిక్కుకుని ఉన్నారు? గత సంఘటనలు ఏ కాలగర్భంలో వెచ్చగా దాగి ఉన్నాయి? గతం తాలూకు ఆలంబన అంటూ లేకపోతే మనిషికి వర్తమానంలో ఉన్నదేమిటి? గతం అనేది మనిషి యావజ్జీవితపు ధ్రువపత్రం. కానీ గతాన్ని వర్తమానంలోకి లాగే మంత్రదండం ఎక్కడుంది? జ్ఞాపకం ద్వారా మాత్రమే గతాన్ని చైతన్యవంతం చేయగలం. కానీ ఆ జ్ఞాపకం స్వచ్ఛందంగా మనసు లోకి దూకాలి. అలా దూకాలంటే ఇంద్రియాలను ఏదో కదిలించాలి. అది 'బలమైనదే' కానక్కరలేదు. బలంగా ముద్ర వేసినదైతే చాలు. అనుకోకుండా ఒక చలికాలం పూట వెచ్చదనం కోసం అమ్మ ఇచ్చిన టీ కప్పులో 'మడలీన్' అనే చిన్న గుండ్రపాటి కేకును అద్దుకోగానే, ఆ మొదటి రుచి అంగిలికి తాకగానే, ఎప్పుడో చిన్నతనంలో తాము నివసించిన 'కోంబ్రే'లో అనుభవించిన అదే రుచి మార్సెల్ ప్రూస్ట్‌కు చప్పున గుర్తొస్తుంది. ఆ వెనువెంటనే బాల్యంలో తిరగాడిన ఆ ఊరు, ఆ మనుషుల తాలూకు జ్ఞాపకాలు జలజలా రాలుతాయి. ఇక కాలంలో వెనక్కి ఈదుకుంటూ వాళ్ల కుటుంబీకుల పుట్టుపూర్వోత్తరాలు ఏకధారగా వల్లెవేయడానికి కూర్చుంటాడు. అలా గతాన్ని స్వగతంగా మార్చుకోవడం ద్వారా ఇరవయ్యో శతాబ్దపు అత్యంత విస్తారమైన ఆత్మకథాత్మక నవలారాజం 'ఇన్ సెర్చ్ ఆఫ్ లాస్ట్ టైమ్' సాహిత్యలోకానికి అందింది. సుమారు నాలుగు వేల పేజీలున్న ఈ నవల 1913 నుంచి 1927 మధ్య ఏడు భాగాలుగా ప్రచురితమైంది.

ఏ రచయితకైనా గతమే పెట్టుబడి. కానీ ప్రత్యేకించి ఆ గతంలో జీవిత పరమార్థాన్ని అన్వేషించడంలోనే ప్రూస్ట్ రచనా వైభవం దాగివుంది. కాలం అనే విధ్వంసక శక్తిని కళ అనే సాధనంతో ఆయన ఎదుర్కొన్నాడు. కాలంలో కలిసిపోయిన వారిని సాహిత్యం ఊతంగా సజీవ మూర్తులుగా నిలబెట్టాడు. సమకాలీన ఫ్రెంచ్ సమాజపు రీతులు, బాధలు, భయాలు, తపనలు, ఒంటరితనాలు, సరదాలు, సంతోషాలు, నిర్దయలు, క్షమలు, ఇంకా ఆయన సంక్లిష్ట లైంగికేచ్ఛలు అన్నీ అక్షరాల్లోకి తెచ్చాడు. కిటికీలోంచి సముద్రం మీద కనబడే సూర్యోదయాన్ని చూస్తూ అనుభవించే తన్మయత్వంలా రాతను మలిచాడు. చరిత్రకారుడు, తాత్వికుడు, మానసిక శాస్త్రజ్ఞుడు, రాజకీయాంశాల వ్యాఖ్యాత, ఇంకా 'పర్వర్టు', ఇంకా ఒక కవి– ఇలా ఆరుగురు ప్రూస్టులు ఇందులో కనబడతారంటారు ఆడమ్ గోప్నిక్. సంగీతం, సాహిత్యం, యుద్ధం, సమాజం, పెయింటింగ్, శృంగారం, కళలు, అసూయ, ఫ్యాషన్లు– ఇలా ప్రూస్ట్ అభిప్రాయానికి చిక్కకుండా మిగిలిపోయేది ఏదీ ఉండదు. 'తన జీవితపు మెటీరియల్‌ను ఇంత బాగా ఏ రచయితా వాడుకోలేదు' అంటారు టెన్నెసీ విలియమ్స్. 'ఒక రచయిత ఒకసారి చదివితే పూర్తయ్యేట్టయితే ఆ రచయిత పెద్దగా ఏమీ చెప్పనట్టు! హోమర్‌లాగా జీవితకాలం వెంటతెచ్చుకోగలిగే రచయిత ప్రూస్ట్' అంటారు డేనియల్ మెండెల్‌సన్.

కలిగిన ఫ్రెంచ్–యూదు కుటుంబంలో పుట్టాడు మార్సెల్ ప్రూస్ట్ (10 జూలై 1871– 18 నవంబర్ 1922). ఐఫిల్ టవర్‌ను నిర్మించిన ఇంజినీర్ గుస్తావ్ ఐఫిల్... ప్రూస్టులకు సన్నిహితుడు. తొమ్మిదో ఏట నుంచే ప్రూస్టుకు ఉబ్బసంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలుండేవి. ప్యారిస్ ఉన్నత సమాజంలో ముందు కలియ తిరిగినప్పటికీ రానురానూ ఏకాంతంలోకి వెళ్లిపోయాడు. బయటి నుంచి వచ్చే పెద్ద శబ్దాలను కూడా భరించేవాడు కాదు. హైపర్ సెన్సిటివ్. అందుకే పగలు పడుకొని రాత్రుళ్లు రాయడం అలవాటు చేసుకున్నాడు. 'నిశాచర సరస్వతి!'. కల్పనతో కూడిన తన ఆత్మకథలోని మొదటి భాగమైన 'స్వాన్స్ వే'ను ఎవరూ ప్రచురించడానికి ముందుకు రాలేదు. దాంతో సొంత డబ్బుతో అచ్చు వేయించుకున్నాడు. దాన్ని తిరస్కరించినవారిలో అప్పటి ప్రఖ్యాత రచయిత ఆంద్రే గిదె కూడా ఒకరు. 'నా జీవితంలో నేను చేసిన అత్యంత పెద్ద తప్పిదం' అని ఆయన తర్వాత పశ్చాత్తాపపడ్డారు. తన మృత్యువు సమీపంలో ఉందని ప్రూస్ట్‌కు తెలుసు. తన రచన ఎక్కడ పూర్తవ్వదో అనే ఆందోళన ఉండేది. నాలుగు భాగాలు ప్రూస్ట్ బతికి ఉన్నప్పుడే వచ్చాయి. ఆయన రాసుకున్న డ్రాఫ్టుల ఆధారంగా తర్వాతి మూడు భాగాలు ఆయన తమ్ముడు రాబర్ట్ ప్రూస్ట్, రచయిత జాక్వెస్ రివియేరీ సంపాదకులుగా వచ్చాయి. ఇందులో ఐదో భాగం అయిన 'ద ప్రిజనర్' సరిగ్గా నూరేళ్ల కింద 1923లో వచ్చింది. ఇది అనారోగ్యంతో ప్రూస్ట్ చనిపోయాక విడుదలైన మొదటి భాగం.

ఇప్పుడు ఆంగ్లంలో ప్రామాణిక అనువాదంగా పరిగణిస్తున్నది బ్రిటిషర్ అయిన సి.కె.స్కాట్ మాంక్రీఫ్ చేసినది. ఆయన పెట్టిన పేరు 'రిమెంబ్రన్స్ ఆఫ్ థింగ్స్ పాస్ట్'. చాలా ఏళ్లు ఈ పేరుతోనే వ్యాప్తిలో ఉన్నప్పటికీ, ఈ అనువాదానికి తర్వాత మెరుగులు దిద్దినవారిలో ఒకరైన డి.జె.ఎన్‌రైట్ నవల పేరును 'ఇన్ సెర్చ్ ఆఫ్ లాస్ట్ టైమ్'గా మార్చారు. ఈ శీర్షికే ప్రూస్ట్ మానసిక ప్రపంచానికి దగ్గరగా ఉండి, స్థిరపడిపోయింది. ప్రూస్ట్ ఇల్లియర్స్ అనే చోట తన చిన్నతనం గడిపాడు. దాని ఆధారంగానే 'కోంబ్రే'ని సృష్టించాడు. 1971లో ప్రూస్ట్ శతాబ్ది సందర్భంగా దానికి 'ఇల్లియర్స్–కోంబ్రే'గా నామకరణం చేసి రచయిత పట్ల గౌరవం చాటుకున్నారు. జీవితం లోంచి సాహిత్యంలోకి వచ్చిన పేరు, మళ్లీ సాహిత్యం లోంచి జీవితంలోకి వచ్చింది. ఒక కొత్త మనిషిని అర్థం చేసుకోవడానికి పాత్రికేయులు 'ప్రూస్ట్ ప్రశ్నావళి'(ప్రూస్ట్ క్వశ్చనెయిర్) అని అడుగుతుంటారు. మన జీవితానికి దగ్గరగా వెళ్లాలంటే– నేనెవరు? ఈ జీవితంతో ఏం చేసుకోవాలి? అనే ప్రశ్నలను అన్వేషిస్తూ జీవిత సాగరాన్ని అన్వేషించిన ప్రూస్టియన్ ప్రపంచంలోకి వెళ్లాలి.

మంకుపట్టుకు మనస్సాక్షి విడుపు

కామెంట్



కరణ్ థాపర్

గాజాలో చిక్కుకుపోయిన 23 లక్షల మంది పాలస్తీనియన్‌ల పట్ల ఇజ్రాయెల్ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా వేలాది మంది లండన్ వీధులలోకి రావడం చూసినప్పుడు ప్రజాస్వామ్యంలోని మిక్కిలి 'సుందరమైన' దృశ్యాలలో ఇది ఒకటి అనిపిస్తుంది. ప్రదర్శనకారుల సంఖ్య భిన్నంగా ఉండొచ్చు కానీ, ఇదే విధమైన ర్యాలీలు ప్యారిస్, బెర్లిన్ లాంటి నగరాలలోనూ జరిగాయి. యు.ఎస్.లో జరిగిందైతే ఎంతో హృదయగతమైనది. 'జూయిష్ వాయిసెస్ ఫర్ పీస్' సంస్థ ఆధ్వర్యంలో అమెరికన్ కాంగ్రెస్‌లోనూ, గ్రాండ్ సెంట్రల్ స్టేషన్‌లోనూ స్థానిక యూదులు భారీ ప్రదర్శన చేపట్టారు. అంతస్సాక్షి శక్తికి అదొక ధ్రువీకరణ. ఈ నిరసనలు దేనినైనా మారుస్తాయా? జరగబోయే అకృత్యాలను ఆపగలవా? ఏమో! అయినప్పటికీ నిరసనలు అవసరమైనవి.

ప్రజాస్వామ్యంలోని మిక్కిలి సుందరమైన దృశ్యాలలో ఒకటి – ఈ 'సుందరమైన' అనే విశేషణాన్ని నేను ఉద్దేశపూర్వకంగానే ఉపయోగిస్తున్నాను – పదులు లేదా వందల వేలమంది తాము సహించరాని అన్యాయంగా భావిస్తున్న దానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసనను వ్యక్తం చేయడం. ఆ నిరసనకు మీ సొంత ప్రభుత్వం దారి ఇచ్చిందా లేక ప్రపంచంలోని మరొక చివరన అది మలుపు తిరిగిందా అన్నది విషయమే కాదు. అదొక మూకుమ్మడి నైతిక వివేచనను రేకెత్తించిందన్నది, మానవుల ఆత్మను కదిలించిందన్నది ముఖ్యం. నిజానికి అది వారి ఉనికి యొక్క లోతు. అందుకే వారి స్పందన మానవత్వానికి సహేతుకమైన సమర్థన. అది మానవులను జంతువుల కన్నా ఉన్నతంగా ఉంచుతుంది.

గాజాలో చిక్కుకుపోయిన 23 లక్షల మంది పాలస్తీనియన్‌ల పట్ల ఇజ్రాయెల్ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా వందల వేల మంది లండన్ వీధులలోకి రావడం చూసినప్పుడు నాలో ఈ ఆలోచన మెదిలింది. ప్రదర్శనకారుల సంఖ్య భిన్నంగా ఉండొచ్చు కానీ, ఇదే విధమైన ర్యాలీలు పారిస్, బెర్లిన్, అమెరికా నగరాలలోనూ జరిగాయి.

వాస్తవానికి యు.ఎస్.లో జరిగిందైతే ఎంతో హృదయగతమైనది. 'జూయిష్ వాయిసెస్ ఫర్ పీస్' ఆధ్వర్యంలో అమెరికన్ కాంగ్రెస్‌లోనూ, అలాగే గ్రాండ్ సెంట్రల్ స్టేషన్‌లోను స్థానిక యూదులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. అంతస్సాక్షి శక్తికి అదొక ధ్రువీకరణ. ఈ సందర్భంలోనైతే అది విశ్వాసాల వెన్నుదన్నులను కలుపుకున్న మతం పట్టు కంటే గట్టిది.

నన్ను తప్పుగా అనుకోకండి. అక్టోబర్ 7న హమాస్ ఏదైతే చేసిందో అది అనాగరికమైనది, క్రూరమైనది, ఏమాత్రం క్షమార్హం కానిది. అయితే ఒక నెల తర్వాత అది అర్ధసత్యం మాత్రమే. హమాస్ దాడికి ప్రతిచర్యగా ఇజ్రాయెల్ 9,200 మంది ప్రాణాలను బలి తీసుకుంది. 22,000 మందిని గాయపరిచింది. మృతులలో నలభై శాతం మంది చిన్నారులే. విద్యుత్తు, నీరు, ఇంధనం, ఆహారం అందకుండా చేస్తూ వస్తున్న కొన్ని వారాల దారుణమైన వైమానిక దాడుల తర్వాత ఇప్పుడు రెండవ దశ భూతల దాడులు ప్రారంభమయ్యాయి.

నిరసనకారులు అడుగుతున్నది చాలా సరళమైనదనీ, సూటి అయినదనీ నేను ఊహించగలను. శిక్ష, ప్రతీకారం సమర్థనీయం అయినప్పటికీ ఇది చాలాదూరం వెళ్లలేదా? చాలాకాలం అయిపోలేదా?

ఉత్తర గాజాలో ఉన్న ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండటం కోసం దక్షిణం వైపునకు తరలి వెళ్లాలని ఇజ్రాయెల్ హెచ్చరించింది. కానీ అలా వెళ్లినవారు తలదాచుకున్న దక్షిణ ప్రాంతాలైన ఖాన్ యూనిస్, రాఫాల పైన కూడా బాంబులు కురిపించడం మొదలుపెట్టింది. 'అల్ జజీరా' ప్రతినిధి కుటుంబం నుసిరత్ శరణార్థి శిబిరంపై జరిగిన దాడిలో మరణించింది.

గాజా నగరంలో 600 మంది మాత్రమే పట్టే సామర్థ్యం గల షిఫా ఆసుపత్రి ఇప్పుడు బాంబు దాడుల నుంచి తప్పించుకోడానికి అక్కడికి చేరిన 20,000 మందితో కిక్కిరిపోయిందనీ; శిథిలాలు, మురుగు నీరును మాత్రమే తాము చూడగలుగుతున్నామనీ అక్కడి వైద్యులు చెబుతున్నారు. మత్తుమందు లేకుండానే ఆసుపత్రి కారిడార్ నేలపైన శస్త్రచికిత్సలు జరుగుతున్నట్లుగా కూడా నివేదికలు అందుతున్నాయి. అదే నగరంలోని అల్ ఖుద్స్ ఆసుపత్రికి – నేరుగా వైమానిక దాడులకు గురి అయ్యే ప్రమాదం ఉన్నందున రోగులను ఖాళీ చేయించవలసిందిగా ఆదేశాలు అందాయి. మరి ఇంక్యుబేటర్‌లలో, అత్యవసరంగా వెంటిలేటర్‌ల పైన ఉన్న శిశువులను ఎక్కడికి తరలించాలి?

గాజాకు అయిన వర్ణనాతీతమైన గాయం గురించి ఒక పాలస్తీనా వ్యక్తి గుండెను పిండేసే మాటలను 'బీబీసీ'తో అన్నారు: ''సురక్షితంగా ఉండేందుకు మనం ఎక్కడికి వెళ్లాలి అని ప్రజలు అడగడం లేదు. మనం చనిపోయేటప్పటికి ఎక్కడ ఉండాలి అని అడుగుతున్నారు.''



పాలస్తీనాకు అనుకూలంగా న్యూయార్క్ 'గ్రాండ్ సెంట్రల్ స్టేషన్'లో యూదుల ప్రదర్శన

నిజం ఏమిటంటే ఇజ్రాయెల్ అంతరాత్మ కూడా ఈ భయానక స్థితికి చలించింది. ఆ స్థితిని వ్యక్తీకరించడం అంత తేలిగ్గా కనిపించకపోవచ్చు. హమాస్ కంటే ఎక్కువ అని కాదు, హమాస్‌తో సమానంగా అణచి వేసే ప్రయత్నాలతో ఇజ్రాయెల్ ఏమీ సౌకర్యంగా ఉండకపోవచ్చు. కనుక నెమ్మదిగా, కానీ స్థిరంగా మాటలను కూడబలుక్కుంటోంది.

'హఆరెట్జ్'... ఇజ్రాయెల్‌లో పేరున్న వార్తా పత్రిక. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిగిన మరుసటి రోజు, అక్టోబర్ 8న తన సంపాదకీయ వ్యాసంలో... 'దాడి వల్ల ఇజ్రాయెల్‌కు సంభవించిన విపత్తుకు బాధ్యత వహించవలసిన ఒకే ఒక వ్యక్తి బెంజమిన్ నెతన్యాహూ' అని రాసింది. పాలస్తీనా ఉనికిని, హక్కులను నెతన్యాహూ విస్మరించారని ఆరోపించింది. 9వ తేదీన ఆ పత్రిక 'ప్రతీకార ఉద్యమాలకు, యుద్ధ నేరాలకు ఆస్కారం ఉండొచ్చు' అని హెచ్చరించింది. ఆ పత్రిక వ్యాసకర్తగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన గిడియన్ లెవీ 19వ తేదీన 'ఎనఫ్' (చాలు) అనే శీర్షికతో సంపాదకీయం పేజీలో రాసిన వ్యాసాన్ని 'ఈ రక్తపాతాన్ని తక్షణం ఆపి తీరాలి, వినాశానికి హద్దులు ఉంటాయి' అని ప్రారంభించారు.

ఇజ్రాయెల్ గురించి మీరేం అనుకున్నా, స్థానిక యూదు పౌరులకు అది ప్రజాస్వామ్య దేశం అనేందుకు 'హఆరెట్జ్' ఒక కాదనలేని రుజువు. భారతదేశంలో ఈ విధమైన పరిస్థితుల్లో పత్రికలు రాసే సంపాదకీయాలు, అభిప్రాయాలు తీవ్రవాదం, దేశద్రోహం అభియోగాలను ఆహ్వానించవచ్చు. అంటే ఇజ్రాయెల్‌లోనూ ఇప్పుడు నిరసనల సౌందర్యం కనిపిస్తూ ఉంది.

అయితే ఈ నిరసనలు దేనినైనా మారుస్తాయా? మరింత దారుణంగా జరగబోయే అకృత్యాలను అవి ఆపగలవా? చెప్పలేను. బహుశా ఆపలేవేమో! అయినప్పటికీ నిరసనలు అవసరమైనవి. అందుకు ఒకే కారణం అవి జరగవలసి ఉండటం. నిశ్శబ్దంగా ఉండలేని స్వరాలు అవి. కనుక మాట్లాడటాన్ని మన మనస్సాక్షి కొనసాగిస్తూనే ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎలా గెలుస్తారు?



అత్యంత సక్సెస్ అయిన తల్లితండ్రులు తమ పిల్లల నుంచి లాగేసుకునే ఒక విలువైన బహుమతి ఏమిటో తెలుసా? అసలంటూ తాము విజయపథంలో నడవడానికి కారణమైనదే అది. పోరాటం!

– కునాల్ షా, పారిశ్రామికవేత్త

ఊరికే ఉండరా?



ఎవరికైనా లక్ష్యాలు లేకపోతే నేను దాన్ని అంతగా పట్టించుకోను. అది ప్రతి ఒక్కరూ తమకు తాము నిర్ణయించుకోవాల్సిన విషయం. కానీ లక్ష్యం ఉన్నవాళ్లను కిందికి లాగాలని చూస్తారు చూడు, అది నాకు ఆందోళన కలిగిస్తుంది.

– పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

అదే విధానం



విదేశాంగ విధానం అనేది నువ్వు మంచి బాలుడు అని సంకేతం ఇచ్చే ఉపకరణం కాదు. ఏది ఏమైనా స్వీయ ప్రయోజనాల కోసం చేసే యత్నం. అది మన యుద్ధం కాదు. రెండు పక్షాలతోనూ మనకు సంబంధాలున్నాయి. ఇండియా తీవ్రవాదాన్ని ఖండించింది. సహాయాన్ని అందించింది. పాలస్తీనా గురించి తన చారిత్రక వైఖరి నొక్కిచెప్పింది. ఇక తర్వాత జరిగేదేమిటో చూస్తూ ఉండటమే!

– హార్దిక్ రాజ్‌గోర్, వ్యాఖ్యాత

దీన్నెలా ఓడిద్దాం?



మన జనం ఎక్కడి యుద్ధాన్నో నిరసించడంలో బిజీగా ఉన్నారు. కానీ మన ఇంట్లోనే ఒక యుద్ధం కొనసాగుతోంది. హమాస్, ఐసిస్, టీటీపీ లాంటివన్నీ ఒకే రాక్షసుడి భిన్న తలలు. (పాకిస్తాన్‌లో జరిగిన మరో బాంబు దాడి నేపథ్యంలో.)

– మన్సూర్ ఆఫ్రిది, ఫ్రీ థింకర్

దారుణ వైఖరి



నవంబర్ 19న ఎయిర్ ఇండియా విమానాన్ని పేల్చేస్తామని ఖలిస్తానీ తీవ్రవాది 'పన్ను' హెచ్చరిస్తున్నాడు. ఇదే ఇజ్రాయెలీ విమానం గురించి ఒక పాలస్తీనియన్ అనివుంటే ట్రూడో ఇప్పటికే ఆ సంస్థను నిషేధించేవాడు. కానీ ఇండియా లక్ష్యంగా కెనడాలో ఏమైనా అనొచ్చు.

– వీర్ సింఘ్వీ, జర్నలిస్ట్

రొటీన్... రొటీన్




ప్రతి సంవత్సరం ఇవే వరుసగా జరుగుతాయి: 1. 'దేవుడా! ఢిల్లీలో ఊపిరాడటం లేదు.' 2. 'టపాకాయలు కాల్చొద్దు, సేవ్ ఢిల్లీ.' 3. ఏం ఫర్లేదు కాల్చమని సద్గురు చెబుతారు. 4. ప్రతి ఒక్కరూ రెండింతల టపాకాయలు కాల్చుతారు. 5. ప్రభుత్వం ఏదో చేసినట్టుగా నటిస్తుంది. 6. ఫిబ్రవరి వస్తుంది. ఢిల్లీ మళ్లీ ఊపిరి పీల్చుకుంటుంది.

– కాజోల్ శ్రీనివాసన్, కమెడియన్

సినీ గీత సమాచార గని

సమాచారం, విజ్ఞానమే పెద్ద సంపద. ఆ సంగతి తెలిసిన ఓ ఇంజనీర్ సినీ సమాచార గనిని తవ్వడం మొదలుపెడితే? డాక్టర్ వి.ఎస్. ఊటుకూరిగా పాపులరైన పేరొందిన మైనింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఊటుకూరి వెంకట సత్యనారాయణ ఆ పనే చేశారు. ఆస్ట్రేలియాలోని ఆయన సినిమాపై ప్రేమతో సినీ సమాచారగనిని తవ్వి తీస్తున్నారు. 5 వేలకు పైగా తెలుగు సినిమాలు, 32 వేల పైగా పాటల వివరాలు సేకరించి, క్రోడీకరించి, విశ్లేషించి ఇప్పటికే రెడీ రెకానర్ గ్రంథాలందించారు. వాటిలో 1932 నుంచి 2000 వరకు వచ్చిన సినిమా వివరాల 'తెలుగు ఫిల్మోగ్రఫీ' ఉంది. నిర్మాతలు, దర్శకులు, మాటల రచయితల 'డైరెక్టరీ'ల పేరిట వారి సినిమాల సంఖ్య, వివరాల పుస్తకాలున్నాయి. ఇవికాక ఏ సినిమాలో, ఏ పాటెవరు రాశారు, ఎవరు సంగీతమిచ్చారు, ఎవరు పాడారో చెప్పే తెలుగు సినీ గీతకోశముంది.

కొత్త పుస్తకం



తాజాగా మరో 14 పుస్తకాలతో ఊటుకూరి ముందుకొచ్చారు. సినీ సమాచార తెలుగు సినీ గీత రచయితలు (4భాగాలు), సంగీత దర్శకులు (3 భాగాలు), గాయకుల (6భాగాలు), అలాగే ప్రత్యేకంగా ఘంటసాలపై ఒక పుస్తకం... ఇలా సినీ ప్రముఖుల సృజనాత్మక కృషిని పుస్తకాల్లో అందిస్తున్నారు. 7 వేల పేజీల్లో సమాచారం మొత్తాన్నీ బయటకు తెస్తున్నారు. హిందీ, మరాఠీల్లో సినీ గీతకోశాలు కొత్త కాదు. మొత్తం సంవత్సరాలు, సినిమాలు, గాయకులు, సంగీత దర్శకుల వారీగా శ్రమించి, శ్రద్ధతో చేయాల్సిన ఈ సినీ గీతకోశాల కూర్పును తెలుగులో చల్లా సుబ్బారాయుడు, స్వర్గీయ గోలి సాయిబాబు లాంటి ఒకరిద్దరే తలకెత్తుకున్నారు. అదీ ఘంటసాల లాంటి కొందరి కృషే పుస్తకాలుగా వచ్చింది. గాయకుల, లేదా రచయితల పాటల సమగ్ర వివరాలతో సినీగీత కోశాలు తెలుగులో రాలేదు. వచ్చినవీ క్రాస్ రిఫరెన్స్ చేసే వీలు లేనివి. ఇక మొత్తం సినీ గీత సమాచారమైతే ఒకచోట గుదిగుచ్చలేదు.

ఈ నేపథ్యం నుంచి చూస్తే డాక్టర్ ఊటుకూరి ఏళ్ళ తరబడి శ్రమించి, పట్టుదలతో ఈ సినీ గీత కోశాలు ప్రత్యేకమైనవి. ఏటా తెలుగులో విడుదలైన నేరు, డబ్బింగ్ చిత్రాలు చూడవచ్చు. రచయితల పాటల పల్లవులు, సంగీత దర్శకుల సినిమాలు, గాయకుల పాటల జాబితా తెలుసుకోవచ్చు. సదరు రైటర్, మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ ఏ ఏడాది ఎంతెంత పని చేశారో కాలమాన పట్టికలో గణాంకాల్లో చూడవచ్చు. వారి కెరీర్‌లోని ఉత్థానపతనాలు గ్రహించవచ్చు. సినిమా పేరు, పల్లవి, రైటర్లు, సింగర్ల వారీగా సులువుగా చూసుకోగల 4 రకాల ఇండెక్స్‌లు ఇవ్వడంతో, వీటిలో ఏ ఒక్కటి తెలిసినా ఆ పాట సమగ్ర వివరం ఇట్టే పట్టేయవచ్చు.

ఇక, ఎస్పీబీ, సుశీల, చిత్రల కృషిపై ప్రత్యేక వాల్యూమ్‌లు సినీప్రియులకు పండగ. అన్నీ కలిపి ఆయన శోధన, సాధన ఇప్పటికి 25 పుస్తకాలయ్యాయి. ఇది ప్రసిద్ధ 'సారస్వత నికేతన్' లైబ్రరీకి నెలవైన వేటపాలెంలో జన్మించిన ఊటుకూరి సినీ సారస్వత, సంగీతాలకు చేసిన అమూల్యసేవ. ఈ గ్రంథాలు పరిశోధకులకే కాదు, పాటను ప్రేమించేవారికి వరం. తెలుగు సినీ చరిత్రకు కొత్త చేర్పుగా ఈ కోశాలన్నీ నేడు హైదరాబాద్‌లో ఆవిష్కృతమవుతున్నాయి. పరిశ్రమ, ప్రభుత్వాలు చేయాల్సిన పని ఎక్కడో విదేశాల్లో దశాబ్దాల క్రితం స్థిరపడిన ఎనిమిదిన్నర పదులు దాటిన సినీప్రియుడు చేయడం ఎన్నటికీ మర్చిపోలేని విశేషం. – రెంటాల జయదేవ

వ్యక్తిగత సమాచారం అంగడి వస్తువే!

అభిప్రాయం




కె. బి. గోపాలం

ఇవ్వాళ స్మార్ట్‌ఫోన్ వాడనివాడు మనిషేకాడు అన్నంతగా వినియోగదారీ సంస్కృతి మభ్యపెడుతోంది. మన నిత్య జీవితంలోని ప్రతి అంశం స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇతరులకు తెలిసిపోతున్నదనే స్పృహే మనలో చాలామందికి ఉండడం లేదు. ఫలితంగా ఎంతో విలు వైన మన వ్యక్తిగత సమాచారం అంగట్లో సరుకుగా మారుతోంది.

నెలకు ఒకసారి గూగుల్ నుంచి ఒక మెయిల్ వస్తుంది. అందులో ఆ నెల రోజుల్లో మనం ఎన్ని చోట్లకు, ఎంతకాలం, ఏ పద్ధతిలో వెళ్ళిందీ మొత్తం మ్యాప్‌లతో సహా వివరాలు ఉంటాయి. ఆ వెళ్లిన ప్రతి చోటికీ మనం ఫోన్ వెంటబెట్టుకు వెళ్ళామన్న సంగతి ఒక పట్టాన తోచదు. అది తోచిన తరువాతనైనా ఫోన్ వెంట పెట్టు కోకుండా వెళ్లడం కుదరకపోవచ్చు కూడా!

మొత్తానికి సోషల్ నెట్‌వర్క్, కాలక్షేపం, పాటలు, సినిమాలు, సీరియళ్లు – ఇలా మన సర దాల సంగతి కూడా మొత్తం ప్రపంచానికి తెలిసి పోతుంది. ఆన్‌లైన్ పద్ధతిలో మనం కొంటున్న వస్తు వుల వివరం కూడా ఇతరులకు తెలుస్తుంది. ఇది ఇట్లా ఉంటే ఒక పక్కన ఎక్కడికో వెళ్లాలని టికెట్ బుక్ చేయడానికి ఆన్‌లైన్ సైట్‌కు వెళతాం. అక్కడ మనకు కావలసిన సౌకర్యాలు, సంగతులనుగురించి ప్రకటనలు వాటంతట అవే కనిపించడం మొదలవుతుంది. ఇది అనుకోకుండా జరుగుతున్నదని మనం అనుకుంటాం. కానీ దీని వెనుక వ్యాపారం ఉన్నదనేది ఎందరికి తెలుసు? అంతర్జాతీయ పత్రికలలో ఇందుకు సంబంధించిన వివరాలు రాస్తున్నారు. మనం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా మన మానాన మనం బతుకుతున్నాం.

ఆధునిక కాలంలో మన సొంత వివరాల ఆధారంగా మరెవరో వ్యాపారం చేస్తారు. దీన్నే 'పర్సనల్ డేటా బిజినెస్' అంటున్నారు. పట్టించుకోకుంటే ఇది చాలా ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. చాలామంది 'ఈ మెయిల్', 'వాట్సాప్' లాంటి సౌకర్యాలను వాడుకుంటున్నారు. వీటన్నింటిలోనూ మన సొంత వ్యవహారాలను, అవి బహుశా రహస్యాలు అయినా సరే, మనకు కావ లసినవారితో పంచుకుంటున్నాం. కానీ మన ఆస్తులు, ఆసక్తులు, వ్యాపారాలు, పెట్టుబడులు వంటి అన్ని వ్యవహారాలూ గూగుల్ లాంటి కంపెనీలకు ఇట్టే చేరి పోతున్నాయని మనం గ్రహించడం లేదు. ఎక్కడో ఏ అప్పు కొరకు వెళ్ళినప్పుడో అక్కడ మన వ్యవహారాల సమాచారం అంతా ఇచ్చి ఉంటాము. మన గురించి తెలుసుకోవాలనుకున్న ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులూ, సంస్థలూ ఈ సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఒకరికి ఓటర్ కార్డు రాదు, మరొకరికి ఆధార్ కార్డు కూడా రాదు. భూమి తగాదా గురించి కేసు వేస్తే ఎందుకో తెలియకుండానే మనకు వ్యతిరేకంగా నిర్ణయం వస్తుంది. వీటి వెనక ఇంట ర్నెట్ ద్వారా మన గురించి సేకరించిన సమాచారం ప్రభావం ఉండవచ్చునని మనకు అనుమానం కూడా రాదు.



ఇన్సూరెన్స్ కంపెనీల వాళ్లకు ఇటువంటి సమాచారం చాలా ఉపయోగకరంగా ఉంటున్నది అని నిపుణులు చెబుతున్నారు. మన ఆరోగ్యం వ్యవహారం, అందుకు సంబంధించిన మిగతా సంగతులు ఎంత మాత్రం రహస్యం కాదు. ఒక ఉద్యోగానికి మనం పనికివచ్చేదీ, లేదా పనికిరానిదీ ఈ సమాచారం ఆధారంగానే రిక్రూట్‌మెంట్ కంపెనీలు నిర్ణయిస్తున్నాయంటే ఆశ్చర్యపడ నవసరం లేదు. వ్యవహారాలన్నీ ఈ రకంగానే జరుగుతున్నాయి. చట్ట విరుద్ధంగా చేస్తున్న గర్భస్రావాలను గురించి సమాచారం మరింత పట్టుదలగా సేకరిస్తున్నట్టు యూఎస్‌లోని సంస్థలు చెబుతున్నాయి. ఇటువంటి సందర్భాలలో ఎవరికి వారు పట్టించుకోకుండా ఉండడం ఎంత మాత్రం మంచిది కాదు.

పెద్ద టెక్నాలజీ కంపెనీలన్నీ ఈ సమాచార సేకరణ మీదనే ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. అందుకే ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు నటిస్తు న్నాయి. ఫోన్లను వాడుతున్న వారి సమాచారం గురించి ఆపిల్ కంపెనీ మీద వచ్చిన అభియోగం సంచలనం సృష్టించింది. ఆ దేశంలో ఫోన్ వాడుతున్న వారి సమాచారం గురించీ, దాన్ని కంపెనీలు వాడు కోవడం గురించీ చట్టాలు కూడా వచ్చాయి. మన దేశం సంగతి చెప్పనవసరం లేదు.

మనకు మనం జాగ్రత్తగా ఉండాలి. మనం వాడుతున్న యాప్‌లు, వెబ్‌సైట్‌లు మన సమాచారాన్ని సేకరించడం గురించి జాగరూకతతో ఉండాలి. అసలు కొన్ని రకాల సమాచారాన్ని నెట్‌లో స్నేహితులతోనైనా పంచుకోకుండా ఉండడం మేలు. ఆ కంపెనీలు మనకు ఇస్తున్న సౌకర్యాల కన్నా మన నుంచి తీసుకునే సమాచారమే ఎక్కువ విలువ గలది అని పెద్దలు హెచ్చరిస్తున్నారు. ఇదంతా ఇవాళ కొత్తగా వచ్చిన వార్త కాకపోవచ్చు. కానీ అందరూ తెలుసు కోవలసిన సంగతి.

వ్యాసకర్త సైన్స్ రచయిత, కాలమిస్ట్ । 98490 62055

ధన్య జీవనం

ఆచరణీయములైన ఆశ్రమ ధర్మాలు నాలుగింటిలో గృహస్థాశ్రమ ధర్మం గొప్పదని పెద్దలు చెబుతారు. గృహస్థుడనే మాట బాధ్యతను గుర్తుకు తెస్తుంది. తాను, తన భార్యా పిల్లలు, తల్లితండ్రులు – వీరు కలిసి ఉన్నదే ప్రథమంగా ప్రతి గృహస్థుడికీ సంబంధించిన ఒక చిన్న ప్రపంచం అవుతుంది. వారి పోషణ, ఆలనా పాలన అతడి ప్రధాన బాధ్యత. అంతేగాకుండా అతిథుల ఆదరణ కూడా అంతే ముఖ్యమైన గృహస్థాశ్రమ ధర్మంగా చెప్పబడింది. కనుకనే గృహస్థాశ్రమ ధర్మాన్ని అన్ని కట్టుబాట్లను పాటిస్తూ గడిపి గట్టెక్కడం ప్రతి గృహస్థుకు కత్తి మీద సాము వంటిది. ధనం ఇందులో ముఖ్యమైన భూమికను పోషిస్తుంది. పిల్లనివ్వాలంటే ముందుగా ఆడపిల్ల తండ్రి తనకు అల్లుడు కాబోయే యువకుడి సంపాదన మార్గాన్ని ఆరా తీస్తాడు. ఆ మార్గం న్యాయమైనదేనా, కాదా అని ఆలోచిస్తాడు. న్యాయంగా డబ్బు సంపా దించి, న్యాయమైన మార్గంలో జీవనం సాగించే భర్తకే, అప్పటిదాకా అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమార్తెను కట్టబెడుతున్నామా లేదా అన్నది వారి ముఖ్యమైన ఆలోచనగా ఉంటుంది. అటువంటి పురుషుడి సాహచర్యంలోనే ఏ పడతి బతుకైనా గౌరవంగానూ, గుంభనంగానూ సాగుతుందనీ, అటువంటి దంపతులదే ధన్యజీవితంగా పరిగణింప బడుతుందనీ వారి విశ్వాసంగా ఉండడం లోక సహజం. ఈ భావననే మడికి సింగన తాను రచించిన 'జ్ఞాన వాసిష్ఠ రామాయణం' కావ్యం ప్రథమాశ్వాసంలో ఒక తేటగీతి పద్యంలో పొందికగా చెప్పాడు.



పొందవలసిన యర్థంబు పొందనేర్చి
దుష్కృతులు సేసి క్రమ్మఱ దుఃఖపదక
యచలనిర్వాణ సుఖవృత్తి నందునట్టి
వారి బ్రతుకులు బ్రతుకులు వసుధ మీద.

'తాను, తనపై ఆధారపడినవారి జీవనానికి అవసరమైన ధనాన్ని ఎలా సంపాదించాలో తెలిసికొని, అలా సంపాదించిన ధనాన్ని చేయరాని పనులకు వినియోగించి తరువాత చింతల పాలు కాకుండా తనను తాను సదా నిగ్రహించుకుని కాపాడుకుంటూ, చంచల స్వభావానికి లోను కానట్టి వారి బతుకులే బతుకులు ఈ భూమి మీద' అని పై పద్యం భావం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: బ.నవమి తె.5.18 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి దశమి, నక్షత్రం: ఆశ్లేష ప.2.10 వరకు, తదుపరి మఖ, వర్జ్యం: రా.3.26 నుండి 5.14 వరకు, దుర్ముహూర్తం: ప.12.05 నుండి 12.52 వరకు, తదుపరి ప.2.21 నుండి 3.08 వరకు, అమృతఘడియలు: ప.12.22 నుండి 2.10 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 5.24.

క్లుప్తంగా...

మల్లన్నను దర్శించుకున్న జస్టిస్ జ్యోతిర్మయి



జస్టిస్ వెంకట జ్యోతిర్మయికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న శ్రీశైలం ఆలయ అధికారి

శ్రీశైలంటెంపుల్/త్రిపురాంతకం: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక, వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని బాలా త్రిపుర సుందరీదేవి, పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయాలను జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

12న తిరుమలలో దీపావళి ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీన 'దీపావళి ఆస్థానం' టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు. ఆస్థానంలో భాగంగా శ్రీమలయప్పస్వామి దేవేరులతో కలిసి సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారిని కూడా స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపు చేస్తారు. ఆ తర్వాత స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని, ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. కాగా, దీపావళి ఆస్థానం కారణంగా ఆ రోజు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

విజయవాడకు చేరుకున్న ఇంగ్లండ్ అండర్-19 జట్టు



గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న టోర్నీ ఇన్‌చార్జ్‌లు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నీలో భాగంగా మూలపాడులో జరిగే మ్యాచ్‌ల కోసం ఇంగ్లడ్ అండర్-19 జట్టు ఆదివారం విజయవాడకు చేరుకుంది. బీసీసీఐ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ నెల 13 నుంచి 27 వరకు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మూలపాడులోని డీవీఆర్, సీపీ మైదానాల్లో అండర్-19 పురుషుల బంగ్లాదేశ్, ఇంగ్లండ్ జట్లతో పాటు ఇండియా-ఏ, ఇండియా-బీ జట్లు కూడా పోటీపడనున్నాయి. గన్నవరం విమానాశ్రయంలో ఇంగ్లండ్ జట్టుకు టోర్నీ ఇన్‌చార్జ్‌లు బాపూజీ, వెంకటాద్రి రెడ్డి స్వాగతం పలికారు.

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టు

చింతలపూడి: ఏలూరు జిల్లా చింతలపూడిలో నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టు రట్టయ్యింది. ఈ ముఠాలో చింతలపూడికి చెందిన కొలుకులూరి సోంబాబు, ఏలూరు బీడీ కాలనీకి చెందిన పల్లా దినేష్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరావు కథనం ప్రకారం.. ఏలూరులోని ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన నకిలీ సర్టిఫికెట్ అదే కళాశాలలో చదివే విద్యార్థి ఇచ్చిన సర్టిఫికెట్లలో రావడంతో అనుమానం వచ్చి విచారించగా చింతలపూడికి చెందిన సోంబాబు విక్రయించినట్టు తెలిసింది. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు సోంబాబును అదుపులోకి తీసుకుని విచారించగా.. ఏలూరుకు చెందిన దినేష్‌తో కలిసి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తున్నట్టు అంగీకరించాడని తెలిపారు. నిందితుడు దినేష్ గూగుల్‌లో సెర్చ్ చేసి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయడం నేర్చుకున్నాడని సీఐ వివరించారు. నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయడానికి అవసరమైన సామగ్రిని చెన్నై వెళ్లి కొనుగోలు చేసినట్టు తెలిపారు. దినేష్‌కి సోంబాబు పరిచయం కాగా, ఇద్దరూ కలిసి నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ నడుపుదామని నిర్ణయానికి వచ్చి ఏడాదిన్నర కాలంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో సుమారు 50 మందికి వివిధ యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్లతో పాటు ఇంటర్ సర్టిఫికెట్లు, డిగ్రీ, పదో తరగతి సర్టిఫికెట్లు తయారు చేసి ఆన్‌లైన్‌లో రూ.50 వేల నుంచి లక్షన్నర చొప్పున విక్రయిస్తున్నట్టు వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి వివిధ వర్సిటీల రబ్బర్ స్టాంపులు, సర్టిఫికెట్లు, నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్, ప్రింటర్‌లను స్వాధీనం చేసుకున్నారు.

కొల్లేరులో వి'హంగామా'



కొల్లేరు అభయారణ్యంలో కోకిల కువకువలు.. పెలికాన్ కేరింతలు


- శీతాకాలంలో విడిది పక్షుల సందడి
- స్థానికంగా 105 రకాల పక్షి జాతుల ఉన్నట్టు గుర్తింపు
- ఏటా 3 లక్షల నుంచి 4 లక్షల పక్షులు విహారానికి వస్తున్నట్టు గుర్తించిన అటవీ శాఖ
- వీటిలో విదేశీ అతిథి పక్షులు 1.20 లక్షల వరకు ఉంటాయని అంచనా
- రూ.30 లక్షలతో ఆటపాక పక్షుల కేంద్రంలో వసతులు

శీతాకాలపు విడిది పక్షుల కిలకిలారావాలతో కొల్లేరు కళకళలాడుతోంది. ఇక్కడే పుట్టి.. బతుకు పయనంలో వేల కిలోమీటర్ల మేర వలస పోయిన అతిథి పక్షులు గమనం తప్పకుండా ఏటా మాదిరిగానే విడిది కోసం కొల్లేరు అభయారణ్యానికి వస్తున్నాయి. సంతానాన్ని వృద్ధి చేసుకుని.. పిల్లలతో కలిసి విదేశాలకు వలస పోయేంతవరకు ఇక్కడే గూళ్లు కట్టుకుని సందడి చేస్తుంటాయి. నిండా పక్షులతో పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల పరిధిలోని కొల్లేరు ప్రాంతం ఈ ఏడాదీ పర్యాటకులకు ఆహ్వానం పలుకుతోంది. ఏటా నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు కొల్లేరు పక్షుల వీక్షణకు అనువైన కాలం. ఈ దృష్ట్యా ఆటపాక, మాధవాపురం పక్షుల విహార కేంద్రాల వద్ద పర్యాటకుల కోసం అటవీ శాఖ మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఈ ఏడాది ఎక్కువ మంది పర్యాటకులు కొల్లేరుకు విచ్చేస్తారని అంచనా వేస్తోంది.

కైకలూరు

105 రకాల పక్షులున్నాయ్

కొల్లేరు అభయారణ్యంలో వివిధ జాతులకు చెందిన 105 రకాల పక్షి జాతులు ఉన్నట్టు ఏషియన్ వాటర్ బర్డ్స్ సెన్సస్-2023 నివేదిక వెల్లడించింది. ఇక్కడ మొత్తం 81,495 పక్షులు ఉన్నట్టు నిర్ధారించారు. వీటిలో అత్యధికంగా 7,875 కోయిలలు ఉండగా.. రెండో స్థానంలో 6,869 పెలికాన్లు (గూడబాతులు) ఉన్నట్టు తేల్చింది. వీటితోపాటు ఎర్రకాళ్ల కొంగ (పెయింటెడ్ స్టార్క్), కంకణాల పిట్ట (గ్లోబీ ఐబీస్), నల్లరెక్కల ఉల్లంకి పిట్ట (బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్) వంటి అనేక పక్షి జాతులు ఇక్కడ సందడి చేస్తున్నాయి. ఇవికాకుండా కొల్లేరు అభయారణ్యానికి ఏటా 3 లక్షల నుంచి 4 లక్షల పక్షులు విహారానికి వస్తున్నాయి. వీటిలో సుమారు 1.20 లక్షల పక్షులు విదేశాల నుంచి విడిది కోసం వచ్చే పక్షులు ఉంటున్నాయి. కొల్లేరు ప్రాంతాన్ని పక్షులు సంచరించే ప్రయాణంలో 'సెంట్రల్ ఏషియన్ ఫ్లైవే' అంటారు. కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం కావడంతో వలస పక్షుల ఇక్కడ విడిది చేసేందుకు ఇష్టపడతాయి. కొల్లేరు ప్రాంతానికి రష్యా, బ్రిటన్, మాల్దీవులు, బంగ్లాదేశ్ తదితర 30 దేశాల నుంచి వివిధ వలస జాతుల పక్షులు విచ్చేస్తాయి. అక్టోబర్ నుంచి వీటి రాక మొదలవుతుంది. మార్చి నాటికి సంతానోత్పత్తి చేసుకుని ఇవి తిరిగి తిరిగి వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.



పెలికాన్ పక్షి



పెయింటెడ్ స్టార్క్ పక్షులు

ఎకో టూరిజానికి ప్రతిపాదనలు

జిల్లాల పునర్విభజన తర్వాత కొల్లేరు ప్రాంతమంతా ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. కొల్లేరు ఎకో టూరిజం అభివృద్ధికి రూ.187 కోట్ల ఖర్చు కాగల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో 20 ప్రదేశాలను గుర్తించి బోటు షికారు, సంప్రదాయ గేలాలతో చేపలు పట్టుకోవడం, పక్షుల వీక్షణ వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 10 ప్రదేశాలను పర్యాటక శాఖ గుర్తించింది. రానున్న రోజుల్లో కొల్లేరు ఎకో టూరిజం పర్యాటక శాఖకు ప్రధాన ఆదాయ వనరుగా మారనుంది. ప్రధానంగా పర్యాటకులు విచ్చేసే పక్షుల విహార కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రవేశ రుసుములు ఇలా..

వివరం	దేశీయులు	విదేశీయులు
పెద్దలు ఒక్కొక్కరికి	రూ.20	రూ.100
పిల్లలు ఒక్కొక్కరికి	రూ.10	రూ.50
స్టిల్ కెమెరా	రూ.100	రూ.200
స్టిల్ ప్రొఫెషనల్ కెమెరా (జూమ్)	రూ.200	రూ.500
బోటు షికారు (ఫ్యామిలీ)	రూ.300	రూ.300

(డాక్యుమెంటరీ, ఎంటర్‌టైన్‌మెంట్ షూటింగ్‌లు నిషేధం)

రండి రండి.. ఇలా చేరుకోండి

విజయవాడ.. ఏలూరు.. భీమవరం ప్రాంతాల నుంచి కైకలూరు-భీమవరం జాతీయ రహదారి మీదుగా ఆటపాక చేరుకోవచ్చు. ఈ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఉంది. బస్సు దిగిన తరువాత పక్షుల కేంద్రానికి నడక మార్గంలో చేరుకోవచ్చు. విజయవాడ-విశాఖపట్నం రైలు మార్గంలో కైకలూరు రైల్వే స్టేషన్‌లో దిగి ఆటోలపై మూడు కిలోమీటర్ల దూరంలో పక్షుల కేంద్రానికి చేరవచ్చు. పక్షుల కేంద్రం, మ్యూజియం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తెరిచి ఉంటాయి.

ఏషియన్ వాటర్ బర్డ్ సెన్సస్-2023 ప్రకారం కొల్లేరు అభయారణ్యంలో గుర్తించిన పక్షి జాతుల సంఖ్య ఇలా

పక్షి జాతి	కొల్లేరులో గుర్తించిన సంఖ్య
కోయిల:	7,875
పెలికాన్లు (గూడబాతులు):	6,869
సూదితోక బాతులు (నార్తర్న్ పిన్‌టైల్):	5,365
కంకణాల పిట్టలు (గ్లోబీ ఐబిస్):	4,637
పెద్దచిలువ బాతులు (లార్జ్ విజ్లింగ్ డక్):	4,335
ఎర్రకాళ్ల కొంగలు (పెయింటెడ్ స్టార్క్):	4,233
నల్లరెక్కల ఉల్లంకి పిట్టలు (బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్):	4,033
తొండు ఉల్లంకి పిట్టలు (బ్లాక్ టయల్డ్ స్టిల్ట్):	3,275
చిన్న నీటికాకులు (లిటిల్ కార్మొనెంట్):	2,944
చెరువు బాతు (గార్గనే):	2,642
ఈల వేసే చిన్న చిలువ బాతు (లెస్సర్ విజ్లింగ్ డక్):	2,596
తెడ్డు ముక్కు కొంగ (ఏషియన్ ఓపెన్‌బిల్ స్టార్క్)	2,199
తెల్ల కొంగ (మీడియన్ ఎగ్రెట్):	2,141
బ్రాహ్మణి బాతు (బ్రాహ్మణి షెల్ డక్):	2,025
బంగారు ఉల్లంకి (పసిఫిక్ గోల్డెన్ ప్లోవర్):	1,215
చింత వాఖి (బ్లాక్ క్రౌన్డ్ నైట్ హెరాన్):	1,082
కొల్లేరులో కనిపించిన మొత్తం పక్షుల సంఖ్య:	81,495

రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు



ఆటపాక పక్షుల కేంద్రం వద్ద రూ.30 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పక్షుల నివాసాలకు కృత్రిమ ఇనుప స్టాండ్లు, పక్షుల విహార చెరువు గట్లు పటిష్టపర్చడం, గోడలకు పక్షుల చిత్రాలు, పర్యాటకులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతులు చేయనున్నాం. పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగడించిన ఆటపాక పక్షుల కేంద్రం అభివృద్ధికి అటవీ శాఖ అన్ని విధాలుగా కృషి చేస్తోంది.
– జె.శ్రీనివాస్, అటవీశాఖ రేంజర్, కైకలూరు

బెయిల్ నిబంధనలు బేఖాతర్!

కొందరు స్వార్థం కోసం న్యాయ వ్యవస్థను అభాసుపాల్జేస్తున్నారు

- చంద్రబాబు విషయంలోనూ అదే జరిగింది
- బెయిల్ మంజూరుపై జాతీయ స్థాయిలో చర్చ అవసరం
- ఏపీ ఇంటిలెక్చువల్స్- సిటిజన్స్ ఫోరం చర్చా వేదికలో న్యాయవాదులు



చర్చా కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాల ప్రముఖులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం న్యాయ వ్యవస్థను అభాసుపాల్జేస్తున్నారని పలువురు న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య కారణాలతో కండిషనల్ బెయిల్‌పై వచ్చిన వ్యక్తి న్యాయస్థానం విధించిన నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించి విజయోత్సవాలు చేసుకోవడం ద్వారా ప్రజలకు తప్పుడు సంకేతాలిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారు తప్పులు చేసి పట్టుబడినా చట్టాల నుంచి తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తున్నారని దుయ్యబట్టారు. ఇందుకు చంద్రబాబు విషయమే ఉదాహరణగా పేర్కొన్నారు. 'చంద్రబాబు వ్యవహార శైలి- బెయిల్ నిబంధనల ఉల్లంఘన- శిక్షలు' అంశంపై ఏపీ ఇంటిలెక్చువల్స్- సిటిజన్స్ ఫోరం(ఎపిక్) ఆధ్వర్యంలో చర్చ నిర్వహించారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు, న్యాయవాదులు పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకున్నారు. బెయిల్ మంజూరు విషయంలో జాతీయ స్థాయిలో చర్చ జరగాలని, కోర్టు నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే బెయిల్ రద్దు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో ఓ వర్గం పెత్తందారి, నియంతృత్వ పోకడలకు పోతోందని, కోర్టులను, న్యాయమూర్తులపైనా ఆరోపణలు చేస్తోందన్నారు. చంద్రబాబు కేసులో తాము చెప్పినట్టుగా తీర్పు ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగిన తీరు ఇటీవల కోర్టులో చూశామన్నారు. తీవ్ర నేరాలు చేసిన చంద్రబాబు, రామోజీరావులు తాము చట్టాలకతీతమన్నట్టుగా వ్యవహరిస్తూ.. వాటి నుంచి తప్పించుకునేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

కోర్టులను బాబు మేనేజ్ చేస్తున్నారు



తన రాజకీయ జీవితంలో కోర్టులను చంద్రబాబు మాత్రమే మేనేజ్ చేసినట్టు అనేక సందర్భాల్లో రుజువైంది. న్యాయస్థానాలు చట్ట ప్రకారం పనిచేస్తుంటే మాత్రం దుష్ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు తీవ్రమైన ఆర్థిక నేరం కేసులో జైలుకు వెళితే.. తాము చెప్పినట్టు తీర్పు ఇవ్వలేదని ఆయన వర్గం వారు న్యాయమూర్తులపైనా తీవ్రమైన ఆరోపణలు చేశారు. చివరికి బెయిల్ రాకపోయేసరికి 'అనారోగ్యం' సాకుగా చూపారు. కోర్టు కండిషన్లు పెట్టి బెయిల్ మంజూరు చేసింది. జైలు నుంచి బయటికొచ్చాక ఆస్పత్రికో, ఇంటికో వెళ్లాల్సి చంద్రబాబు.. 14 గంటల పాటు ర్యాలీ చేశారు. ప్రసంగాలు చేశారు. ఇది పూర్తిగా బెయిల్ నిబంధనలు ఉల్లంఘించడమే.
– విజయ్‌బాబు, ఎపిక్ ఫోరం వ్యవస్థాపకుడు

ఇది పూర్తిగా న్యాయ ధిక్కరణే



చంద్రబాబు కేసులో దాదాపు 53 రోజులు దేశంలో ప్రముఖ న్యాయవాదులు కేసును వాదించారు. చివరికి 'వైద్యం' పేరుతో అబద్ధం చెప్పి బెయిల్ తీసుకుని రాజకీయ ర్యాలీలు, ప్రసంగాలు చేశారు. ఇది పూర్తిగా న్యాయ ధిక్కరణ. ఆయన బెయిల్ రద్దు చేయాలి. లేకుంటే తప్పు చేసిన ప్రతి ఒక్కరూ ఇలాగే బయటకొచ్చే అవకాశం ఉంది.
– పిళ్లా రవి, న్యాయవాది

న్యాయ వ్యవస్థలో ఏం లోపాలు ఉన్నాయో పురందేశ్వరి చెప్పాలి



పురందేశ్వరి, టీడీపీ నాయకులు న్యాయ వ్యవస్థపైనా, న్యాయమూర్తులపైనా తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో వారు బెయిళ్లు తెచ్చుకున్నప్పుడు.. ఇప్పుడు అవే చట్టాలు. తనకు అనుకూలంగా బెయిళ్లు వచ్చినప్పుడు చట్టం తనపని చేసుకుపోతుందన్నారు, ఇప్పుడేమో మేనేజ్ చేస్తున్నారంటున్నారు. చంద్రబాబు ఆర్థిక నేరాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. న్యాయ వ్యవస్థలో ఏం లోపాలున్నాయో పురందేశ్వరి చెప్పాలి.
– విఠల్‌రావు, న్యాయవాది

బెయిల్ నిబంధనలపై చర్చ అవసరం



దేశంలో రూల్ ఆఫ్ లా సరిగా అమలు కావడం లేదు. ఏదైనా కేసులో అండర్ ట్రైల్ కింద జైలుకు వెళ్లిన వారు బెయిల్ కోసం అప్లై చేసుకోవడం వారి హక్కు. కానీ ఇక్కడ అందరికీ ఈ హక్కు లభించడం లేదు. వ్యవస్థలను మేనేజ్ చేసుకునేవారికి, ఆర్థికంగా శక్తిమంతమైన వారికి సులభంగా బెయిల్ వచ్చేస్తోంది. కానీ చాలామంది సామాన్యులు అండర్ ట్రైల్‌లోనే ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిపోతున్నారు. బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష చేయాలి. ప్రభుత్వంలో ఉండి ఆర్థిక నేరాలకు పాల్పడిన వారికి బెయిల్ ఇవ్వకూడదు.
– కృష్ణంరాజు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పురందేశ్వరి టీడీపీలో పదవి ఆశిస్తున్నట్టున్నారు..



చంద్రబాబు సీఎంగా 2014–19 మధ్య చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘించారు. ఇప్పుడు దొరికిపోయాక అరెస్టు నుంచి బెయిల్ వరకు చట్టాలను ఉల్లంఘించారు. చివరికి న్యాయమూర్తులపైనా ఆరోపణలు చేస్తున్నారు. మెడికల్ కండిషన్‌పై బెయిల్ తెచ్చుకుని నిబంధనలు ఉల్లంఘించారు. పురందేశ్వరికి ఇవన్నీ కనిపించడం లేదా? ఆమె బీజేపీ పదవి కంటే టీడీపీ పదవి ఆశిస్తున్నట్టు కనిపిస్తోంది.
– సాయిరామ్, అడ్వకేట్

వారికి చట్టాలంటే గౌరవం లేదు



ఒకరు నేరం చేశారని కేసు నమోదైతే కింది కోర్టులో తీర్పు వెలువడ్డాక హైకోర్టులకు వెళతారు. కానీ చంద్రబాబు కేసులో మాత్రం అందుకు విరుద్ధం. చేసిన నేరం నుంచి బయటపడేందుకు కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు పిటిషన్లు వేశారంటే జరిగింది ఎంత పెద్ద నేరమో అర్థం చేసుకోవచ్చు. పైగా వ్యవస్థను ఎలా మేనేజ్ చేయాలో తెలిసినవారే ఇలా చేస్తారు. ఈ కేసులో చంద్రబాబు వర్గానికి చట్టాలు, న్యాయస్థానాలు, న్యాయమూర్తులపై గౌరవం లేదు. యథేచ్ఛగా చట్టాలను ఉల్లఘించారు.
– నరహరిశెట్టి శ్రీహరి, హైకోర్టు న్యాయవాది

బాబుకు స్టేలు ఇచ్చినంత కాలం న్యాయస్థానాలు మంచివయ్యాయి..



సామాన్యులు బెయిల్ రాకుండా అండర్ ట్రైల్‌లోనే ఉండిపోతున్నారు. కానీ చంద్రబాబు, రామోజీరావులు కోర్టు మెట్లు ఎక్కకుండానే బెయిల్ తెచ్చుకుంటున్నారు. స్కిల్ స్కాం తప్ప మరే కేసులోను బాబు కోర్టుకు, జైలుకు వెళ్లింది లేదు. తనకు స్టేలు ఇచ్చినంత కాలం న్యాయస్థానాలు మంచివే అన్నారు, ఈ ఒక్క కేసులో బెయిల్ రాకపోయేసరికి ఆరోపణలు చేస్తున్నారు. బెయిల్ నిబంధనలపై న్యాయ సమీక్ష అవసరం
– ధనలక్ష్మి, న్యాయవాది

అబద్ధాలు చెప్పి బయటికొచ్చారు



చంద్రబాబుకు వైద్యం కోసం కోర్టు బెయిల్ ఇచ్చింది. బయట ప్రసంగాలు చేయొద్దని చెప్పింది. కానీ బాబు మాత్రం తన హక్కును కాపాడిన కోర్టు హక్కులనూ కాలరాశారు. అబద్ధం చెప్పి బయటకు వచ్చి ర్యాలీలు చేశారు.
– ఎస్.జ్యోతి, న్యాయవాది

రోజుకో రోగమని చెప్పారు..



చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు రోజుకో రోగమని చెప్పారు. వైద్యం కోసం బెయిల్ తెచ్చుకుని బయటికి రాగానే ర్యాలీలు చేశారు. బాబు అరెస్ట్ సమయంలోనూ ఇలాగే ప్రవర్తించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదం.
– జె.జయలక్ష్మి, న్యాయవాది

ఇలాంటి చర్యలను న్యాయస్థానాలు గమనించాలి



చంద్రబాబు అన్ని రకాల బెయిళ్లకు అప్లై చేసి, ఏదీ రాకపోయేసరికి 'అనారోగ్యాన్ని' అడ్డుపెట్టుకుని బయటపడ్డారు. జైలు నుంచి విడుదలయ్యాక ఆస్పత్రికి వెళ్లాల్సింది పోయి.. రాజకీయ ర్యాలీలు చేశారు. న్యాయస్థానాలు ఇలాంటివి గమనించాలి.
– ఉషాజ్యోతి, న్యాయవాది

శ్రీవారి సేవలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి లడ్డూ ప్రసాదాలు అందజేస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుమల: తిరుమల శ్రీవారిని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే స్వామివారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య, మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు, ఏపీ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య, మాజీ న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి

దీపావళికి ముందే వెలుగులు

- ఇళ్ల స్థలాలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించడంపై విశాఖ జర్నలిస్టుల హర్షం
- 'సీఎం జగన్‌కు వందనం' పేరుతో బీచ్ రోడ్డులో ర్యాలీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

సాక్షి, విశాఖపట్నం: తమ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్థం చేసుకుని ఇళ్ల స్థలాలు కేటాయించాలని నిర్ణయించడం ద్వారా జర్నలిస్టుల కుటుంబాల్లో దీపావళికి ముందే వెలుగులు నింపారని విశాఖపట్నం జిల్లా జర్నలిస్టులు హర్షం వ్యక్తంచేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో ఆదివారం ఉదయం స్థానిక బీచ్ రోడ్డులో 'సీఎం వైఎస్ జగన్‌కు విశాఖ జర్నలిస్టుల వందనం' పేరుతో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. సీ హారియర్ మ్యూజియం నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు కొనసాగిన ర్యాలీలో జర్నలిస్టులు థాంక్యూ సీఎం సార్.. అంటూ నినాదాలు చేశారు. బీచ్ రోడ్డులో ఉన్న మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు కేజీ రాఘవేంద్రారెడ్డి, జి.జనార్దన్, అధ్యక్షుడు బి.రవికాంత్, ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఆర్.రామచంద్రరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు అశోక్, చందూయాదవ్, పీఎస్ మూర్తి, సాంబశివరావు, దుక్కా మురళీకృష్ణరెడ్డి, కోయిలాడ పరుశురాం, బందరు శివప్రసాద్, ఉప్పల భాస్కరరావు, ప్రసాద్, ఈశ్వర్, రవిచంద్ర తోపాటు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

సంక్షేమం అందడం ఇష్టంలేకే తప్పుడు కేసులు

1,134వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



తాడికొండ: బహుజనులు ఆర్థికంగా స్థిరపడితే తనను మర్చిపోతారన్న భయంతో బాబు అండ్ కో తమపై తప్పుడు కేసులు పెడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1,134వ రోజుకు చేరాయి. దీక్షల శిబిరాన్ని పలువురు ముఖ్య అతిథులు సందర్శించి, మద్దతు తెలిపారు. కులమతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి చంద్రబాబు రాజకీయం లబ్ధిపొందుతున్నాడని విమర్శించారు. సీఎం జగన్ చొరవ, ఆయన ఇచ్చే సంక్షేమంతో ఆర్థికంగా స్థిరపడుతుంటే చూసి ఓర్వలేక ఇబ్బందులు పెడుతున్నాడని మండిపడ్డారు. రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల ప్రజలు చంద్రబాబు కారణంగా మోసపోయామని గ్రహించినందువల్లే గత ఎన్నికల్లో ఆయన ఓడిపోయారని అన్నారు. రాష్ట్రంలోని కులోన్మాదులంతా ఏకమై అమరావతి పేరుతో చేసిన నిలువు దోపిడీని తక్షణమే వెలికి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బేతపూడి రాజేంద్రకుమార్, ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులి దాసు, పిడతల అభిషేక్, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అవినీతిపరులంతా బీజేపీలోకే: కేజ్రీవాల్

చండీగఢ్: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అవినీతిపై పోరాటం పేరిట డ్రామాలు ఆడుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అవినీతిపరులుగా ముద్ర పడిన వారిని బీజేపీలో చేర్చుకొని, మంత్రి పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఆదివారం హరియాణాలోని రోహ్‌తక్‌లో పార్టీ కార్యక్రమంలో కేజ్రీవాల్ మాట్లాడారు. అవినీతిపై మోదీ సర్కారు సాగిస్తున్న పోరాటమంతా నాటకమేనని ధ్వజమెత్తారు. నేరాలు, అవినీతికి పాల్పడిన వారు బీజేపీలో చేరుతున్నారని, దాంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు వారిని ఏమీ చేయలేకపోతున్నాయని పేర్కొన్నారు. బీజేపీలో చేరి రక్షణ పొందుతున్న అక్రమార్కుల జోలికెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదని చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కేసుల్లో చిక్కుకొని జైలుకెళ్లిన వారంతా అవినీతిపరులు కాదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఈడీ కేసుల భయంతో బీజేపీలో చేరినవారే అసలైన అవినీతిపరులని తేల్చిచెప్పారు.

అణు జలాంతర్గామి నుంచి ఖండాంతర క్షిపణి పరీక్ష

మాస్కో: అణు జలాంతర్గామి నుంచి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతంగా నిర్వహించినట్లు రష్యా ఆర్మీ ఆదివారం ప్రకటించింది. ఈ క్షిపణి అణువార్‌హెడ్లను మోసుకెళ్లగలదని స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌పై కొనసాగిస్తున్న యుద్ధంతో రష్యా, పశ్చిమదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రం కావడం, అంతర్జాతీయ అణు పరీక్ష నిషేధ ఒప్పందం నుంచి వైదొలుగుతూ రష్యా పార్లమెంట్ ఆమోదించిన బిల్లుపై అధ్యక్షుడు పుతిన్ గత వారం సంతకం చేసిన సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇంపరేటర్ అలెగ్జాండర్ 3 అణు జలాంతర్గామి నుంచి ఖండాంతర బులావా క్షిపణిని రష్యా ఉత్తర తెల్ల సముద్రంలో నీటి అడుగు నుంచి పరీక్షించి చూసినట్లు రష్యా రక్షణ శాఖ వివరించింది.

అయోధ్యలో అక్షత పూజ

అయోధ్య: అయోధ్యలో శ్రీరామ మందిరంలో ప్రతిష్ఠాపన పూజలు ఆదివారం సంప్రదాయం ప్రకారం అక్షత పూజతో మొదలయ్యాయి. ఆలయంలోని రామదర్బార్, శ్రీరాముని ఆస్థానంలో పసుపు, దేశవాళీ నెయ్యి కలిపిన 100 క్వింటాళ్ల బియ్యంతో అక్షత పూజ నిర్వహిస్తున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. దేశంలోని 45 ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ)కు చెందిన 90 మంది ముఖ్యులకు 5 కిలోల మేర అక్షతలను పంపిణీ చేస్తారు. వీరు వీటిని జిల్లాలు, బ్లాకులు, తహసీల్‌లు, గ్రామాల ప్రతినిధులకు అందజేస్తారని ట్రస్ట్ కార్యదర్శి చంపత్‌రాయ్ చెప్పారు. మిగతా అక్షతలను ఆలయంలోని శ్రీరాముని విగ్రహం ఎదురుగా కలశంలో ఉంచుతారు. వీరు ఈ అక్షతలను వీరు వచ్చే జనవరి 22వ తేదీన అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ఠాపన జరిగేలోగా దేశవ్యాప్తంగా ప్రజలకు పంపిణీ చేయనున్నారని ట్రస్ట్ తెలిపింది.

గ్రెనేడ్ ప్రమాదవశాత్తూ పేలి జవాన్ మృత్యువాత

దంతెవాడ(ఛత్తీస్‌గఢ్): బీఎస్‌ఎఫ్ జవాను ఒకరు గ్రెనేడ్ ప్రమాదవశాత్తూ పేలడంతో మృత్యువాతపడ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. బీఎస్‌ఎఫ్ 70వ బెటాలియన్ జవాన్లు ఎన్నికల విధుల్లో భాగంగా కాటేకల్యాణ్ పోలీస్‌స్టేషన్‌లో మకాం వేశారు. తనిఖీల కోసం బయలుదేరి వెళ్తున్న సమయంలో బల్బీర్ చంద్ అనే జవాను వద్ద పౌచ్‌లో ఉన్న గ్రెనేడ్ ప్రమాదవశాత్తూ పేలింది. తీవ్రంగా గాయపడిన బల్బీర్‌ను వెంటనే దంతెవాడ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయన అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బల్బీర్ చంద్ స్వరాష్ట్రం హిమాచల్ ప్రదేశ్.

గనుల శాఖ మహిళా అధికారి హత్య

బనశంకరి: బెంగళూరులో దారుణం చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్ర గనులు, భూ విజ్ఞానశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కేఎస్ ప్రతిమ(40) అనే అధికారిణి దారుణహత్యకు గురయ్యా. శనివారం రాత్రి 8 గంటలకు ఆమె ఆఫీసు నుంచి దొడ్డకల్లసంద్రలోని తన అపార్టుమెంటులోని ఫ్లాటుకు చేరుకున్నారు. కొంతసేపటికి గుర్తుతెలియని దుండగులు చొరబడి ఆమెను గొంతుకోసి, చంపి పరారయ్యారు. ఆదివారం ఉదయం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో 8 గంటల సమయంలో స్నేహితులు వచ్చి చూశాక దారుణం వెలుగులోకి వచ్చింది. సుబ్రమణ్యనగర పోలీసులు విచారణ చేపట్టారు. ఆమె భర్త, ఇంటర్ చదివిన కొడుకు సొంతూరైన శివమొగ్గలోని తీర్థహళ్లి తాలూకాలో ఉంటారు.

ఢిల్లీలో భూటాన్ రాజుకు ఘనస్వాగతం

న్యూఢిల్లీ: భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌చుక్‌కు ఆదివారం ఢిల్లీలో భారత ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ విమానాశ్రయంలో ఆయనకు ఆహ్వానం పలికారు. అనంతరం ఆయనతో భేటీ అయ్యారు. భారత్‌లో రాజు వాంగ్‌చుక్ ఎనిమిది రోజుల పర్యటన ఈ నెల 3న అస్సాం రాజధాని గువాహటిలో మొదలైంది. పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో ఆయన సమావేశం కానున్నారు.

శరణార్థి శిబిరాలపై భీకర దాడులు

గాజాలో నిప్పుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్ సైన్యం

మూడు శిబిరాలపై దాడులు • 24 గంటల్లో 73 మంది మృతి



ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన మఘాజి శరణార్థి శిబిరం శిథిలాల్లో బాధితుల కోసం పాలస్తీనియన్ల అన్వేషణ

గాజాసిటీ/ఖాన్ యూనిస్/జెరూసలేం: గాజాలోని శరణార్థి శిబిరాలు ఇజ్రాయెల్ వైమానిక దాడులతో దద్దరిల్లుతున్నాయి. సాధారణ పాలస్తీనియన్లు తలదాచుకుంటున్న శిబిరాలపై ఇజ్రాయెల్ సైన్యం నిప్పుల వర్షం కురిపిస్తోంది. హమాస్ మిలిటెంట్లపై ప్రారంభించిన యుద్ధం అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటోంది. సెంట్రల్ గాజాలో శనివారం అర్ధరాత్రి నుంచి కనీసం మూడు శరణార్థి శిబిరాలపై బాంబు దాడులు జరిగాయి. అల్-మఘాజీ రెఫ్యూజీ క్యాంపుపై జరిగిన దాడిలో ఏకంగా 47 మంది మరణించారు. 34 మంది గాయపడ్డారు. జబాలియా క్యాంపులో ఆరుగురు మృతిచెందారు. ఆదివారం బురీజ్ క్యాంప్‌లోని నివాస భవనాలపై జరిగిన వైమానిక దాడిలో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. 24 గంటల వ్యవధిలో 73 మంది సామాన్య ప్రజలు మృత్యువాత పడడం ఆందోళనకు గురిచేస్తోంది. ఈ మూడు ఘటనల్లో 60 మందికిపైగా జనం క్షతగాత్రులుగా మారారు. వారిని సమీపంలోని ఆసుపత్రుల్లో చేర్పించినట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇటీవలే జబాలియా, బురీజ్ క్యాంపులపై జరిగిన దాడుల్లో 200 మందికిపైగా జనం మరణించారు. హమాస్‌తో సంబంధం లేని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేస్తుండడాన్ని అరబ్ దేశాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

అల్-ఖుద్స్ ఆసుపత్రి సమీపంలో పేలుడు

గాజాలో ఆదివారం ఉదయం అల్-ఖుద్స్ హాస్పిటల్ సమీపంలో భారీ పేలుడు సంభవించినట్లు పాలస్తీనా రెడ్ క్రిసెంట్ సొసైటీ వెల్లడించింది. ఆసుపత్రికి కేవలం 50 మీటర్ల దూరంలోని ఓ భవనంపై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడి చేసిందని పేర్కొంది. భవనం చాలావరకు ధ్వంసమైందని, చాలామంది మృతి చెందారని తెలియజేసింది. దీనిపై ఇజ్రాయెల్ సైన్యం స్పందించింది. హమాస్ మిలిటెంట్లు సామాన్య ప్రజల ముసుగులో ఆసుపత్రులు, పాఠశాలల సమీపంలోని మకాం వేస్తున్నారని వివరించింది. ఇజ్రాయెల్-హమాస్ మిలిటెంట్ల మధ్య అక్టోబర్ 7న ప్రారంభమైన ఘర్షణ దాదాపు నెల రోజులకు చేరింది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 9,700 మందికిపైగా మరణించారు. వీరిలో 4,800 మందికిపైగా చిన్నపిల్లలు ఉన్నారు. గాజాపై భూతల దాడుల్లో తమ సైనికులు 29 మంది మృతిచెందారని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

గాజాపై అణుబాంబు ప్రయోగిస్తామన్న మంత్రిపై సస్పెన్షన్ వేటు

హమాస్ మిలిటెంట్లను అంతం చేయడానికి గాజాపై అణుబాంబు ప్రయోగించే అవకాశం ఉందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఇజ్రాయెల్ మంత్రిపై సస్పెన్షన్ వేటు పడింది. జెరూసలేం వ్యవహారాల మంత్రి అమిచాయ్ ఎలియాహూ ఆదివారం ఓ ఇంటర్వ్యూలో గాజాలో సాధారణ ప్రజలెవరూ లేరని, అందరూ మిలిటెంట్లే ఉన్నారని అర్థం వచ్చేలా మాట్లాడారు. గాజాపై అణుబాంబు ప్రయోగించే ఐచ్ఛికం కూడా ఉందని చెప్పారు. మంత్రి వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. మంత్రి వ్యవహారంపై ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తీవ్రంగా స్పందించారు. మంత్రిని ప్రభుత్వ సమావేశాల నుంచి నిరవధికంగా సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం, సైన్యం అంతర్జాతీయ చట్టాల ప్రమాణాల ప్రకారమే నడుచుకుంటున్నాయని నెతన్యాహూ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలపై మంత్రి అమిచాయ్ ఎలియాహూ వివరణ ఇచ్చారు. తన ఉద్దేశాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పుకొచ్చారు.

అబ్బాస్‌తో ఆంటోనీ బ్లింకెన్ భేటీ

అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆదివారం వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్‌తో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం, గాజాలో పాలస్తీనియన్ల ఇబ్బందులపై చర్చించారు. అక్టోబర్ 7 తర్వాత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో 150 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు.

జర్నలిస్టుకు తీరని దుఃఖం

అల్-మఘాజీ క్యాంపుపై జరిగిన దాడి జర్నలిస్టు మొహమ్మద్ అలలౌల్‌కు తీరని విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో ఆయన నలుగురు పిల్లలు, ముగ్గురు తోబుట్టువులను కోల్పోయారు. టర్కిష్ వార్తా సంస్థ అనడోలులో ఆయన ఫ్రీలాన్స్ ఫొటోజర్నలిస్టుగా పని చేస్తున్నారు. తన కుటుంబంతో కలిసి అల్-మఘాజీ క్యాంపులో ఉంటున్నారు. శనివారం రాత్రి ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడుల్లో మొహమ్మద్ కుటుంబం ఉంటున్న ఇళ్లు ధ్వంసమయ్యింది. నలుగురు పిల్లలు, ముగ్గురు తోబుట్టువులు చనిపోయారు. ఆయన భార్య, తల్లి, తండ్రి, మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు.



గాజాస్ట్రిప్‌లోకి ప్రవేశించి మిలిటెంట్లపై భూతల దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ఆర్మీ



తన కూతురు మృతదేహంతో డెయిల్ అల్ బలా ఆస్పత్రి వద్ద పాలస్తీనా జర్నలిస్ట్ మహ్మద్ అల్ అలౌల్



మఘాజి శరణార్థి శిబిరంపై దాడుల అనంతరం తమ ఇంటి వెలుపలికి వచ్చి భయం భయంగా చూస్తున్న బాలిక



గాజా సిటీలోని అల్-షిఫా ఆస్పత్రిలో సరిపోను బెడ్లు లేకపోవటంతో నేల మీదే ఓ బాధితురాలు..




ధ్వంసమైన మఘాజి శరణార్థి శిబిరం సమీపంలోని తమ ఇంటి వద్ద పడిన శిథిలాలను ఊడ్చేస్తున్న చిన్నారులు

ఢిల్లీలో జనం ఉక్కిరిబిక్కిరి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం బెంబేలెత్తిస్తోంది. వాయు నాణ్యత పడిపోతోంది. వరుసగా ఆరో రోజు ఆదివారం సైతం పొగ మంచు దట్టంగా కమ్మేసింది. నగరంలో కాలుష్యం మరోసారి 'అత్యంత తీవ్రం' కేటగిరీలోకి చేరింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) శనివారం సాయంత్రం 4 గంటలకు 415 ఉండగా, ఆదివారం ఉదయం 7 గంటలకు 460గా దిగజారింది. కలుషిత గాలితో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఢిల్లీలో ప్రాథమిక పాఠశాలలకు సెలవులను ప్రభుత్వం మరో ఐదు రోజులపాటు పొడిగించింది. ఈ నెల 10వ తేదీ వరకు సెలవులను పొడిగిస్తూ ఆదేశాలు జారీచేసింది. 6 నుంచి 12వ తరగతి వరకు స్కూళ్లు తెరిచే ఉంటాయని పేర్కొంది. విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు కూడా వినవచ్చని ఢిల్లీ విద్యా శాఖ మంత్రి సూచించారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతుండడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హరియాణాలో పంట వ్యర్థాలను దహనం చేస్తుండడంతో ఢిల్లీలో వాయు నాణ్యత పడిపోతోంది. ప్రపంచంలోని వివిధ దేశాల రాజధానుల కంటే ఢిల్లీలో వాయు నాణ్యత అత్యంత దారుణంగా ఉన్నట్లు ఇప్పటికే పలు అధ్యయనాల్లో తేలింది.

వాణిజ్య వాహనాలకు నో ఎంట్రీ

ఢిల్లీలో వాయు నాణ్యత నానాటికీ పడిపోతుండడం, కాలుష్యం పెరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిర్మాణ పనులపై నిషేధం విధిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కాలుష్యానికి కారణమయ్యే రవాణా వాహనాలు, వాణిజ్య వాహనాల ప్రవేశాన్ని నిషేధించింది.



మేనిఫెస్టోను చూపుతున్న సీఎం బఘేల్

రుణ మాఫీ, కుల గణన

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి ఈ నెల 7, 17వ తేదీల్లో రెండు విడతలుగా జరిగే ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. కులగణన, ధాన్యానికి మరింత మద్దతు ధర, రైతులకు రుణామాఫీ, సబ్సిడీ ధరకే వంటగ్యాస్ వంటివి ఇందులో ప్రధాన హామీలుగా ఉన్నాయి. రాజ్‌నందన్‌గావ్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం బఘేల్ ఎన్నికల హామీలను ప్రకటించారు. మళ్లీ అధికారమిస్తే.. ఎకరానికి 20 క్వింటాళ్ల వరిధాన్యాన్ని రూ.3,200 చొప్పున కొనుగోలు చేస్తామని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందిస్తామని తెలిపారు. తునికాకు స్టాండర్డ్ బ్యాగుకు రూ.4 వేలకు బదులు రూ.6 వేలు చెల్లిస్తామని, సేకరణ దారులకు అదనంగా రూ.4 వేల బోనస్ ఇస్తామని ప్రకటించారు. మహిళలకు వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ ఖాతాల్లోనే జమచేస్తామని చెప్పారు.

గిరిజనులకు చేసిందేమీ లేదు

మధ్యప్రదేశ్‌ను ఏటీఎంగా మార్చుకోజూస్తోంది • కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు

ఖాండ్వా/సియోనీ: దేశాన్ని దాదాపు 60 ఏళ్ల పాటు పాలించినా గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ చేసిందంటూ ఏమీ లేదని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మధ్యప్రదేశ్‌లో ఖాండ్వా, సియోనీ జిల్లాల్లో ఆయన బహిరంగ సభల్లో ప్రసంగించారు. గిరిజనుల సంక్షేమానికి కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు చేపట్టిన చర్యలను వివరించారు. వాజ్‌పేయీ సారథ్యంలోని బీజేపీ సర్కారు దేశంలో తొలిసారి ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. రాముని క్షేమం చూసిన, ఆయన్ను పురుషోత్తమునిగా ప్రస్తుతించిన గిరిజనులను పూజించడం బీజేపీ సంస్కృతి అన్నారు. ''కాంగ్రెస్‌కు మాత్రం గాంధీల కుటుంబ క్షేమం తప్ప మరేమీ పట్టదు. మధ్యప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ ముఖ్య నేతలిద్దరూ కొట్టుకుంటున్నారు. తమ కుమారుల రాజకీయ భవిష్యత్తు కోసం ఆరాటపడుతున్నారు. ఇక్కడ ఎలాగోలా అధికారంలోకి వచ్చి, లోక్‌సభ ఎన్నికల ఖర్చుల నిమిత్తం రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అలాంటి పార్టీ బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడం ప్రజల బాధ్యత. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా లక్షలాది కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడింది. దాని నిజ స్వరూపాన్ని అర్థం చేసుకున్న ప్రజలు ఆ పార్టీని ప్రతి ఎన్నికలోనూ ఓడిస్తూ దేశం నుంచి తరిమికొడుతున్నారు''అని మోదీ అన్నారు. ప్రస్తుతం నెలకు రూ.300 ఉన్న నెలవారీ మొబైల్ సేవల చార్జీలు కాంగ్రెస్ గనక అధికారంలో ఉంటే ఏకంగా రూ. 4,000-5,000 దాకా ఉండేవన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చినవాడిగా పేదల కష్టాలేమిటో తనకు తెలుసన్నారు. కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్ మధ్య అప్పుడే అధికారం కోసం కీచులాట మొదలైందని ఎద్దేవా చేశారు.



అద్భుత మిజోరం మా లక్ష్యం

ఐజ్వాల్: మిజోరంను అద్భుతంగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. మంగళవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఓటర్లను ఉద్దేశించి ఆయన వీడియో సందేశమిచ్చారు. మిజోలు తన కుటుంబ సభ్యులతో సమానమని చెప్పారు. విద్య, వైద్య తదితర అన్ని రంగాల్లోనూ మిజోరంను స్వయంసమృద్ధంగా తీర్చిదిద్దుతామన్నారు. అక్టోబర్ 30న మిజోరంలో మోదీ ఎన్నికల సభ జరగాల్సి ఉండగా రద్దయింది.

కుల గణనలో ముస్లింలు, యాదవుల సంఖ్యను పెంచారు

బిహార్ సీఎం నితీశ్‌పై హోం మంత్రి అమిత్ షా విమర్శలు

ముజఫర్‌పూర్: బిహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగా రాష్ట్రంలో చేపట్టిన కులగణనలో ముస్లింలు, యాదవుల సంఖ్యను ఉద్దేశపూర్వకంగానే ఎక్కువ చేసి చూపించిందని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. మొత్తమ్మీద వెనుకబడిన కులాల వారికి మొండిచేయి చూపిందని చెప్పారు. ముజఫర్‌పూర్ జిల్లా పటాహిలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ముస్లింల పట్ల అనుసరిస్తున్న బుజ్జగింపు వైఖరి ఫలితంగా నేపాల్, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర సమస్యలు తప్పవని నితీశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇటువంటి రాజకీయాలకు తక్షణమే ముగింపు పలకాలని కోరారు. 'నితీశ్ కుమార్ ప్రధాని పీఠంపై ఆశలు వదులుకోవాలి. అది ఎన్నటికీ జరగదు. ఇండియా కూటమికి కనీసం ఆయన కన్వీనర్ అయినా కాలేకపోయారు. బిహార్‌లో గూండారాజ్యాన్ని తిరిగి రావడానికి ఆయనే బాధ్యుడు'అని ఆరోపించారు. గతంలో కులగణనకు ఆదేశాలు ఇచ్చిన సమయంలో రాష్ట్రంలో నితీశ్ కుమార్ ప్రభుత్వంలో బీజేపీ భాగంగా ఉన్నట్లు ఆయన గుర్తు చేశారు. ఓబీసీలను ఎన్నడూ పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ సైతం ఇప్పుడు అధికారంలోకి వస్తే దేశవ్యాప్త కులగణన చేపడతానంటోందని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో అధికారం పంచుకుంటున్న జేడీయూ, ఆర్‌జేడీలు ప్రతిపక్ష ఇండియా కూటమిలో కీలకంగా ఉన్నాయంటూ అమిత్ షా, ఈ కూటమి ఏకైక ఎజెండా ప్రధాని మోదీని వ్యతిరేకించడమేనన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని ఈ కూటమి పార్టీలు వ్యతిరేకించాయని కూడా మంత్రి చెప్పారు. కేంద్ర కేబినెట్‌లో 27 మంది మంత్రులు, అంటే 35 శాతం మంది వెనుకబడిన కులాలకు చెందిన వారేనన్నారు. ప్రధాని మోదీ హయాంలోనే ఓబీసీల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించామన్నారు.



కేదార్‌నాథ్‌ను దర్శించుకున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదివారం ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రైవేట్ హెలికాప్టర్‌లో ఆయన అక్కడికి చేరుకున్నారు. ''కేదార్‌నాథ్ క్షేత్రాన్ని దర్శించుకొని పూజలు చేయడం ఆనందంగా ఉంది. హర హర మహాదేవ్'' అంటూ ఫేస్‌బుక్‌లో రాహుల్ పోస్టు చేశారు. ఆలయాన్ని దర్శించుకున్న ఫొటోను కూడా షేర్ చేశారు. సముద్ర మట్టానికి 3,584 మీటర్ల ఎత్తులో ఆలయం ఉంది.

కాంగ్రెస్ పార్టీ మోసకారి: అఖిలేశ్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ 'ఇండియా' కూటమిలోని కీలకమైన కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. ఆ పార్టీ మహా మోసకారి అని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గానీ, బీజేపీకి గానీ ఓటేయరాదని ఓటర్లను ఆయన కోరారు. ఈ రెండు పార్టీలు ప్రకటించిన పథకాలు, హామీలు అమలయ్యేవి కావని చెప్పారు. ఆదివారం టికమ్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ..'రేషన్ అందనప్పుడు బీజేపీకి ఎందుకు ఓటేయడం? కాంగ్రెస్‌కు కూడా వద్దు. ఆ పార్టీ చాలా మోసకారి. ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ కులగణన అంటోంది'అని అఖిలేశ్ అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీయే కుల ఆధారిత సర్వేను నిలిపివేసింది. మండల్ కమిషన్ సిఫారసులకు కూడా అడ్డుపుల్ల వేసింది. బీజేపీ కూడా అదే దారిలో వెళుతోంది. కులగణన కోసం డిమాండ్లు తీవ్రం కావడంతో కాంగ్రెస్ ముందుకు వచ్చి తాము చేపడతామని చెబుతోంది. బీసీల రిజర్వేషన్లను వ్యతిరేకించే బీజేపీ కూడా కుల గణన గురించి మాట్లాడుతోంది'అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు ముఖ్యంగా ఆదివాసీ, దళిత మహిళలు ఎంతో అన్యాయానికి గురవుతున్నారన్నారు. బీజేపీ నమ్మేది ప్రజాస్వామ్యాన్ని కాదు, లూటీ స్వామ్యాన్ని అని వ్యాఖ్యానించారు. ఇలా ఉండగా, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీని ధీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో ప్రతిపక్షాలతో ఏర్పాటైన ఇండియా కూటమిలో కాంగ్రెస్, ఎస్పీలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమకు కొన్ని సీట్లు కేటాయించాలన్న డిమాండ్‌ను కాంగ్రెస్ పక్కన బెట్టడంతో పోటీగా కొన్ని సీట్లలో ఎస్పీ సొంతంగా అభ్యర్థులను బరిలోకి దించింది. ఈ వ్యవహారంలో రెండు పార్టీల మధ్య విభేదాలు ముదిరాయి.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం | 6 | నవంబర్ | 2023

స్ఫూర్తి పరుగు



బనశంకరి: బెంగళూరు కబ్బన్ పార్కులో ఆదివారం స్ఫూర్తి దాయకమైన మహిళా నేతలకు మద్దతు ఇచ్చే లక్ష్యంతో వాక్ టు ది బోర్డ్స్ అనే పరుగును ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించింది. వందలాది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అడవిలో ఎన్‌కౌంటర్

- వేటగాడు మృతి



మృతుడు మను (ఫైల్)

మైసూరు: చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేటె తాలూకాలోని బండిపుర అడవిలో మద్దూరు రేంజ్ వద్ద వేటగాళ్లపై అటవీ సిబ్బంది కాల్పులు జరిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక వేటగాడు మృతి చెందాడు. గుండ్లుపేటె తాలూకాలోని బీమనెబీడు గ్రామానికి చెందిన మను (26) అనే యువకుడు మృతుడు. సుమారు 10 మందికి పైన వేటగాళ్ళు శనివారం రాత్రి జింకల వేట కోసం మద్దూరు రేంజ్‌లోకి వచ్చారని, వీరిలో ఐదు మంది వద్ద నాటు తుపాకులు ఉన్నాయని అటవీ సిబ్బంది చెబుతున్నారు. వారు ఒక జింకను కూడా వేటాడారు. నాటు తుపాకుల శబ్దం విన్న అటవీ అధికారులు, గార్డులు వేటగాళ్లను వెంబడిస్తూ కాల్పులు జరిపారు. వేటగాళ్ళు కూడా ఎదురు కాల్పులు జరిపారు. చివరకు 9 మంది వేటగాళ్లు పారిపోగా ఒకరు అక్కడికక్కడే చనిపోయారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

బాలికపై అత్యాచారం, ఆత్మహత్య కేసులో 20 ఏళ్ల జైలు



శివమొగ్గ: మైనర్ బాలికపైన లైంగిక దాడి జరిగింది, ఈ దారుణాన్ని తట్టుకోలేక బాలిక ఆత్మహత్య చేసుకున్న కేసులో దోషికి కోర్టు 20 సంవత్సరాల కఠిన జైలు శిక్షను విధించింది. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. 17 లక్షల పరిహారం ఇవ్వాలని జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు జడ్జి లత ఆదేశించారు. వివరాలు... శివమొగ్గలో 2020లో 16 ఏళ్ల బాలికపై 20 సంవత్సరాల యువకుడు లైంగిక దాడి చేయగా, అవమాన భారంతో బాలిక ఆత్మహత్య చేసుకొంది. రిప్పన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దుండగున్ని అరెస్టు చేశారు. కేసు కోర్టులో విచారణ సాగుతూ వస్తోంది. నేరం రుజువు కావడంతో జడ్జి శనివారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. దోషికి రూ. 1.25 లక్షల జరిమానా కూడా విధించారు.

బెంగళూరులో 25న కంబళ



శివాజీనగర: సిలికాన్ సిటీలో ప్యాలెస్ మైదానంలో ఈ నెల 25 నుంచి కంబళ క్రీడా పోటీలు నగరవాసులను రంజింపజేయనున్నాయి. దక్షిణ కన్నడ ప్రాంతంలో బురద మడుల్లో దున్న పోతులను పరిగెత్తించే కంబళ క్రీడలు ప్రసిద్ధి పొందడం తెలిసిందే. బెంగళూరులో రెండురోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. ఇందుకోసం చెరువును సిద్ధం చేస్తున్నారు. లక్షలాది మంది జనం వస్తారనే అంచనాకు తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయని బెంగళూరు కంబళ కమిటీ గౌరవాధ్యక్షుడు కే.ప్రకాశ్‌శెట్టి తెలిపారు. ఈ వేడుక నిర్వహణకు రూ. కోటి సాయాన్ని సీఎం సిద్దరామయ్య ప్రకటించారని చెప్పారు.

ప్రతిమ హత్యపై అనుమానాలు

- గనుల మంత్రి మల్లికార్జున్

బనశంకరి: గనులు, భూవిజ్ఞానశాఖలో పెద్ద సమస్యలు లేవని, ప్రతిమా హత్యకు కారణం ఏమిటి అనేది దర్యాప్తు తరువాత తెలుస్తుందని భూగర్భ గనుల శాఖా మంత్రి ఎస్ఎస్.మల్లికార్జున్ అన్నారు. ఆదివారం దావణగెరెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హత్యకు కచ్చితమైన కారణం తెలియదు. కొందరు కుటుంబ సమస్యలు ఉన్నాయని చెబితే, మరికొందరు అలాంటివేమీ లేవన్నారు. అక్రమ గనులకు బ్రేక్ వేశారనేది కారణం కావచ్చనే అనుమానం ఉందన్నారు. ప్రతిమా ఉత్తమ అధికారి. శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడాను అని తెలిపారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు తరువాతే నిజాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు.

రహదారుల్లో హాహాకారాలు

- రాష్ట్రంలో మితిమీరిన యాక్సిడెంట్లు
- నిత్యం 30 మంది దుర్మరణం
- దేశంలో రెండోస్థానంలో బెంగళూరు



ఇటీవల హొసపేటె వద్ద ట్రాక్స్- టిప్పర్ ఢీ, ఈ ఘటనలో 7 మంది మృతి చెందారు

బనశంకరి: రాష్ట్రంలో గత రెండునెలల్లో రోడ్డు ప్రమాదాలు హెచ్చుమీరగా అందులో జాతీయ రహదారుల్లో యాక్సిడెంట్లు పెరిగాయి. చలికాలం కావడంతో రానున్న మూడునెలలు పాటు వాహనాల డ్రైవర్లు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ పోలీసులు సలహా ఇచ్చారు. మే నెలలో రోడ్డు ప్రమాదాల్లో 1,094 మంది మృతి చెందారు. జూన్‌లో 965 మంది మరణించారు. పోలీసులు చర్యలు చేపట్టడంతో జూలై నెలలో మృతుల సంఖ్య 807కి తగ్గింది. కానీ గత సెప్టెంబరులో మళ్లీ 907 మంది మృత్యువాత పడ్డారు.

క్యాన్సర్ కంటే డేంజర్

రాష్ట్రంలో యాక్సిడెంట్లకు ప్రతి రోజు సగటున 30 మంది మరణిస్తుంటే, అంతకు రెట్టింపు సంఖ్యలో గాయాల పాలై ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఫలితంగా వందలాది కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. ప్రాణాంతకమైన క్యాన్సర్ రోగం కంటే రోడ్డు ప్రమాదాలే ఎక్కువ మందిని బలిగొంటున్నాయి. దీంతో రహదారి భద్రత అనేది మిథ్యగా మారిందనే ఆరోపణలున్నాయి. పెద్ద యాక్సిడెంట్ జరిగిన ప్రతిసారీ, వివిధ ప్రభుత్వ విభాగాలు సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు రావడం పరిపాటైంది.

బ్లాక్ స్పాట్లు, పర్యవేక్షణ లోపాలు



సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో గణేశ్ చతుర్థి, దసరా పండుగల కాలంలో పోలీసులు బందోబస్తు విధుల్లో ఎక్కువసేపు ఉండడం వల్ల సంచార పర్యవేక్షణకు సమయం కేటాయించలేదు. దీంతో ప్రమాదాలు పెరిగాయని ట్రాఫిక్ పోలీసులు అభిప్రాయపడ్డారు. అంతేగాక ట్రాఫిక్, రోడ్డు సురక్షత విభాగాల్లో గతంలో ఉన్న ఏడీజీపీ అలోక్‌కుమార్ హైవేలు, రహదారుల్లో ప్రమాద స్థలాలను గుర్తించి నివారణ చర్యలకు చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల్లో జాగృతికి కృషి చేశారు. రాష్ట్రంలో ఎక్కడ ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవించినా నివేదిక తెప్పించుకుని ప్రమాద కారణాల పరిష్కారానికి పోలీసులు, రహదారుల శాఖలతో సమన్వయం చేశారు. అలోక్ కుమార్‌ను బదిలీ చేసిన తరువాత ఈ పోస్టుకు ఇప్పవరకు ఎవరినీ నియమించలేదు.

రెండో స్థానంలో బెంగళూరు

- గుంతలమయంగా మారిన రోడ్లతో జాతీయస్థాయిలో అపకీర్తి తెచ్చుకున్న సిలికాన్ సిటీ దేశంలో సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు నగరాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంది.
- రోడ్డు యాక్సిడెంట్ ఇన్ ఇండియా ఇచ్చిన నివేదికలో దీని గురించి ప్రస్తావించింది.
- దేశంలో కోటికి పైగా జనాభా ఉన్న నగరాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల జాబితాను విడుదల చేసింది. కాన్పూర్, అలహాబాద్, లక్నో, ఇండోర్, జైపూర్, రాయ్‌పుర, చెన్నైలు టాప్–10 జాబితాలో ఉన్నాయి. దేశంలో జరిగిన మొత్తం ప్రమాదాల్లో 41 శాతం ఈ నగరాల్లోనే నమోదయ్యాయి.
- 2022లో బెంగళూరులో 772 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. గతంలో రెండో స్థానంలో ఉన్న చెన్నైని కాదని బెంగళూరు ఆ స్థానంలోకి చేరుకుంది.
- చెన్నైలో 31 శాతం ప్రమాదాలు తగ్గగా మృతుల సంఖ్య కూడా 49 శాతం తగ్గింది. ముంబైలో 15 శాతం ప్రమాదాలు తగ్గగా 4 శాతం మృతులు తగ్గారు.

రాష్ట్రంలో గత రెండేళ్లలో నెలవారీ యాక్సిడెంట్లు, మరణాలు

నెల	2022	2023
జనవరి	956	958(మృతులు)
ఫిబ్రవరి	952	968
మార్చి	961	940
ఏప్రిల్	956	958
మే	1049	1094
జూన్	912	965
జూలై	886	807
ఆగసు	962	795
సెప్టెంబరు	763	905

- 2021లో 5వ స్థానంలో ఉన్న బెంగళూరు 2022లో టాప్-2కి చేరడం ద్వారా సిటీలో రోడ్డు భద్రత ఎంత ప్రమాదకరంగా ఉందో చాటుతోంది.

కాటేస్తున్న అతివేగం

దేశంలో అతివేగం డ్రైవింగ్ తో ఏడాదికి 7,105 మంది మృత్యువాతపడగా అందులో సిలికాన్ సిటీ అగ్రస్థానంలో ఉంది. ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారి సంఖ్య పెరుగుతోంది. దేశంలో 2021 తో పోలిస్తే 2022లో ప్రమాదాల సంఖ్య 9 శాతం పెరిగింది. అందులో 43 శాతం ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులు ఉంటున్నారు.

పొగ మంచుతో జాగ్రత్త

చలికాలంలో పొగమంచు వల్ల రాత్రి, ఉదయం వేళల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో వాహనాల డ్రైవర్లు, వాహనదారులు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి. మంచు వల్ల ముందు ఏముందో కనిపించదు. హెడ్‌లైట్ వెలుతురు కూడా సరిగా పనిచేయదు. వాహనాల దగ్గరకు వచ్చే వరకు తెలియకపోవడంతో దుర్ఘటనలు సంభవించే అవకాశం ఉంటుంది. ఇటీవల చిక్కబళ్లాపురలో ఇదే రీతిలో నిలిపి ఉన్న సిమెంటు ట్యాంకర్‌ను టాటా సుమో ఢీకొని 13 మంది మృత్యువాత పడ్డారు. చలికాలంలో రాత్రి ప్రయాణాలకు దూరంగా ఉండటం మంచిది. ఉదయం రద్దీ రోడ్లపై వాకింగ్‌కు వెళ్లకపోవడం ఉత్తమం.



ఆదివారం చిక్కమగళూరు నగరంలో దత్తమాలధారుల ర్యాలీ

దత్తమాలా అభియాన్ షురూ

- చిక్కమగళూరులో సందడి

యశవంతపుర: శ్రీరామసేనచే దత్తమాలా అభియాన ప్రారంభమైంది. ఆదివారం చిక్కమగళూరు నగరంలో బృహత్ శోభాయాత్రను నిర్వహించారు. వందల మంది మాలధారులు పాల్గొనగా ఎంజీ రోడ్డు కేసరి జెండాలతో నిండిపోయింది. గొడవలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. బుడన్‌గిరి కొండపైనా భక్తుల సందడి మొదలైంది. హై అలర్ట్‌గా సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా చేపట్టారు. శ్రీరామసేన సంస్థాపక ప్రమోద్ ముతాలిక్ తదితరలు పాల్గొన్నారు.



బృహత్ జెండాతో చిందులు

తురనూరులో మృత్యు తాండవం

- నెలన్నరలో 30 మంది కన్నుమూత
- గ్రామం వీడుతున్న ప్రజలు



గ్రామంలోని దుర్గాదేవి ఆలయం

యశవంతపుర: ఆ గ్రామంలో నెలన్నర రోజుల్లో 30 మంది మృతి చెందటం గ్రామస్థులను భయ భ్రాంతులకు గురి చేస్తోంది. బెళగావి జిల్లా రామదుర్గ తాలూకా తురనూరు గ్రామంలో ఏదో ఒక అనారోగ్యం, లేదా యాక్సిడెంట్‌కు చిక్కి వరుసగా జనం చనిపోతున్నారు. గత 45 రోజుల్లో 30 మంది వివిధ కారణాలతో కన్నుమూశారు. గోడచి వీరభద్రేశ్వర దేవస్థానం అర్చకుని సలహా మేరకు వచ్చే మంగళవారం హవన, అభిషేకం, శాంతి హోమాలను నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే 15 రోజుల పాటు దుర్గ గుడిని మూసి వేయాలని సూచనలు చేశారు. ఈ నెల 15న దేవి జాతర చేయనున్నారు. దుర్గాదేవి ఆలయానికి అపచారం జరిగిందని, అందుకే మృత్యు తాండవం చేస్తోందని కొందరు గ్రామస్తులు అన్నారు. భయపడిన చాలామంది గ్రామస్తులు ఇళ్లకు తాళాలేసుకుని వేరే ఊళ్లకు వెళ్లిపోయారు. ఊళ్లో వృద్ధులు మాత్రం కనిపిస్తున్నారు. మరణాలపై తాలూకా ఆరోగ్య అధికారి మహేశ్‌ను వివరణ కోరగా సమాచారం తెలుసుకొని అరోగ్య శిబిరంను నిర్వహిస్తామని తెలిపారు.

ఈ పెట్టెల్లో ఏముందో?



అనుమానాస్పదంగా కనిపించిన పెట్టెలు



పరిశీలిస్తున్న పోలీసులు

- శివమొగ్గ రైల్వేస్టేషన్ వద్ద కలకలం

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఆదివారం రెండు పెట్టెలు కలకలం సృష్టించాయి. రేకు పెట్టెలను విడివిడిగా జనపనార సంచిలో కట్టి ఉంచారు. ఆ పెట్టెల దగ్గర ఎవరూ లేకపోవడంతో రైల్వే సిబ్బందికి అనుమానం వచ్చి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వేస్టేషన్‌లోని పార్కింగ్ ప్రదేశం కాంపౌండ్ వద్ద రెండు పెట్టెలు కనిపించాయి. గంటలు గడిచినా ఎవరూ తీసుకోకపోవడంతో స్థానికులకు, రైల్వే సిబ్బందికి అనుమానం వచ్చింది. అలాగే జయనగర పోలీసులకు కూడా కాల్ చేశారు. పోలీసులు జాగిలాలు, బాంబు తనిఖీ సిబ్బందితో వచ్చి పెట్టెలను తెరవకుండానే పరిశీలించారు. తరువాత వాటిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఒక చిన్న కారులో వచ్చి ఆ పెట్టెలను అక్కడ పెట్టి వెళ్లినట్లు సీసీ కెమెరాలలో రికార్డయింది.

కొత్తగా మరో మలబార్ షోరూం



షోరూం ప్రారంభిస్తున్న శ్రీనిధి శెట్టి

సాక్షి, బెంగళూరు: ప్రముఖ బంగారం, వజ్రాల నగల సంస్థ మలబార్ గోల్డ్ – డైమండ్స్, బెంగళూరు హెబ్బాళలో కొత్తగా ప్రారంభమైన ఫీనిక్స్ మాల్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో శనివారం సాయంత్రం కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ సమక్షంలో కేజీఎఫ్ ఫేమ్ నటి శ్రీనిధి శెట్టి రిబ్బన్ కటింగ్ చేశారు. ఇండియా ఆపరేషన్ ఎండీ ఓ.అషర్, ఇతర మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

మైసూరు సొగసు



ఆదివారం రాత్రి మైసూరులో టాప్‌లెస్ బస్సులో పర్యాటకుల విహారం. చిత్రంలో కూడలిలో కనిపిస్తున్న దసరా విద్యుద్దీపాలంకరణ సోమవారం నుంచి ఉండదు

ఉన్నతాధికారిణి.. మర్డర్ మిస్టరీ

- గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రతిమ హత్య
- ఫ్లాటులోకి చొరబడి గొంతుకోసిన హంతకులు
- బెంగళూరులో దారుణ ఘటన

బనశంకరి: ఉద్యాననగరిలో ఓ ఉన్నతాధికారిణి హత్యకు గురైంది. రాష్ట్ర గనులు, భూ విజ్ఞాన శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసే కేఎస్ ప్రతిమ (40)ను సుబ్రమణ్యనగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొడ్డకల్లసంద్రలో అపార్టుమెంటులోని ఫ్లాటులో హత్య చేశారు. ఈ హత్య అధికార, రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. వివరాలు.. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా తుడ్కి కి చెందిన ప్రతిమకు 18 ఏళ్ల క్రితం సత్యనారాయణ అనే వ్యక్తితో పెళ్లయింది. 2017లో ఆమెకు గనులు భూగర్భ శాఖలో జియాలజిస్టుగా ఉద్యోగం లభించింది.





ఉన్నతాధికారిణి కేఎస్ ప్రతిమ (ఫైల్)

ఉద్యోగరీత్యా పలు ప్రాంతాలలో పనిచేశారు. రామనగర జిల్లాలో విధుల్లో చేరిన ప్రతిమ తరువాత బెంగళూరు కు బదిలీ అయింది. కొంతకాలంగా దొడ్డకల్లసంద్ర లోని గోకుల అపార్టుమెంట్‌లో అద్దె ఫ్లాటులో ఒంటరిగా నివాసం ఉంటుంది. భర్త సత్యనారాయణ, ఎస్ఎస్‌సీ చదువుతున్న కుమారుడు చిరాత్ తీర్థహళ్లిలోనే ఉండేవారు. శనివారం రాత్రి 8 గంటలకు కార్యాలయం నుంచి ఇంటికి ప్రతిమను కారులో డ్రైవరు డ్రాప్ చేసి వెళ్లాడు. కొంతసేపటికే దుండగులు ఆమెను చాకుతో గొంతుకోసి చంపి ఉడాయించారు.



హత్య జరిగిన అపార్టుమెంటు

సొంతూళ్లో భర్త, కొడుకు

ప్రతిమ సొంతూరు తుడ్కిలో ఇటీవల కొత్త ఇల్లు కట్టుకుని గృహప్రవేశం కూడా చేశారు. రెండెకరాలు వక్కతోట ఉండటంతో వక్క పంట కోయడానికి భర్త , కుమారుడు అక్కడే ఉంటున్నారు. ఆమె దాంపత్య జీవితం అన్యోన్యంగా ఉంది. కుటుంబసభ్యులు ఆక్రందనలు మిన్నంటాయి.

మంచి అధికారిణి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ కేఏ.దయానంద్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిమా ఉత్తమ అధికారి, అన్ని సమావేశాలకు సక్రమంగా హాజరయ్యేవారు. అక్రమ గనుల సమస్య ఉందని ఆమె గత నెలలో సమావేశంలో తెలిపారు. తమిళనాడుకు వెళ్లే అక్రమ గనుల లారీలను అడ్డుకోవాలని సూచించానని దయానంద్ తెలిపారు. ఏ కారణానికి హత్య జరిగింది అనేదానిపై పోలీసుల దర్యాప్తులో తెలుస్తుందన్నారు.

ఫోన్ చేసినా జవాబు లేదు: సోదరుడు

నేను నిత్యం ఫోన్ చేసి మాట్లాడేవాడినని, ఒక పెళ్లికి వెళ్లాల్సి ఉండగా రాత్రి కాల్ చేయగా ప్రతిమా ఫోన్ తీయలేదు. మళ్లీ ఆదివారం ఉదయం ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు, దీంతో కింది ఇంటివారికి కాల్ చేసి చూడమని చెప్పాను. వారు వెళ్లి చూడగా హత్యకు గురైనట్లు తెలిసింది. ఉద్యోగంలో ఎలాంటి సమస్యా లేదు. ఇంట్లో ఎలాంటి వస్తువులు చోరీకి గురికాలేదని, పోలీస్‌శాఖ పై నమ్మకం ఉందని మృతురాలి సహోదరుడు ప్రతీశ్ తెలిపారు. ప్రతీశ్ బన్నేరుఘట్టలో నివాసం ఉంటూ బీబీఎంపీ కంట్రాక్టర్‌గా ఉన్నారు.

పోలీసుల విచారణ

దక్షిణ విభాగం డీసీపీ రాహుల్ శహపురవాడ్ చేరుకుని పరిశీలించారు. పోలీసులు వేలిముద్రలు, సీసీ కెమెరా చిత్రాలు తదితర ఆధారాల కోసం గాలించారు. మృతదేహాన్ని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. ప్రతిమా హత్య కేసు దర్యాప్తు జరుగుతోందని సీఎం సిద్దరామయ్య తెలిపారు. మైసూరులో సిద్దరామయ్య మాట్లాడుతూ సమాచారం తెలుసుకున్నాను. ఆమె ఒంటరిగా నివసిస్తోంది, భర్త సొంతూరులో ఉన్నట్లు తెలిసింది అన్నారు.

క్లుప్తంగా

మంత్రికి సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి: మంత్రి శివరాజ్ తంగడిగిని ఆయన నివాసంలో కారటగి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సర్దార్ అలి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాజ్ తంగడిగి ఉద్యోగుల సమస్యల పట్ల స్పందించి ఎన్నో డిమాండ్లను పరిష్కరించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘం తాలూకా కార్యదర్శి తిమ్మణ్ణ నాయక, సంఘటన కార్యదర్శి కనకప్ప, ఉపాధ్యక్షులు హనుమంతప్ప, ట్రెజరర్ వెంకోబ పాల్గొన్నారు.

జేడీని సస్పెండ్ చేయాలి


మాట్లాడుతున్న నిరుపాది

రాయచూరు రూరల్: రాయచూరు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవికను సస్పెండ్ చేయాలని రాష్ట్ర సమితి అధ్యక్షుడు నిరుపాది డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన శాఖలో ఆమె ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, అర్హతలేని వారిని అధికారులుగా నియమించిందని, తన మాట వినడం లేదని నెల రోజుల క్రితం రాయచూరు శాఖలో విధులు నిర్వహించే అధికారులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయించారని ఆరోపించారు. కల్యాణ కర్నాటక పరిధిలోని 371(జె) ద్వార స్థానికులను దూరం చేసి తనకు కావాల్సిన వారిని బదిలీ చేయించిన జెడి దేవికను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిరంతర విద్యుత్ అందించాలి


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కంప్లి: కోతల్లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని వివిధ సంఘాలు ఎమ్మిగనూరు గ్రామ జెస్కాం సిబ్బందిని డిమాండ్ చేశారు. ఎడాపెడా విద్యుత్ కోతల వల్ల వ్యవసాయం, పిండిమరలు, హోటళ్లు తదితర వ్యాపార సంస్థలు దెబ్బతింటున్నాయని, గతంలోను ఇదే విషయమై జెస్కాం అధికారులతో చర్చించామని, మరోసారి కూడా విజ్ఞప్తి చేస్తున్నామని కర్ణాటక పదవీ ధర వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు హెచ్ మల్లేషప్ప అన్నారు.

ప్రశాంతంగా కేపీఎస్‌సీ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీసీ

రాయచూరు రూరల్: జిల్లాలో కేపీఎస్‌సీ గ్రూప్ సీ ఉద్యోగ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద తా గూర్ స్మారక కళాశాలలో అదనపు జిల్లాధికారి దురుగేష్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 4299 అభ్యర్థులలో 4026 హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సురేశ్ తెలిపారు.

పట్టాలపై నిలిచిపోయిన గూడ్స్

- ప్యాసింజర్ ప్రయాణికుల అవస్థలు


పట్టాలపై నిలిచిపోయిన గూడ్స్ రైలు

రాయచూరు రూరల్: గూడ్స్ రైలు మరమ్మతులకు గురై పట్టాలపై నిలిచిపోవడంతో ఆ మార్గంలో వెళ్లాల్సిన మరో ప్యాసింజర్ రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం యాదగిరి జిల్లా నాలవార వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రాయచూరు నుంచి విజయపురకు ప్యాసింజర్ రైలు బయలుదేరడానికి ముందు ఆ లైన్‌లో గూడ్స్ రైలు వెళ్లింది. అది మరమ్మతులకు గురై పట్టాలపై నిలిచిపోయింది. దీంతో వెనుక ఉన్న ప్యాసింజర్ రైలును నిలిపివేశారు. దాదాపు మూడు గంటల పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తమైంది.

కన్నడభాషకు ప్రోత్సాహం ఇవ్వాలి

రాయచూరు రూరల్ : పట్టణ ప్రాంతాలలో కన్నడ భాషకు ప్రోత్సాహమివ్వాలని కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపు ఇచ్చారు. ఆదివారం కన్నడ భవనంలో రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా నృపతుంగా అవార్డును అందించి మాట్లాడారు. కార్యక్రమంలో అరవింద్ కులకర్ణి, మ్యాదర్, అశోక్‌కుమార్ జైన్, రఫీక్ అహ్మద్, శాంత కులకర్ణి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు


జీన్స్ దుస్తులు కుడుతున్న మహిళా కార్మికులు


పంటలు ఎండిపోవడంతో దిగాలుగా రైతులు (ఫైల్)

- జీన్స్ దుస్తుల తయారీ కార్మికులు కుదేలు
- మరోవైపు ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

సాక్షి బళ్లారి: తీవ్ర వర్షాభావ పరిస్థితులతో కరువు విలయ తాండవం చేస్తుండగా కరెంట్ కోతల వల్ల వ్యవసాయం, పరిశ్రమలు మరింత కష్టాల్లో కూరుకుపోతున్నాయి. జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండిపోవడంతో పాటు జీన్స్ దుస్తుల తయారీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నగరంలో జీన్స్ దుస్తులు తయారు చేస్తున్న వారు దాదాపు 12 వేల మందికిపైగా ఉన్నారు. ఇందులో మహిళలు కూడా సగానికిపైగా ఉన్నారు. జీన్స్ దుస్తుల తయారీ కార్మికులు అందరూ నిరుపేదలే. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుట్టు మిషన్‌పై కూర్చొని దుస్తులను తయారు చేస్తే వీరికి రూ.300 నుంచి రూ.400ల వరకు సంపాదించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇటీవల కుట్టుమిషన్లకు మోటార్లు అమర్చడంతో విద్యుత్ కోతల వల్ల వారి ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

గంటల తరబడి కరెంట్ కట్:

జిల్లాలో విద్యుత్‌ను ఉత్పాదన చేసే కేపీటీసీఎల్ ప్లాంటు తుంగభద్ర డ్యాం ఉన్నప్పటికీ జిల్లాలో విద్యుత్ సమస్య ఎప్పటి నుంచో పరిష్కారం కావడంలేదు. బళ్లారి నగరంలో విద్యుత్ కోతలు ఇష్టారాజ్యంగా విధిస్తున్నప్పటికీ ప్రశ్నించేవారు లేరు. విద్యుత్ కోతల వల్ల పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. దీంతో పాటు విద్యుత్ ఉంటేనే జీవనం సాగించే జీన్స్ దుస్తులను తయారు చేస్తున్న కార్మికులు వేలాది మంది వీధినపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. ఉపాధి లభించకపోవడంతో స్వస్థలాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. విద్యుత్ కోత వల్ల జనరేటర్లకు డిమాండ్ పెరిగింది. ఒక్కొసారి గంటల తరబడి విద్యుత్ కోతను విధిస్తున్నారు. త్వరలో దీపావళి పండుగ నేపథ్యంలో జీన్స్ దుస్తుల కొనుగోలు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని విద్యుత్ కోత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

మేయర్ పదవికి త్రివేణి రాజీనామా

- పదవి చేపట్టిన ఏడునెలలకే వైదొలగిన వైనం
- మేయర్ రేసులో మించు శ్రీనివాస్, కుబేర
- ఏడాదికి ఇద్దరు మేయర్లు అయితే అభివృద్ధి మాటేమిటి?


మేయర్ పదవికి రాజీనామా చేసిన త్రివేణి



మేయర్ రేసులో మించు శ్రీనివాస్, కుబేర

సాక్షి,బళ్లారి: బళ్లారి నగర మేయర్ త్రివేణి తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు 7 నెలల క్రితం ఆమె పదవిని అధిష్టించారు. అతి చిన్న వయస్సులోనే మేయర్ పదవిని దక్కించుకున్న త్రివేణి 6 నెలలు గడిచిన తర్వాత మరొకరికి అధికారం కట్టబెట్టాలనే ఒప్పందం మేరకు ఆమె రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో మేయర్ కుర్చీపై ఏడాది ఒకసారి మార్చడం ఆనవాయితీగా వస్తోంది. ఏడాది ఒకసారి రిజర్వేషన్లు మారుస్తూ కొత్త వ్యక్తులకు అవకాశం కల్పిస్తారు. ఏడాది ఒకసారి రిజర్వేషన్లు మార్పు, కొత్త వ్యక్తి మేయర్ సీటుపై కుర్చోవడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే సాగుతోంది. ఏడాది లోపు మేయర్ నగరంలోని 39 వార్డులను తిరగడానికే సమయం సరిపోతుంది. ఇక అభివృద్ధి, సమస్యల గురించి ఏ విధంగా పరిష్కరిస్తారో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ఏటా మేయర్ స్థానం మార్పు ప్రభుత్వ నిబంధన కావడంతో ఐదేళ్లలో 5 మంది మేయర్లు మారడం తెలిసిందే. ప్రస్తుతం రెండవ అవధి కింద మేయర్ పదవి కుర్చొన్న త్రివేణి ఏడాది కూడా గడవక ముందే రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఇలా ఉండగా ప్రస్తుత మేయర్ రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త మేయర్ ఎంపికపై పైరవీలు సాగుతున్నాయి. మేయర్ స్థానాన్ని అధిష్టించేందుకు మించు శ్రీనివాస్, కుబేర ఇద్దరు సోదరులలో ఒకరికి మేయర్ స్థానం దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. కార్పొరేటర్ల మద్దతుతో పాటు స్థానిక నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర ఆశీస్సులు ఎవరి లభిస్తే వారికి మేయర్ పదవి దక్కుతుందని చెప్పవచ్చు. మించు, కుబేరతో పాటు మరొకరు కూడా మేయర్ పదవికి కోసం తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

యువకుడి హత్యకేసులో ముగ్గురి అరెస్ట్

బనశంకరి: ముగళూరు దక్షిణ పినాకిని నదిలో గత నెల 26న హత్యకు గురైన చేతన్(26) అనే యువకుడి కేసులో బ్యూటీపార్లర్ మహిళతో పాటు ముగ్గురిని సర్జాపుర పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరు నగరానికి చెందిన శోభ, కోలారు జిల్లా మాలూరు తాలూకా చిక్కతిరుపతికి చెందిన సతీశ్, స్నేహితుడు శశి పట్టుబడారు. పరారీలో ఉన్న మరొకరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కృష్ణరాజపురంలో బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్న శోభతో చేతన్ 8 నెలలుగా సహజీవనం చేస్తున్నాడు. అతను కృష్ణరాజపురంలోని అయ్యప్పనగర రియల్‌ఎస్టేట్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. అయితే శోభకు చిక్కతిరుపతికి చెందిన సతీశ్ అనే వ్యక్తితో పరిచయమైంది. సతీశ్ భూ విక్రయ వ్యవహారంలో రూ.40 లక్షలకు పైగా డబ్బు సంపాదించగా శోభ కోరిక మేరకు రూ.25 లక్షలు ఖర్చుచేసి బ్యూటీపార్లర్ పెట్టించాడు. సతీశ్ తన స్నేహితులైన మధు, శశితో కలిసి చేతన్‌ను చిక్కతిరుపతి సమీపంలోని బార్‌కు పిలిపించి మద్యం తాపించి హత్యచేసి దక్షిణ పినాకినిలో మృతదేహం పడేసి ఉడాయించారు. ఈ ఘటనపై సర్జాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని బార్ వద్ద అమర్చిన సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టి హత్యకేసులో నిందితులను ఆదివారం అరెస్ట్ చేశారు.

బెంగళూరులో మరో చిరుత

బనశంకరి: గతవారం బెంగళూరువాసులను హడలెత్తించిన చిరుతపులి ఉదంతం మరువక ముందే మరో చిరుత నైస్‌రోడ్డులోని చిక్కతోగూరు వద్ద ప్రత్యక్షమైంది. శనివారం సాయంత్రం 7.40 సమయంలో చిక్కతోగూరులోని ఇంటి కాపౌండ్‌లోకి చొరబడి తలుపు వద్దకు వచ్చి నిలబడింది. అది చూసిన బాలుడు గట్టిగా కేకలు వేయడంతో చిరుత పారిపోయింది. కృష్ణరాజపురం అటవీశాఖ అధికారులు వెళ్లి వివరాలు సేకరించారు. వర్షం పడి ఉండడంతో బురదలో చిరుత పాదముద్రలు లభించాయి. స్థానికుల్లో గుబులు నెలకొంది.

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం

బొమ్మనహళ్లి : హెచ్‌ఎస్ఆర్ లేఔట్ సామసంద్రపాళ్యలో ఉన్న ఎస్.వి.ఆర్ చిన్మయ విద్యామందిరంలో ఆదివారం కన్నడ రాజ్యోత్సవాన్నినిర్వహించారు. ఆ విద్యాసంస్థల అధ్యక్షుడు కే.వాసు దేవ కన్నడ పతాకాన్ని ఆవిష్కరించి కన్నడమాత భువనేశ్వరి మాతకు ప్రత్యేక పుజలు చేశారు. కన్నడ నేల, కన్నడ భాష, కన్నడ నాడు కోసం ప్రతి ఒక్కరు కలిసి కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు.

అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్ట్

హుబ్లీ: నగరంలోని పరాతా గల్లీలోని ఓ దుకాణంలో కరిగించిన రూ.61 లక్షల విలువైన లిక్విడ్ బంగారు చోరీ కేసుకు సంబంధించి ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు.

కారు దొంగలు పట్టివేత

హుబ్లీ నగరంలోని పంచాక్షరి నగరి బసవాయ స్ట్రీట్‌లో కారు అపహరణకు సంబంధించిన కేసులో ముగ్గురు నిందితులను నవనగర ఏపీఎంసీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.4.5 లక్షల విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ మద్యం విక్రేతకు కటకటాలు

హుబ్లీ: బహిరంగ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని గుజరాత్ భవన దగ్గర అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసి ఓ కారు, రూ. 24 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

హొసపేటె: బహిర్భూమికి వెళ్లిన మహిళపై ఎలుగుబంటి దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడిన ఘటన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా బండేభసాపురంలో శనివారం రాత్రి చోటు చేసుకొంది. బండేభసాపురం గ్రామానికి చెందిన కాశీబాయి రాత్రి బహిర్భూమికి పొలం వైపు వెళ్లింది. ఆ సమయంలో ఎలుగుబంటి ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కాశీబాయి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకోవడంతో ఎలుగుబంటి పరారైంది. బాధితురాలిని హుటాహుటిన కూడ్లిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలు కళ్లదానం


నింగమ్మ (ఫైల్)

కంప్లి: దానాలన్నింటిలోనూ ప్రాణ దానం గొప్పదంటారు. దానికి దోహదపడేది అవయవదానం. ఇలా అవయవదానం చేసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు ఓ వృద్ధురాలు. హగరి బొమ్మనహళ్లి తాలూకా హిరేసొబటి గ్రామ కిచ్చన బండి నింగమ్మ (80) శనివారం మృతి చెందారు. తన మరణంలోనూ ఆమె సార్థకతను చాటుకున్నారు. తన కళ్లను దానం చేశారు. నింగమ్మ కళ్లను బళ్లారి విమ్స్ వైద్యులు సేకరించారు.

కరెంటు షాక్‌తో ఐటీ ఉద్యోగి మృతి


మృతి చెందిన సోమశేఖర్

లేపాక్షి: లేపాక్షి మండలం పి.బసనపల్లిలో ఉన్న మల్బరీ తోట వద్ద విద్యుత్ షాక్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం రూరల్ మండలంలోని వీరంపల్లికి చెందిన సోమశేఖర్ (31) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పి.బసనపల్లి పొలాల్లో ఉన్న మల్బరీ షెడ్డును నీటితో శుభ్రం చేయడానికి వెళ్లారు. మోటారు ఆన్ చేసే సమయంలో కరెంటు షాక్ తగలడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే చనిపోయాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య ఆశ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో వేల కోట్ల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం


మాట్లాడుతున్న అన్వర్ బాషా

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వేల కోట్ల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు రాష్ట్ర వక్ఫ్ మండలి అధ్యక్షుడు అన్వరబాషా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వక్ఫ్ ఆస్తుల అతిక్రమణలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరు కూడా ఉందని ఆరోపించారు. జిల్లాలో మసీదులు, దర్గా, కబరస్థాన్‌లను ఆక్రమించిన అంశంపై గత బీజేపీ సర్కార్ సర్వేలో తేలిందన్నారు. కలబుర్గిలో నెల రోజుల క్రితం వంద ఎకరాల వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నామని, రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించామన్నారు.

బస్సు వెనుక ఢీకొన్న టిప్పర్


ఘటనాస్థలిలో గుమిగూడిన జనం

రాయదుర్గం: రాయదుర్గం నుంచి బళ్లారి వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును డి.హీరేహాళ్ మండలం పులకుర్తి గేట్ వద్ద ఓవర్‌టేక్ చేయబోయిన టిప్పర్ వెనుక భాగాన ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయాయి, అదృష్టవశాత్తు 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బస్సు డ్రైవర్ స్వల్పంగా గాయపడడంతో బళ్లారి ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ ముందు భాగం అణిగిపోయింది. జరిగిన సంఘటన చూస్తే పెద్ద ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కంకరలోడ్లతో వెళ్లే టిప్పర్ల వేగానికి తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.


నదిని తలపిస్తున్న రోడ్లు

రామనగరలో భారీ వర్షం

బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే జలావృతం

దొడ్డబళ్లాపురం: రామనగర తాలూకాలో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే, సర్వీసు రోడ్లు జలమయమయ్యాయి. రహదారి మార్గంలోని కెంపనహళ్లి, కల్లుగోపనహళ్లి, దాసప్పనదొడ్డి వద్ద అండర్‌పాస్‌లో భారీగా నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై కూడా మోకాలులోతు వర్షం నీరు నిలిచింది. పలు చోట్ల కొన్ని గంటలపాటు వాహనాల సంచారం నిలిచిపోయింది.

గడ్డివాము దగ్ధం

శ్రీనివాసపురం: తాలూకాలోని పాతముత్తక పల్లి గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. రైతు నారాయణస్వామికి చెందిన గడ్డివాముకు నిప్పంటుకుని సుమారు రూ. 50 లక్షల విలువ చేసే 8 లోడ్‌ల రాగి గ్రాసం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలియడం లేదని రైతు నారాయణస్వామి వాపోయాడు.

రథంలో భువనేశ్వరి మాత ఊరేగింపు


రథంలో భువనేశ్వరి మాత ఊరేగింపు

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : కన్నడ రాజ్యోత్సవాన్ని పురస్కరించుకొని విజయపుర పట్టణంలో నెటివ్ డ్రీమ్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ, విజయపుర పట్టణ కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం భువనేశ్వరి మాత విగ్రహాన్ని కన్నడ రథంలో ఉంచి ఊరేగించారు. అంతకుముందు శ్రీనగరేశ్వర స్వామి ఆలయం వద్ద వెయ్యి అడుగుల పొడవున్న కన్నడ జెండాను బెంగళూరు గ్రామీణ జిల్లా అధికారి శివశంకర్ ప్రారంభించారు. కన్నడ భాషపై ప్రతి ఒక్కరూ మమకారం పెంచుకోవాలని సూచించారు.

నిందితుడిపై పోలీసు కాల్పులు



చికిత్స పొందుతున్న పోలీసులు, నిందితుడు

మాలూరు: తాలూకాలోని జయమంగల గ్రామ పంచాయతీ సభ్యుడు మీణసంద్ర అనిల్‌కుమార్ హత్య కేసుకు సంబంధించి పోలీసులు ఆదివారం ఉదయం నిందితుడు అశోక్‌ను పట్టుకునే క్రమంలో అతను ఎదురుదాడికి దిగడంతో కాల్పులు జరిపి అరెస్ట్ చేశారు. వివరాలు...నిందితుడు అశోక్ హూరళగెరె క్రాస్ ఉన్నట్లు సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్, సిబ్బందితో అక్కడికి చేరుకున్నాడు. పట్టుకోవడానికి యత్నించగా పోలీసులపై కత్తితో దాడికి దిగాడు. దీంతో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వెంటనే స్పందించిన సీఐ వసంత్ కుమార్, అశోక్ కాలిపై కాల్చాడు. అతను కుప్పకూలిపోయాడు. గాయపడిన పోలీసులను, నిందితుడిని ఆస్పత్రికి తరలించారు.

కోలారు వార్తలు...

మహిళలు ఆర్థికంగా ఎదగడం సంతోషం


పూజా కార్యక్రమాలను నిర్వహించిన దృశ్యం

శ్రీనివాసపురం: ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలకు సహాయం చేసి వారి కౌశల్యాలకు అనుగుణంగా మార్గదర్శనం చేసి మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేస్తుండటం ఎంతో సంతోషించదగ్గ విషయమని మహిళా వేదిక జిల్లా అధ్యక్షురాలు మాయా బాలచంద్ర తెలిపారు. ఆదివారం పట్టణంలోని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన దసరా పూజా కార్యక్రమంలో భాగంగా గణపతి, నవగ్రహపూజ, హోమా కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. మహిళలు ధర్మస్థల సంఘం అందిస్తున్న సహకారంతో ఆర్థికంగా ముందుకు రావాలని తెలిపారు. కురుబర సంఘం తాలూకా అధ్యక్షుడు వేమన్న మాట్లాడుతూ ధార్మికంగా అందరు ఒకచోట చేరి ఆచరణ చేసే కార్యక్రమాలు సముదాయం మధ్యన ఐక్యతను పెంచుతాయన్నారు. కార్యక్రమంలో తాపం మాజీ సభ్యుడు కెకె మంజునాథ్‌రెడ్డి, నాగవేణిరెడ్డి, ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంఘం యోజనాధికారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక్ హత్య కేసులో నిందితుడి కోసం గాలింపు

కోలారు : కోలారు నగరంలో సంచలనం సృష్టించిన మైనర్ బాలుడి హత్య కేసులో నిందితుడిగా భావిస్తున్న షైన్ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. మూడు బృందాలుగా గాలిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి కార్తీక్ సింగ్ (17)ను నగరంలోని నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో హత్య చేసిన విషయం తెల్సిందే

షైన్‌పై ఆరోపణలు :

హత్య కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న షైన్ పలు కేసులకు సంబంధించి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. నిందితుడు షైన్ పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు కావడంతోనే పోలీసులు నచ్చచెప్పి కేసులు పెట్టకుండా పంపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీసీ కాలనీలో ఉంటున్న షైన్ హతుడు కార్తీక్ సింగ్ ఇద్దరు ఒకే కళాశాలలో చదువుతున్నారు. ఇద్దరి మధ్య స్నేహం కూడా ఉంది. గతంలో చిన్న విషయానికి కార్తీక్, షైన్‌ల మధ్య గొడవ జరిగింది. దీనినే మనసులో పెట్టుకుని షైన్ ఈ కృత్యానికి పాల్పడ్డాడని స్థానికులు అంటున్నారు.

బీట్ వ్యవస్థ కల్పించండి :

నగరంలో హత్యలు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. రాత్రి సమయాలలో సరైన బీట్ వ్యవస్థ లేకపోవడం వల్లనే ఇలా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి 10 గంటల సమయంలో నగరం నడిబొడ్డున హత్యకు దారితీసినా పోలీసులకు తెలియలేదు. పోలీస్ బీట్ లేకపోవడం వల్లనే ఇలా జరుగుతోందని స్థానికుల ఆరోపణ.

పోలీసులపై ఐజీ గరం గరం :

కోలారు జిల్లాలో జరగుతున్న హత్యలపై ఐజీపీ రవికాంతేగౌడ ఉన్నతాధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నగరంలో ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశమైన ఐజీ, పోలీసుల నిర్లక్ష్య వైఖరిపట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఎస్ఐ, కానిస్టేబుళ్ల సస్పెండ్


కోలారు : శ్రీనివాసపురం పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసన్ అలియాస్ కౌన్సిలర్ శ్రీనివాస్ హత్యకేసుకు సంబంధించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణపై ఎస్ఐతో పాటు ఏడుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. శ్రీనివాసపురం ఎస్ఐ ఈశ్వరప్ప, హెడ్ కానిస్టేబుల్ దేవరాజ్ రెడ్డి, కానిస్టేబుల్ మంజునాథ్‌లతో పాటు మరో నలుగురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ నారాయణ్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. హత్య జరిగిన వెంటనే పోలీసులు సత్వర చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. విచారణలో నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తేలడంతో వారిని సస్పెండ్ చేశారు. హత్య జరిగిన అనంతరం పోలీసులు సత్వరమే స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి. విచారణలో పోలీసుల అలసత్వం రుజువు కావడంతో సిబ్బందిని సస్పెండు చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

మాలూరు : పట్టణంలోని అయ్యప్ప నగర్‌కు చెందిన చేతన్ అనే యువకుడి హత్య కేసుకు సంబంధించి సర్జాపుర పోలీసులు తాలూకాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రేమ వ్యవహారానికి సంబంధించి అయ్యప్ప నగర్‌కు చెందిన ప్రకాష్‌రెడ్డి కుమారుడు చేతన్‌ను సొన్నాపుర గ్రామానికి చెందిన సతీష్ గత నెల 26న దక్షిణ పినాకిని నది సమీపంలో కత్తితో పొడిచి చంపి నదిలో పడేశారు. కేసుకు సంబంధించి పోలీసులు సతీష్, శోభా, శశిలను అరెస్టు చేశారు.

వైభవంగా ఆలయ జీర్ణోద్ధారణ


స్వామి వారికి విశేష పూజలు

కోలారు: తాలూకాలోని గరుడనహళ్లి గ్రామంలోని పురాతన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణు గోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధాణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ నాగలాపురం వీర సింహాసన సంస్థాన మఠం శ్రీశ్రీ తేజేశలింగ శివాచార్య మహాస్వామి పాల్గొని విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. ఈ సందర్భంగా పునః ప్రతిష్ఠ, విమాన గోపుర, మహా కుంభాభిషేక మహోత్సవంతో పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఆశీర్వదించారు. పూజా కార్యక్రమంలో మాజీ విధాన పరిషత్ సభాపతి వీఆర్ సుదర్శన్, ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


ఆలయాన్ని అలంకరించిన దృశ్యం

తుపాకీతో అన్నకొడుకు హత్య

- పొలం వివాదం వెనుక ఉన్నారని అనుమానం..
- మండ్య జిల్లాలో దారుణం




వివరాలు సేకరిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో) హతుడు జయపాల్ (ఫైల్)

మండ్య: పొలం విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవల్లో ఒకరు హత్యకు గురయ్యారు. సొంత అన్న కొడుకును చిన్నాన్న పిస్టల్‌తో కాల్చి చంపిన ఘటన మండ్య జిల్లాలోని నాగమంగళ తాలూకాలోని సరిహద్దు గ్రామం హనుమనహళ్లి శనివారం సాయంత్రం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హతుడు వాసు అనే కుమారుడు జయపాల్ (19). నిందితుడు అతని చిన్నాన్న, రౌడీషీటర్ అయిన కుమార్‌గౌడ. వివరాలు.. కుమార్‌గౌడకు గ్రామంలోని మరొక రైతుతో పొలం విషయంలో తగాదా ఉంది. ఇది కోర్టులో సాగుతోంది. ఈ గొడవలో తన అన్న వాసు, అతని కుమారుల హస్తం ఉందని కుమార్‌గౌడ అనుమానం పెంచుకున్నాడు. దీనిపై మాట్లాడాలని తోటలో ఉన్న తన ఇంటికి అన్న వాసు, కొడుకులను రప్పించుకొని వారితో గొడవ పడ్డాడు. ఘర్షణ పెద్దది కాగా, కుమార్‌గౌడ పిస్టల్ తీసి జయపాల్‌పై కాల్పులు జరిపి పారిపోయాడు. తీవ్ర గాయాలైన బాధితుడు అక్కడికక్కడే మరణించాడు. బిండిగనవిలె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటైంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి

- మద్య వ్యసన విముక్త కేంద్రంలో ఘటన

యశవంతపుర: తాగుడు మానేందుకు మద్య వ్యసన ముక్తి కేంద్రంలో చేరిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన బెంగళూరు ఉత్తర తాలూకా లక్ష్మీపురలో జరిగింది. బెంగళూరు చెందిన మావళికి ఫణిస్వామి(52) లక్ష్మీపురలోని మంజునాథ మద్యవ్యసన కేంద్రంలో చేరారు. అయితే ఆయన అనారోగ్యంతో మృతి చెందినట్లు మద్య వ్యసన ముక్తి కేంద్రం నిర్వాహకులు సమాచారం ఇవ్వడంతో మృతుడి కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండటంతో కుమారుడు కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విధి విజ్ఞాన ప్రయోగాలయ శాస్త్రవేత్తల బృందం వ్యసనకేంద్రానికి వెళ్లి మావళికి ఫణిస్వామి మృతదేహాన్ని పరిశీలించింది. అనంతరం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. బెంగళూరు గ్రామాంతర జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండ ఘటన స్థలాన్ని పరిశీలించారు. మద్య వ్యసన కేంద్రం నిర్వహకుడు పరారీలో ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రతి గ్రామానికీ వెళ్లి ప్రజలను ఆదుకోండి

అధికారులకు సీఎం సిద్దరామయ్య దిశానిర్దేశం


మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

మైసూరు: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధికారులకు సూచించారు. మైసూరులోని జేపీ ప్యాలెస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో సీఎం పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు ఉందని, ఈ పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామాన్నీ సందర్శించి నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. పశువులకు మేత అందుబాటులో ఉంచాలన్నారు. గతంలో తాను మైసూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేశారని కొనియాడారు.

బొమ్మూరు అగ్రహారలో మొసలి ప్రత్యక్షం


కాలువలోనుంచి బయటకు వచ్చిన మొసలి

మండ్య: శ్రీరంగ పట్టణం తాలూకా బెమ్మూరు అగ్రహారలో ఉన్న ఎరిజా కాలువ వద్ద ఆదివారం మొసలి ప్రత్యక్షమైంది. మధ్యాహ్నం సమయంలో ఒక రైతు కాలినడకన వ వెళ్తుండగా కాలువ నుంచి బయటకు వచ్చిన మొసలిని గుర్తించాడు. గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో తండోపతండాలుగా వచ్చి భారీ పొడవు ఉన్న మొసలిని చూసి అవాక్కయ్యారు. అనంతరం అటవీశాఖ అధికారులు వచ్చి దానిని బంధించి తీసుకెళ్లారు.

పార్ట్‌టైం ఉద్యోగమంటూ రూ.లక్షలు కొల్లగొట్టారు

తుమకూరు: ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం అంటూ సైబర్ వంచకులు ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు టోకరా కొట్టి రూ.5.35 లక్షలు కొల్లగొట్టారు. తుమకూరులోని ఎస్‌టీ లేఔట్‌లో కృష్ణా నగరకు చెందిన ఎస్.గీతా అనే మహిళా టెక్కీ నివాసం ఉంటోంది. ఆమె సెల్‌కు వచ్చిన సందేశాన్ని చూసి సంప్రదించగా వారు వాట్సాప్ ద్వారా కాల్ చేసి మాట్లాడారు. పార్ట్‌టైం జాబ్ ఉందని చెప్పి కొన్ని టాస్కులు ఇచ్చారు. వాటిని పూర్తి చేయడంతో రూ.12,350 ఆమె ఖాతాకు బదిలీ చేశారు. అనంతరం మరిన్ని టాస్కులు ఇచ్చారు. మరింత ఆదాయం రావాలంటే కొంత నగదు తమ ఖాతాకు జమ చేయాలని చెప్పి గతనెల 4నుంచి 10 వరకు విడతల వారీగా రూ. 5,46,800 నగదును తీసుకున్నారు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇద్దరు ఘరానా దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న సొత్తుతో పోలీసులు


దొంగలు అలీ, సుజాద్ అలీ

దొడ్డబళ్లాపురం: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగలను కనకపుర పోలీసులు అరెస్టు చేశారు. శివమొగ్గకు చెందిన మహమ్మద్ అలీ (30), బెంగళూరు నీలసంద్రకు చెందిన సుజాద్ అలీ (44) పట్టుబడ్డ నిందితులు. పోలీసులు వీరి నుంచి రూ.17లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కనకపుర పట్టణంలోని బసవేశ్వరనగర, మహారాజుల కట్ట రోడ్డులో గత మే నెలలో నాలుగు ఇళ్లలో దొంగతనాలు చేశారు. కనకపుర పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేసారు. ఇంకా అనేక ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్టు నిందితులు తెలిపారు.

జింక వేటగాళ్లకు సంకెళ్లు

బనశంకరి: జింకలను వేటాడిన ఇద్దరిని అటవీశాఖ అధికారులు అరెస్ట్‌చేశారు. రెండు జింకలను చంపి కారులో మాంసం తరలిస్తున్నట్లు సమాచారంతో హెగ్గళ గ్రామం వద్ద అటవీశాఖ అధికారులు అడ్డున్నారు. కారులో ఉన్న ఐదుమందిలో ముగ్గురు పరారీకాగా అజీజ్, సీఏ.హుసేన్ అనే ఇద్దరిని అరెస్ట్‌చేసి జింకతలలు, 40 కిలోల మాంసం స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా నల్లమ్మ తల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో నల్లమ్మ తల్లి విగ్రహం, తప్పెట వాయిద్యాలతో నైవేద్యం తీసుకెళ్తున్న భక్తులు

శింగనమల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కొలువైన నల్లమ్మ తల్లి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. శింగనమలకు చెందిన నల్లప్ప కుటుంబం ఉపాధి నిమిత్తం బెంగుళూరుకు వెళ్లి అక్కడే స్థిర పడింది. వీరి కుటుంబం ఆధ్వర్యంలో శింగనమలలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నల్లమ్మ దేవాలయం నిర్మించారు. దీంతో ఆదివారం బెంగుళూరు నుంచి వచ్చిన భక్తులు నల్లమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. జాతర సందర్భంగా శనివారం రాత్రి నల్లమ్మ దేవి చరిత్రను కళాకారులు అద్భుతంగా వివరించారు. కార్యక్రమం విజయవంతమైందని నిర్వాహకుడు రామాంజినేయులు తెలిపారు.

రైలు కింద పడి ప్లంబర్ ఆత్మహత్య


రెండు ముక్కలైన మృతదేహం

మానసిక అస్వస్థతతో ఉన్న వ్యక్తి ఒకరు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండ్య జిల్లాలోని మద్దూరులోని శివపుర రైల్వేస్టేషన్‌లో జరిగింది. మృతుడు నీలకంఠనహళ్ళి గ్రామానికి చెందిన ఎన్. నవీన్‌కుమార్ (39). నవీన్‌కుమార్ తన చిన్నాన్న పుట్టస్వామి వద్ద మైసూరులో ప్లంబర్‌గా పని చేసేవాడు. కొంతకాలంగా మానసిక ఆరోగ్యం సరిగా లేదని చెబుతున్నారు. ఆదివారమ ఉదయం సుమారు 8.30 గంటలకు రైల్వేస్టేషన్‌కు చేరుకొని తమిళనాడు నుంచి బెంగళూరుకు వెళ్తున్న రైలు కింద పడుకోవడంతో దేహం రెండు ముక్కలైంది. పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని మద్దూరు అస్పత్రికి తరలించారు.

పాఠ్యేతర అంశాలపై అవగాహన పెంచుకోండి



ప్రసంగిస్తున్న సాహితీవేత్త కిరణ్‌కుమార్

గౌరిబిదనూరు: విద్యార్థులు చదువుతోపాటు పాఠ్యేతర అంశాలపై ఆసక్తి వహించాలని సాహితీవేత్త హొశేహళ్లి కిరణ్‌కుమార్ సూచించారు. స్వామి వివేకానంద ఆదర్శాలపై తాలూకాలోని హొశేహళ్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మైసూరు రామకృష్ణ విద్యాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద బోధనలు నేటి యువతరానికి చాలా ప్రయోజనకారి అని అన్నారు. విద్యార్థులు రోజూ వార్తాపత్రికలు చదివి ప్రపంచంలో జరుగుతున్న విషయాలను తెలుసుకోవాలన్నారు.

కరువు సమయంలో కుర్చీ కోసం పోటీనా?


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిటీ రవి

చిక్కబళ్లాపురం: రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొని రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాల్సింది పోయి కాంగ్రెస్ నేతలు కుర్చీ కోసం కొట్లాడుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిటీ రవి ఆరోపించారు. కరువు అధ్యయనానికి బీజేపీ చేపట్టిన కరువు పర్యటనలో ఆయన పాల్గొన్నారు. ఆదివారం చిక్కబళ్లాపురం జిల్లా శిడ్లఘట్ట, చిక్కబళ్లాపురం తాలూకాల్లో పర్యటించారు. పొలాలను సందర్శించి ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కరువు గురించి రైతులను అడిగి తెలుసుకొని తరువాత విలేఖరులతో మాట్లాడారు. సీఎం హంపీలో చాలా బాగా డ్యాన్స్ చేశారని, అది తప్పు కాదని, కరువు సమయంలో ఇది అవసరమా అని ప్రశ్నించారు. 135 సీట్లు గెలిచినా కాంగ్రెస్‌లో అభద్రతాభావం నెలకొందన్నారు. రైతులకు పరిహారం పంపిణీ చేయడంతో పాటు 7 గంటల విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీ మునిస్వామి, ఎమ్మెల్సీ చలవాదినారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు సంపంగి రాజణ్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

రక్తదాన శిబిరం

హోసూరు: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్తంగా ఆదివారం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆస్పత్రి ప్రధాన వైద్యులు జ్ఞానమీనాక్షి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. హిందూ సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్ఞానమీనాక్షి మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న హోసూరు ప్రాంతంలో పెద్దఎత్తున రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం అవసరమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహరన్ తదితరులు పాల్గొన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు.

ముళ్లపొదలతో ముప్పు


మరుగుదొడ్ల వద్ద పేరుకుపోయిన ముళ్లపొదలు

హోసూరు: హోసూరు పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద ప్రజల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు వద్ద ముళ్లపొదలు పెరిగిపోయి విషపురుగుల సంచారం ఎక్కువగా ఉందని, ఆ పొదలను తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాలూకాఫీసు ఆవరణలో కోర్టు, ఈ సేవా కేంద్రం, ఆధార్ కార్డు నమోదు కార్యాలయం, వినియోగదారుల సంక్షేమ కేంద్రం, మహిళా పోలీస్‌స్టేషన్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున ప్రజలు రోజూ తాలూకా కార్యాలయం వద్దకు వచ్చి వెళుతుంటారు. ప్రజలకు సమీపంలోనే మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ లేక ముళ్ల కంపలు పెరిగి, విషపురుగుల సంచారం ఉండడంతో ప్రజలు వెళ్లాలంటే భయపడుతున్నారు. అధికార్లు కలుపుమొక్కలు, ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేయించాలని ప్రజలు కోరారు.

వివాహిత ఆత్మహత్య

హోసూరు: అనారోగ్యంతో బాధపడుతున్న యువతి ఆస్పత్రుల్లో చికిత్స పొందినా కుదుటపడలేదని ఆత్మహత్య చేసుకొన్న ఘటన క్రిష్ణగిరి డ్యాం వద్ద జరిగింది. జంభూర్డుపల్లం గ్రామానికి చెందిన మునియప్ప భార్య రాజకుమారి (23), వీరికి గత ఎనిమిదేళ్ల క్రితం పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలున్నారు. రాజకుమారి గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో వైద్యం పొందుతూ వచ్చింది. ఫలితం లేకపోవడంతో విరక్తి చెంది శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొంది. క్రిష్ణగిరి డ్యాం పోలీసులు కేసు నమోదు చేశారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

క్రిష్ణగిరి: తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. జిల్లా ఆహార భద్రతా విభాగ సబ్‌ఇన్‌స్పెక్టర్ రేణుకాదేవి నేతృత్వంలో పోలీసులు హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారి పులియరసిమేడు ప్రాంతంలో శనివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక లారీలో 188 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. ఏపీలో కుప్పం ప్రాంతానికి చెందిన డ్రైవర్ శివకుమార్ (34)ని అరెస్టు చేశారు. తమిళనాడులోని పుదుపేట ప్రాంతంలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలిసింది.

ఉపాధ్యాయుడు సస్పెండ్

క్రిష్ణగిరి: సక్రమంగా విధులు నిర్వహించని ప్రభుత్వ ఉపాధ్యాయున్ని విద్యాశాఖాధికారి సస్పెండ్ చేశారు. వివరాల మేరకు హోసూరు సమీపంలోని కల్లుగురికి గ్రామానికి చెందిన బాలక్రిష్ణన్ (49). వేపనపల్లి సమీపంలోని జింగలూరు ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. పాఠశాలలో సక్రమంగా పని చేయడం లేదు, పై అధికార్లను కించపరిచి మాట్లాడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఆనంద్ విచారణ జరిపి బాలక్రిష్ణన్‌ను సస్పెండ్ చేశారు. దుష్ప్రవర్తన కింద ఇతడు గతంలో కూడా సస్పెండ్ కావడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే సంతాప సభ

హోసూరు: హోసూరు మాజీ ఎమ్మెల్యే దివంగత బి. వెంకటస్వామి సంతాప సభ ఆదివారం సాయంత్రం హోసూరు కామరాజ్‌కాలనీలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి భవనంలో జరిగింది. ఉప మేయర్ ఆనందయ్య, పారిశుద్ధ కమిటీ అధ్యక్షులు ఎస్.ఎస్. మాదేశ్వరన్, ముత్తుక్రిష్ణన్, బత్తలపల్లి మాజీ పంచాయతీ అధ్యక్షులు గోపాల్, కార్పొరేటర్ చెన్నీరప్ప, మాజీ ఎమ్మెల్యే అభిమానులు, తెలుగు భాషాభిమానులు పెద్దఎత్తున పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రిమాండు ఖైదీ మృతి

కెలమంగలం: గంజాయి కేసులో అరెస్టైన నిందితుడు మృతి చెందాడు. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా బిక్కనపల్లి గ్రామానికి చెందిన మునియప్ప కొడుకు జయకంతన్ (48)ను కొన్ని రోజుల క్రితం గంజాయి కేసులో పోలీసులు అరెస్ట్ చేసి సేలం జైలుకు తరలించారు. జైల్లో ఉన్న అతడు అనారోగ్యానికి గురి కావడంతో జైలు సిబ్బంది ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితంలేక శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం స్వగ్రామమైన బిక్కనపల్లికి తీసుకొచ్చి బంధువులకు అప్పగించారు.

మద్యం విక్రేత అరెస్ట్

కెలమంగలం సమీపంలోని జే.కారుపల్లి ప్రాంతంలో కామయ్యూరు గ్రామానికి చెందిన మూర్తి (24) అనే యువకుడు కర్ణాటక మద్యం అమ్ముతుండగా పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

అమ్మవార్లకు వార్షిక పూజలు


రేణుకా యల్లమ్మ, ముత్తు మారియమ్మ అమ్మవార్లకు పూజలు చేసిన దృశ్యం

బొమ్మనహళ్లి: నగరంలోని బీటీఎం లేఔట్ నియోజకవర్గం అడుగోడిలో వెలిసిన శ్రీరేణుకా యల్లమ్మ దేవి, ముత్తు మారియమ్మ అమ్మవార్ల 3వ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. రవాణశాఖ మంత్రి రామలింగా రెడ్డి, జయనగర మాజీ ఎమ్మెల్యే సౌమ్యా రెడ్డి పాల్గొని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. మాజీ కార్పొరేటర్ మంజులా సంపత్, అడుగోడి బి. మోహన్, కాంగ్రెస్‌నాయకుడు సంపత్ కుమార్ పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు.

రాజీ పంచాయితీలో కొట్టుకున్నారు

శివాజీనగర: దంపతుల మధ్య ఏర్పడిన విభేదాలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన పెద్దల పంచాయితీలో గొడవ జరిగి ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటన ఆర్.టీ.నగర సమీపంలో ఉన్న గణేశ బ్లాక్‌లో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఆర్.టీ.నగరకు చెందిన యువకుడితో హెసరఘట్ట వద్ద ఫార్మ్ హౌస్‌లో పనిచేస్తున్న యువతికి రెండేళ్ల క్రితం వివాహమైంది. కట్నం తేవాలని రోజూ భర్త వేధిస్తున్నాడని భార్య తన కుటుంబ సభ్యులతో వాపోయేది. ఐస్ క్రీం, పిజ్జా ఇప్పించి దానికి డబ్బు చెల్లించాలని భర్త విచిత్రలంగా వ్యవహరించేవాడు. దీంతో అమ్మాయి తరపు బంధువులు శనివారం పంచాయితీ చేసేందుకు అబ్బాయి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో అబ్బాయి మద్యం సేవించి వచ్చాడు. దీంతో వాగ్వా దం జరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు వచ్చి ఘటనపై ఆరా తీశారు. అమ్మాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : బైక్‌ను కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం దేవనహళ్లి తాలూకా వెంకటగిరికోట వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు...వడివేలు(45), మధు అనే వ్యక్తులు బైక్‌పై నందికొండకు వెళ్తుండగా వెంకటగిరికోట వద్ద వెనుక నుంచి కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొంది. వడివేలు అక్కడికక్కడే మృతిచెందగా మధుకు గాయాలయ్యాయి. విజయపుర పోలీసులు క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మందలించడంతో బాలుడి ఆత్మహత్య

మైసూరు: పాఠశాలకు వెళ్లి బుద్ధిగా చదువుకోవాలని మందలించినందుకు బాలుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన శనివారం మైసూరు జిల్లా కెఆర్ నగరలో చోటు చేసుకుంది. కేఆర్ నగర పట్టణంలోని మీనాక్షిపురం లేఔట్‌లో నివాసం ఉంటున్న గురు అనే వ్యక్తి కుమారుడు ఉదయ్(13) స్థానికంగా ఉన్న పాఠశాలలో 7వ తరగతి చదవుకుంటున్నాడు. పాఠశాలకు సక్రమంగా వెళ్లకుండా బయట తిరుగుతున్నాడు. శనివారం ఉదయం కూడా పాఠశాలకు వెళ్లకుండా మొండికేశాడు. దీంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో బాలుడు క్షణికోద్రానికి గురై కరాటే బెల్ట్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేఆర్ నగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వక్క పంటను చోరీ చేసిన దొంగల అరెస్ట్

తుమకూరు: వక్క పంటను చోరీ చేసిన ఐదుమంది పట్టుబడ్డారు. మండ్య జిల్లా కల్లళ్లికి చెందిన రవి(27), అభిజిత్ కేఆర్(25), అభిషేక్(25), మంజునాథ్ బీకె(27), జి.మల్లిగెరెకు చెందిన ఎం.కే.మను అనే నిందితులను తుమకూరు జిల్లా కుణిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా హనుమాపుర గ్రామానికి చెందిన యోగేష్ అనే రైతు వక్క సాగు చేశాడు. పంట కోత కోసి 25 క్వింటాళ్ల వక్కలను పొలంలోనే ఆరబెట్టాడు. పసిగట్టిన దొంగలు వక్కలను చోరీ చేశారు. దీంతో హులియూరు దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా కుణిగల్ పోలీసులతో కలిసి గాలింపు చేపట్టారు. నిందితులను అరెస్ట్ చేసి టాటా ఏస్ వాహనం, 25 క్వింటాళ్ల వక్క, రూ.6వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఏనుగు దాడిలో రైతు మృతి


ఘటన స్థలంలో రైతు మృతదేహం

దొడ్డబళ్లాపురం: ఏనుగు దాడిలో రైతు మృతి చెందిన సంఘటన కనకపుర తాలూకా హొన్నిగవనహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ నివాసి మరిగౌడ(72) పొలంలో పనిచేసుకుంటుండగా ఏనుగు హఠాత్తుగా దాడిచేసింది. తప్పించుకోవాలని అతను ఎంత ప్రయత్నించినా ఏనుగు కాలితో తొక్కి చంపింది. అటవీశాఖ అధికారులు ఘటన స్థలాన్ని చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కాళికా దేవికి పూజలు

మండ్య : బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ వై విజయేంద్ర జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు ఆదివారం మండ్యలోని కాళికా దేవికి పూజలు చేశారు. మండ్య గ్రామీణ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార పాల్గొన్నారు.

క్లుప్తంగా

దళితులకు సీఎం పదవీయోగం లేదా


మాట్లాడుతున్న మారసంద్ర మునిరాజు

మండ్య: రాష్ట్రంలో రెండు కోట్లమంది దళితులు ఉన్నారని, అయినా ఆ సముదాయానికి సీఎం పదవి అందని ద్రాక్షగా మారిందని బహుజన సమాజ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మారసంద్ర మునిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండ్య నగరంలోని జిల్లా విలేకరుల భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ సముదాయం కంటే తక్కువ జనం ఉన్న ఒక్కలిగులకు 8 పర్యాయాలు సీఎం పదవులు దక్కాయన్నారు. ఒకరు ప్రధానిగా కూడా బాధ్యతలు చేపట్టారన్నారు. లింగాయత సముదాయం, బ్రాహ్మణులు, వెనుకబడిన వర్గాల వారు ముఖ్యమంత్రులు అయ్యారని, అయితే దళితులకు ఏ పార్టీ కూడా సీఎం పదవిని ఇవ్వలేదన్నారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి

మైసూరు: పిడుగు పడి రెండు ఆవులు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హెచ్‌డి.కొటె తాలూకా బెళగరనహళ్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యోగేష్ అనే రైతు తన ఆవులను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో పిడుగు పడటంతో రెండు ఆవులు మృతి చెందాయి. తహసీల్దార్ సణ్ణరామప్ప ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానని రైతుకు ధైర్యం చెప్పారు.

కవులు, రచయితలకు గౌరిబిదనూరు ప్రసిద్ధి


కవులు, రచయితలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

గౌరిబిదనూరు: కవులు, రచయితలకు తాలూకా నెలవని, ఇలాంటి తాలూకాలో మనం ఉన్నందుకు గర్వపడాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. హంప నాగరాజయ్య రచించిన చారు వసంత సాంఘిక నాటకాన్ని శనివారం రాత్రి డాక్టర్ హెచ్‌ఎన్ కళా భవనంలో దామోదరశెట్టి దర్శకత్వంలో ప్రదర్శించారు. నాటకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. హంపసంద్ర గ్రామానికి చెందిన హంప నాగరాజయ్య జైన సాహిత్యంపై ప్రత్యేక కృషి చేశారన్నారు. ఎస్ బసవారాధ్య, ఎల్ బసవరాజు, రుద్రకవి, కానాశ్రీ వంటి మహామహులు తమ రచనల ద్వారా తాలూకా ప్రజలను ప్రభావితం చేశారన్నారు. విద్యావేత్త నరసింహయ్య విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు.

రామాయణంతో మానవీయ విలువలు


ప్రసంగిస్తున్న సచ్చిదానంద స్వామీజీ

గౌరిబిదనూరు: రామాయణంలోని పాత్రలు కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను, మానవీయ విలువలు పెంపొందిస్తాయని వాల్మీకి నాయక వర్గం స్వామీజీ సచ్చిదానంద స్వామీజీ అన్నారు. తాలూకాలోని బాదిమరళూరు గ్రామంలో తాలూకా నాయక సంఘం, వాల్మీకి నాయక యువ వేదిక, వాల్మీకి నాయక సింహ గర్జన ఆధ్వర్యంలో జరిగిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. వాల్మీకి సమాజం తమ పిల్లలను విద్యావంతులను చేయాలన్నారు. వాల్మీకి రచించిన రామాయణం నేటి తరానికి చాలా ఉపయుక్తమన్నారు. ఆర్‌అశోక్‌కుమార్, బాబణ్ణ, నాగరాజప్ప,అశ్వత్థప్ప, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు రాజస్థాన్ వాసుల మద్దతు


ధర్నా శిబిరంలో పాల్గొన్న రాజస్థాన్‌వాసులు

మండ్య: కావేరి జలాలను తమిళనాడుకు విడుదల చేయడాన్ని నిరసిస్తూ జిల్లా రైతు హితరక్షణ సమితి జిల్లా కేంద్రంలో చేపట్టిన సత్యాగ్రహం కొనసాగుతోంది. వీరికి రాజస్థాన్ వాసులు మద్దతు పలికారు. స్థానికంగా నివాసం ఉంటున్న రాజస్థాన్ వాసులు ఆదివారం పెద్ద సంఖ్యలో ర్యాలీగా జయచామరాజేంద్ర ఒడెయార్ సర్కిల్ వద్దకు చేరుకొని ధర్నా శిబిరానికి వెళ్లారు. ఉద్యమకారులతో కలిసి ఆందోళన నిర్వహించారు.

క్లుప్తంగా...

ఆరోగ్యమిత్రల ఆప్తమిత్రుడు సీఎం జగన్
ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ వెంకట్రామిరెడ్డి



సాక్షి, అమరావతి/ కృష్ణలంక(విజయవాడ తూర్పు): ఆరోగ్యమిత్రలను అన్ని విధాలుగా ఆదుకున్న ఆప్తమిత్రుడు సీఎం వైఎస్ జగన్ అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. విజయవాడలో ఆదివారం ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమల్లో కీలక పాత్ర పోషించే ఆరోగ్యమిత్రల పట్ల ప్రభుత్వం ఎంతో సానుకూలంగా ఉందని చెప్పారు. గతంలో రూ.7,000గా ఉన్న వేతనాన్ని ఈ ప్రభుత్వం రూ.15,000 చేసిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఆరోగ్య మిత్రలను తొలగించాలనే దురుద్దేశంతో బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్న వారినే నియమించాలని జీవో తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. యూనియన్ సలహాదారు శివకుమారి, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దూరు సుధీర్, ట్రెజరర్ రామ్మోహన్ పాల్గొన్నారు.


ఆర్టీసీని దివాళా తీయించిన చంద్రబాబు
ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి



శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో ఏపీఎస్ ఆర్టీసీని చంద్రబాబు హయాంలో దివాళా తీయించారని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి చెప్పారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ డిపో–1 గ్యారేజీ వద్ద ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీకి 3 శాతం ఉన్న ట్యాక్స్‌ను 15 శాతానికి పెంచారని, ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రద్దు చేశారని చెప్పారు. ఆర్టీసీకి సంబంధించిన రూ.5వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం లూటీ చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆర్టీసీని ఆదుకునేందుకు 15శాతం ఉన్న ట్యాక్స్‌ను తగ్గించి రాయితీలు కల్పించారని గుర్తుచేశారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి 51,488 మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చారని తెలిపారు. కరోనా వంటి విపత్కర సమయంలో కూడా ఏ ఒక్క ఆర్టీసీ కార్మికుడు ఇబ్బందిపడకుండా సకాలంలో జీతాలు చెల్లించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు.

బతుకు చిత్రాలకు ఉత్తమ స్థానాలు

చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరంలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రాకళా పోటీలు, ప్రదర్శన ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో ఆంధ్రప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఒడిశా, బిహార్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాల చిత్రకారులు వేసిన 189 పెద్దచిత్రాలను ప్రదర్శించారు. గుంటూరు చిత్రకారుడు వస్తగిరి జస్టిస్ వేసిన సజీవ చిత్రానికి మొదటి బహుమతి దక్కింది. కోల్‌కతాకు చెందిన రాజేష్ వేసిన స్వీయ జీవన చిత్రం ద్వితీయ బహుమతిని, చెన్నైకి చెందిన చిత్రకారుడు గణేషన్ జీవితంలో సొంతవారి కోసం నిరీక్షిస్తున్నట్టు వేసిన సజీవ చిత్రం తృతీయ బహుమతిని పొందాయి. సామాజిక చైతన్యం కలిగించే చిత్రాలు వేసిన బెంగళూరు చిత్రకారుడు దేవీప్రసాద్‌కు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. మెగా అవార్డును రాజు (రాజమండ్రి), ప్రత్యేక బహుమతులను చక్రపాణి (హైదరాబాద్), కె.భాస్కరావు (పాలకొల్లు), అన్నామలై (చెన్నై), కరుణాకర్ (విజయనగరం), విజయ్ (హైదరాబాద్) పొందారు. ఈ పోటీలకు ప్రముఖ చిత్రాకారులు ఎం.సుబ్రహ్మణ్యం, కె.రామ్మోహన్‌రావు, వీవీ కోటేశ్వరరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రదర్శన నిర్వాహకుడు, చిత్రకళా నిలయం చిత్రకారుడు బొడ్డేడ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో విశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామనరేష్ పాల్గొని బహుమతులు అందజేశారు. జీవన సాఫల్య పురస్కారం అందుకున్న దేవీప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు.



మొదటి బహుమతి పొందిన చిత్రం



ద్వితీయ బహుమతి పొందిన చిత్రం




తృతీయ బహుమతి గెలుచుకున్న చిత్రం

సామాజిక రంగ వ్యయంలో ఏపీనే టాప్

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టంచేసింది. ఈ వ్యయాన్ని మానవ వనరుల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనగా పేర్కొంటారు. ఇక కాగ్‌తో పాటు ఆర్‌బీఐ కూడా సామాజిక రంగ వ్యయాన్ని కొలమానంగా విశ్లేషిస్తాయి. ఈ రంగంపై మరే ఇతర రాష్ట్రం ఇంత పెద్దఎత్తున వ్యయం చేయలేదు. ఆంధ్రప్రదేశ్ తరువాత సామాజిక రంగ కేటాయింపుల్లో గుజరాత్ 42.83 శాతంతో రెండో స్థానంలో ఉందని కాగ్ తెలిపింది. మరోవైపు.. ఆస్తుల కల్పనకు చేసిన బడ్జెట్ కేటాయింపుల్లో.. తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి ఆరు నెలల్లో 53.37 శాతం నిధులు వ్యయం చేయగా.. తెలంగాణ తన బడ్జెట్ కేటాయింపుల్లో 60.86 శాతం ఖర్చుపెట్టి మొదటి స్థానంలో నిలిచింది.



చిట్‌ఫండ్ మోసాలకు కళ్లెం

▶ మొదటి పేజీ తరువాయి

తెచ్చింది. వివిధ చిట్‌ఫండ్ కంపెనీల్లో చిట్లు కట్టే చందాదారుల భద్రతే ప్రధాన లక్ష్యంగా దీన్ని అమలుచేస్తోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించి ప్రత్యేకంగా ఒక ఆప్షన్ ఇచ్చింది. ఇకపై చిట్‌ఫండ్ కంపెనీలు తమ చిట్స్ వివరాలన్నింటినీ ఈ అప్లికేషన్‌లో నమోదు చేయాల్సిందే. మొన్నటివరకు చిట్స్ రిజిస్ట్రార్ల అనుమతితో ఆ కంపెనీలు రికార్డులు నిర్వహించేవి. గ్రూపుల వారీగా అనుమతి తెచ్చుకుని వాటి రిజిస్టర్లను తమ ఇష్టానుసారం మార్చుకుంటున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ రిజిస్టర్లకు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోకపోవడం, తీసుకున్నా వాటిని సరిగ్గా నిర్వహించకపోవడం, ఆ వివరాలను చందాదారులకు తెలియకుండా దాచడం వంటి అనేక ఉల్లంఘనలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల ఆ కంపెనీల్లో ఏం జరుగుతుందో బయటకు తెలియని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోనే పలు చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేయడం, లక్షలాది మంది చందాదారులు తమ శ్రమను ధారపోసి కట్టిన సొమ్మును నష్టపోవడం చాలా సందర్భాల్లో జరిగాయి. ఇలాంటి చిట్‌ఫండ్ కంపెనీల మోసాలకు సంబంధించి ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా పలు కేసులు నమోదయ్యాయి.

మోసాలు అరికట్టడమే లక్ష్యం..

దీంతో.. రాష్ట్రంలో చిట్‌ఫండ్ మోసాలను అరికట్టే లక్ష్యంతో ఆన్‌లైన్ చిట్స్ పర్యవేక్షణ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వహించే ఈ నూతన ఎలక్ట్రానిక్ విధానాన్ని రాష్ట్రంలోని చిట్‌ఫండ్ కంపెనీలన్నీ తప్పనిసరిగా అనుసరించాల్సిందేనని స్పష్టంచేశారు. చిట్‌ఫండ్ కంపెనీలు తమ లావాదేవీలను ఈ అప్లికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాల్సి వుంటుంది. ఏదైనా చిట్‌ఫండ్ కంపెనీ తమ చిట్లకు అనుమతులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. వాటిని చిట్ రిజిస్ట్రార్లు ఆన్‌లైన్‌లోనే పరిశీలించి ఆమోదిస్తారు. ప్రతి చిట్‌కు సంబంధించిన గ్రూపు వివరాలు, మార్పులు, చేర్పులు, ప్రతినెలా జరిగే వేలంపాటలు వంటివన్నీ ఆన్‌లైన్‌లోనే పొందుపరుస్తారు. ఈ వివరాలన్నింటినీ చందాదారులు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు. ప్రతినెలా తాను కట్టే చిట్ వివరాలను ఆన్‌లైన్‌లోనే చూసి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుంది. చిట్‌ఫండ్ కంపెనీల మోసాలను అరికట్టడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. చిట్‌ఫండ్ కంపెనీలను సమర్థవంతంగా నియంత్రించడంలోనూ వ్యాపారంలో పారదర్శకత తీసుకురావడంలోనూ ఈ నూతన విధానం ఎంతగానో దోహదపడుతుందంటున్నారు. ఇప్పటికే ఉన్న చిట్ గ్రూపుల వివరాలను కూడా త్వరలో ఈ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో నమోదు చేయనున్నారు. చందాదారులు తమ అనుమానాలను దీనిద్వారానే నివృత్తి చేసుకోవచ్చు. ఏవైనా సమస్యలున్నా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

ఏ ఎండకు ఆ గొడుగుపట్టడంలో పురందేశ్వరి సిద్ధహస్తురాలు

- కేంద్ర మంత్రిగా రాష్ట్రాన్ని నాశనం చేసిన గొప్ప మహిళ
- వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి విమర్శ



సాక్షి, అమరావతి: ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సిద్ధహస్తురాలని వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్, ఎంపీ వి.విజయసాయిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'పురందేశ్వరి ఓ వైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉంటూ.. మరోవైపు టీడీపీ అనధికారిక గౌరవ అధ్యక్షురాలిగా కొనసాగడం అనైతికం. తన తండ్రిని కాంగ్రెస్ పార్టీ అవమానించిందని.. ఆ అవమానాల పునాదులపై ఏర్పాటైన టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం ఆ పార్టీతో అంటకాగారు. చంద్రబాబు గెంటేసేసరికి కాంగ్రెస్‌లో చేరి నిస్సిగ్గుగా కేంద్ర మంత్రి పదవులు అనుభవించిన నీతిలేని చరిత్ర పురందేశ్వరిది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దారుణంగా విభజించిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా తన వంతు శకుని పాత్ర పోషించి.. రాష్ట్రాన్ని నాశనం చేసిన మహా గొప్ప మహిళ ఈ పురందరేశ్వరి' అంటూ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు.

అనధికారిక టీడీపీ గౌరవాధ్యక్షురాలిగా పురందేశ్వరి

- ఆమె వైఖరిని బీజేపీ నాయకులే తప్పు పడుతున్నారు
- రాష్ట్రంలో డిస్టిలరీలకు చంద్రబాబు హయాంలోనే అనుమతులు
- మద్యం విషయంలో పురందేశ్వరి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



గుణదల(విజయవాడ తూర్పు): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి.. అనధికారికంగా టీడీపీ గౌరవాధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. విజయవాడలోని కనకదుర్గానగర్‌లో ఏర్పాటు చేసిన 3 ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను మంత్రి పెద్దిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మద్యం డిస్టిలరీలకు చంద్రబాబు హయాంలోనే అనుమతులు ఇచ్చారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వంఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈ విషయం గురించి ఎంపీ విజయసాయిరెడ్డిని టార్గెట్ చేస్తూ మాట్లాడటం సరికాదన్నారు. మద్యం గురించి చంద్రబాబుతో మాట్లాడితే అన్ని విషయాలు తెలుస్తాయని ఆమెకు హితవుపలికారు. టీడీపీ వకాల్తా పుచ్చుకొని మాట్లాడుతున్న పురందేశ్వరి తీరును బీజేపీ రాష్ట్ర నాయకుడు సుబ్బారెడ్డి సైతం తప్పుపట్టారని గుర్తుచేశారు. పురందేశ్వరి బీజేపీ నేతగా కాకుండా చంద్రబాబు వదినగా పనిచేసినా తమకు ఇబ్బందేమీ లేదన్నారు. అయితే ఆమె వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

బీజేపీ అధ్యక్షురాలివా.. బాబుకు తొత్తువా?

పురందేశ్వరికి మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ మోపిదేవి ప్రశ్న





నగరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తన ఉనికిని కాపాడుకునేందుకే ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మండిపడ్డారు. బీజేపీ అధ్యక్షురాలివా.. చంద్రబాబుకు తొత్తువా... అని పురందేశ్వరిని ప్రశ్నించారు. ఆదివారం బాపట్ల జిల్లా నగరంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ బీజేపీ ఎదుగుదల కోసం, భవిష్యత్ కోసం పనిచేస్తున్నారో.. టీడీపీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారో చెప్పాలని పురందేశ్వరిని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు రాష్ట్రానికి పట్టిన దరిద్రం, రైతులను, ప్రజల్ని మోసం చేశారంటూ చంద్రబాబును విమర్శించిన పురందేశ్వరి.. నేడు ప్రజలపై టీడీపీ అజెండా రుద్దేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. పురందేశ్వరి బీజేపీ నావ ఎక్కి.. టీడీపీ తెడ్డు తిప్పుతున్నారని విమర్శించారు. ఏ అర్హతతో ఎంపీ విజయసాయిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని లేఖ రాశారో చెప్పాలన్నారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుతో పురందేశ్వరి కూడా ఉన్నారని చెప్పారు. చంద్రబాబును కాపాడుకోవాలనే తాపత్రయం తప్ప.. బీజేపీ అధ్యక్షురాలిలా ఆమె వ్యహరించడం లేదన్నారు. అవినీతికి పాల్పడి స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు జైలుకు వెళితే ఆయనకు వత్తాసుగా పురందేశ్వరి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉంటే.. పురందేశ్వరి పదేపదే ప్రభుత్వంపై బురదజల్లడం సరికాదన్నారు.

టీడీపీ నేత ఇంటిని ముట్టడించిన టైలర్లు

కోర్టుకు వెళ్లి టిడ్కో గృహాల పంపిణీని అడ్డుకుంటున్నారంటూ నిరసన

డోన్ టౌన్: తమ సొంతింటి కల సాకారం కాకుండా అడ్డుపడుతున్న టీడీపీ నేత కన్నపకుంట గోవిందరెడ్డి ఇంటిని టైలర్లు ఆదివారం ముట్టడించారు. టీడీపీ హయాంలో డోన్ పట్టణ టైలర్ల సంఘం అధ్యక్షుడిగా కన్నపకుంట గోవిందరెడ్డి వ్యవహరించారు. టైలర్లకు టీడీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఆ స్థలాల్లో కొంతమంది బేస్‌మట్టం వరకు ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. మరికొందరు తమ స్థలాలను అమ్ముకున్నారు. ఇలా జరిగిన అమ్మకాల్లో గోవిందరెడ్డి పాత్ర ఉన్నట్టు చెబుతున్నారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం ఆ స్థలాల్లో టిడ్కో ఇళ్లు కట్టిస్తామని స్థలాలను తీసేసుకుంది. అప్పటికే నిర్మించిన బేస్‌మట్టాలను తొలగించారు. టిడ్కో ఇళ్లు ప్రభుత్వం నిర్మించి నిజమైన లబ్ధిదారులకే ఇస్తుంది. దీంతో అనధికారికంగా వాటిని కొనుగోలు చేసినవారు ఆందోళన వ్యక్తంచేశారు. అయితే వారికి కూడా టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని చెప్పి వారి వద్ద నుంచి కూడా గోవిందరెడ్డి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం నిజమైన టైలర్లకు మాత్రమే టిడ్కో గృహాలు కేటాయిస్తూ జీవో జారీ చేయడంతో రూ.లక్షలు చెల్లించిన వారు గోవిందరెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో గోవిందరెడ్డి కోర్టుకు వెళ్లడంతో టిడ్కో గృహాల పంపిణీ వాయిదాపడింది. దీంతో టైలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన ఇంటిని ముట్టడించారు.



టీడీపీ నేత గోవిందరెడ్డి ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న టైలర్లు

తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదు

- నా వ్యాఖ్యలను వక్రీకరించి మీడియాలో రాశారు
- రాజకీయ దురుద్దేశంతో లోకేశ్ ట్వీట్
- ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



సాక్షి, అమరావతి: 'లోకేశ్‌కు నాపై అంత అత్యుత్సాహమెందుకు? అమరావతిలో దళితుల అసైన్డ్ భూములు లాక్కున్న వ్యక్తి ఇప్పుడు ఎస్సీలపై ప్రేమ నటిస్తున్నాడు.. మీ రాజకీయం కోసం నన్ను వాడుకుంటారా?.. తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు..' అని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ హెచ్చరించారు. విజయవాడ ఎస్సీ కమిషన్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో తాను పెద్ద బాధితుడినన్నట్టు ఒక పత్రిక వక్రీకరించి రాయడం.. దాన్ని లోకేశ్ ట్వీట్ చేయడం.. టీడీపీ అనుకూల సోషల్ మీడియాలో పథకం ప్రకారం వైరల్ చేయడం.. వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని మండిపడ్డారు. విజయవాడలో ఇటీవల ఓ కార్యక్రమంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి మీడియాలో ప్రచురించడం దారుణమన్నారు. తాను అనని మాటలను అన్నట్టుగా చిత్రీకరించి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆ కార్యక్రమానికి హాజరైన తన జాతి ప్రతినిధులతో మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ పనితీరు, రాష్ట్రంలో దళిత సమస్యల పరిష్కారానికి జరుగుతున్న కృషిని వివరించినట్టు చెప్పారు. ఆ క్రమంలో వేల సంవత్సరాల నుంచి తన జాతి ప్రజలు బాధితులుగానే ఉన్నారని, అలాంటి బాధిత జాతికి చెందిన తనను ఆదరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యున్నత ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చి గుర్తించారన్నదే తన భావనగా చెప్పారు. ఆ మాటలను ప్రభుత్వానికి లింక్ పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు లోకేశ్ వంటి వాళ్ల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో కేబినెట్ ర్యాంకు ఉన్న పెద్ద పదవిని నిర్వహిస్తున్న తాను బాధితుడిని ఎలా అవుతానన్న ఆలోచన కూడా వారికి లేదా? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ వంటి గొప్ప నాయకుడిని ఊపిరి ఉన్నంత వరకు వదిలే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు.

స్నేహితుల మధ్య గొడవను రాజకీయం చేస్తున్నారు

కంచికచర్ల ఘటనపై మంత్రి సురేశ్



యర్రగొండపాలెం: ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో స్నేహితుల మధ్య జరిగిన గొడవను టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. ఆయన ఆదివారం ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో విలేకరులతో మాట్లాడుతూ కలిసి చదువుకున్న స్నేహితులకు అగ్రవర్ణాలు, దళితులు అనే తేడా ఉండదని చెప్పారు. కంచికచర్లలో స్నేహితుల మధ్య ఏర్పడిన చిన్న వివాదం చిలికిచిలికి గాలివానగా మారిందని, దానికి రాజకీయ రంగు పులుముతూ దళితులకు అన్యాయం జరిగిందని చెప్పడం దుర్మార్గమని అన్నారు. బాధితుడు, నిందితుడు అని చెబుతున్న వారిద్దరూ మంచి స్నేహితులని, వారు కలిసి ఉండేవారని ఆయన తెలిపారు. అయినా వారి మధ్య గొడవకు కులం రంగు పూసి, రాజకీయ కోణంలో చూస్తూ ఆ ఘటనను వాడుకోవడం సరైంది కాదన్నారు. ఈ ఘటనలో తప్పుచేసిన వారికి శిక్ష తప్పదని స్పష్టంచేశారు.

ముక్కోణపు మిజోరంలో... గెలుపెవరిదో!

- కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ హోరాహోరీ
- దీటుగా పోటీ ఇస్తున్న జెడ్‌పీఎం
- అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఎన్నికలు
- బీజేపీకి మళ్లీ నాలుగో స్థానమే!
- రేపే పోలింగ్

సాక్షి, నేషనల్ డెస్క్

ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు సాధారణంగా దేశం దృష్టిని పెద్దగా ఆకర్షించవు. కానీ ఈసారి మిజోరం అసెంబ్లీ ఎన్నికలు మాత్రం సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్నాయి. రాష్ట్రం ఆవిర్భవించిన పాతికేళ్లలో ఇప్పటిదాకా స్థానిక పార్టీ మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), కాంగ్రెస్ మాత్రమే గెలుస్తూ వచ్చాయి. గత ఐదేళ్లలో గట్టి పోటీదారుగా మారిన జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) ఈసారి పోటీని ముక్కోణంగా మార్చేసింది. బీజేపీ ఎప్పట్లాగే ఈసారీ పెద్దగా ప్రభావం చూపే అవకాశాలు కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో అందరి దృష్టీ మంగళవారం జరగనున్న పోలింగ్ మీదే కేంద్రీకృతమై ఉంది...

మిజోరం 1972లో అసోం నుంచి విడిపోయింది. 15 ఏళ్లపాటు కేంద్రపాలిత ప్రాంతంగా కొనసాగి, 1987లో 23వ రాష్ట్రంగా అవతరించింది. నాటినుంచి కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ దాదాపుగా చెరో 20 ఏళ్లు అధికారం అనుభవించాయి. ఐదుసార్లు సీఎంగా చేసిన లాల్ తన్హావ్లాయే రాష్ట్ర కాంగ్రెస్‌ను ఇప్పటిదాకా అన్ని ఎన్నికల్లోనూ నడిపిస్తూ వచ్చారు. ఈసారి తొలిసారి పార్టీలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ఆయన వారసునిగా పీసీసీ చీఫ్, మాజీ మంత్రి లాల్‌సావ్తా ఈ ఎన్నికల్లో పార్టీని నడిపిస్తున్నారు. అంతేకాదు, ఎంఎన్ఎఫ్ అధ్యక్షుడు, సీఎం జోరాం థంగాపై పోటీ చేస్తున్నారు కూడా!

పదేళ్ల చొప్పన...

1998 దాకా పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో కొనసాగింది. ఆ ఏడాది ఎంఎన్ఎఫ్ నెగ్గింది. పార్టీ అధ్యక్షుడు జోరాం థంగా తొలిసారి సీఎం అయి పదేళ్ల పాటు పదవిలో కొనసాగారు. 2008 నుంచి మళ్లీ పదేళ్ల పాటు కాంగ్రెస్ రాజ్యం నడిచింది. 2018లో ఎంఎన్ఎఫ్ గెలిచింది. గత నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన వారే స్పష్టమైన మెజారిటీ సాధిస్తూ వచ్చారు. వాటిని ఒక్కసారి చూస్తే...

2003

నాటి సీఎం జోరాం థంగా ఎంఎన్ఎఫ్‌ను మరోసారి విజయపథంలో నడిపారు. ఆ పార్టీ అచ్చం 1998 అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే 21 అసెంబ్లీ స్థానాలు నెగ్గి మరోసారి బొటాబొటి మెజారిటీతో అధికారం నిలబెట్టుకుంది. కాంగ్రెస్ మాత్రం తన స్థానాల సంఖ్యను 6 నుంచి 12కు పెంచుకుంది. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా కేవలం 1.63 శాతం మాత్రమే కావడం విశేషం! 1998లో 12 సీట్లు నెగ్గిన మిజోరం పీపుల్స్ కాన్ఫరెన్స్ (ఎంపీసీ)5కు పరిమితమైంది. మాజీ ఐపీఎస్ అధికారి లాల్‌దుహోమా సారథ్యంలోని జోరాం నేషనలిస్ట్ పార్టీ (జెడ్ఎన్‌పీ) 2 స్థానాలు నెగ్గింది.

2008

కాంగ్రెస్ 32 స్థానాలు నెగ్గి పదేళ్ల అనంతరం మళ్లీ అధికారం చేపట్టింది. లాల్ తన్హావ్లా నాలుగోసారి సీఎం అయ్యారు. ఎంఎన్ఎఫ్ కేవలం 3 స్థానాలకు పరిమితమైంది. సీఎం థంగాపై ముసురుకున్న అవినీతి ఆరోపణలు, విచారణలు బాగా చేటు చేశాయి. దాంతో ఆయన పోటీ చేసిన రెండుచోట్లా ఓటమి చవిచూశారు. జెడ్ఎన్‌పీ మళ్లీ 2 సీట్లతో సరిపెట్టుకోగా ఎంపీసీ 3 సీట్లకు పడిపోయి క్షీణ దశకు చేరింది.

2013

కాంగ్రెస్ ఈసారి రాష్ట్ర చరిత్రలో అత్యధికంగా 44.63 శాతం ఓట్లతో ఏకంగా 34 సీట్లు నెగ్గి అధికారం నిలుపుకుంది. నూతన భూ విధానం వంటి పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించింది. తన్హావ్లా ఐదోసారి సీఎం అయ్యారు. ఎంఎన్ఎఫ్ 5 స్థానాలతో సరిపెట్టుకుంది. ఎంపీసీతో కలిసి పోటీ చేసినా లాభం లేకపోయింది. ఎంపీసీ ఒకే ఒక్క స్థానం గెలవగా జెడ్ఎన్‌పీ 17.42 శాతం ఓట్లు సాధించి కూడా ఖాతాయే తెరవలేదు! దాంతో ఎంపీసీ నేత సైలో రాజకీయాల నుంచే రిటైరయ్యారు! జోరాం థంగాతో పాటు లాల్‌దుహోమా కూడా ఓటమి చవిచూశారు.

2018

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో మళ్లీ అధికారం చేతులు మారింది. ఎంఎన్ఎఫ్ 26 సీట్లతో థంగా సారథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. థంగా మూడోసారి సీఎం అయ్యారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ మార్పుచేర్పులకు ఈ ఫలితాలు అద్దం పట్టాయి. కాంగ్రెస్ 29.98 శాతం ఓట్లు సాధించినా కేవలం 5 స్థానాలకు పరిమితమైంది. సీఎం తన్హావ్లాతో పాటు ప్రస్తుత సీఎం అభ్యర్థి లాల్‌సావ్తా కూడా ఓటమి పాలయ్యారు. ఇక ఐదారు పార్టీల విలీనంతో లాల్‌దుహోమా సారథ్యంలో ఏర్పడ్డ జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) 22.9 శాతం ఓట్లు సాధించి ఏకంగా 8 స్థానాలు గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థులంతా స్వతంత్రులుగా పోటీ చేశారు. నాటినుంచి పలు స్థానిక సంస్థల ఎన్నికల్లో వరుసగా నెగ్గుతూ జెడ్‌పీఎం బాగా జోరు మీదుంది. 8.09 శాతం ఓట్లు సాధించిన బీజేపీ ఒక సీటులో నెగ్గి మిజోరంలో ఎట్టకేలకు ఖాతా తెరిచింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఏకైక స్థానం కూడా ఎంఎన్ఎఫ్ ఖాతాలోకే వెళ్లింది.

గత 4 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు (మొత్తం అసెంబ్లీ స్థానాలు 40)

పార్టీ	2003	2008	2013	2018
ఎంఎన్ఎఫ్	21	03	05	26
కాంగ్రెస్	12	32	34	05
జెడ్ఎన్‌పీ/జెడ్‌పీఎం	02	02	00	08
బీజేపీ	00	00	00	01
ఇతరులు	05	03	01	00
ఓట్ల శాతం				
ఎంఎన్ఎఫ్	31.69	30.65	28.65	37.70
కాంగ్రెస్	30.06	38.89	44.63	29.98
జెడ్ఎన్‌పీ/జెడ్‌పీఎం	14.70	10.22	17.42	22.90
బీజేపీ	1.870	00.44	00.37	08.09



(నోట్: లాల్‌దుహోమా సారథ్యంలోని జోరాం నేషనలిస్ట్ పార్టీ (జెడ్ఎన్‌పీ), ఇతర పార్టీలు 2018లో పరస్పరం విలీనమై జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం)గా ఆవిర్భవించాయి)

పంచతంత్రం

విశేషాలెన్నో...

- 1987లో మిజోరం రాష్ట్రంగా మారినప్పటి నుంచీ కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ మాత్రమే అధికారంలో ఉంటూ వస్తున్నాయి.
- రాష్ట్రంలోని 40 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా 39 ఎస్టీ రిజర్వుడు స్థానాలే!
- అలాగే రాష్ట్ర జనాభాలో ఏకంగా 87 శాతం క్రైస్తవులే
- బంగ్లాదేశ్, మయన్మార్‌లతో మిజోరం సరిహద్దులను పంచుకుంటుంది.
- ఈ రాష్ట్రంలో ఎలాగైనా పాగా వేసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటిదాకా ఫలించలేదు.
- రాష్ట్ర చరిత్రలో బీజేపీ ఇప్పటిదాకా నెగ్గింది ఒక్కటంటే ఒక్క ఎమ్మెల్యే స్థానం. అది కూడా 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనే.
- కేంద్రంలోని అధికార ఎన్డీఏ భాగస్వామి అయిన ఎంఎన్ఎఫ్ రాష్ట్రంలో మాత్రం బీజేపీని దూరం పెడుతూ వస్తోంది.

శరణార్థులే ప్రధానాంశం

జాతుల హింసతో అట్టుడుకుతున్న మణిపూర్ నుంచి 12,000 పై చిలుకు కుకీ తెగవాసులు మిజోరంకు ఆర్నెల్ల క్రితం వలస వచ్చారు. ఇప్పుడదే అన్ని పార్టీలకూ అతి పెద్ద ఎన్నికల అంశంగా మారింది...

- బంగ్లాదేశ్‌లో సైనిక పాలన తాలూకు హింసను తాళలేక ఏడాదిన్నరగా మిజోరంకు 33 వేలకు పైగా చిన్ తెగవాసులు వలస వచ్చారు. కుకీలతో పాటు చిన్ తెగవాసులతో కూడా మిజోలకు అనాదిగా అతి సన్నిహిత సంబంధ బాంధవ్యాలున్నాయి. ముఖ్యంగా కుకీలపై మెయితీల అకృత్యాల పట్ల మిజోరంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.
- ఈ నేపథ్యంలో శరణార్థుల అంశమే ఈసారి ప్రధాన ఎన్నికల అంశంగా మారింది. దాంతో వారికి మద్దతుగా నిలవడం ద్వారా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి.
- మణిపూర్‌లో, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీయే కుకీల దుస్థితికి కారణమని గిరిజనుల్లో ఉన్న ఆగ్రహాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు కాంగ్రెస్, ఎంఎన్ఎఫ్ ప్రయత్నిస్తున్నాయి.

మంచిమాట



స్వభావం

ఒక గురువుగారు శిష్యులతో కలిసి ప్రయాణం చేస్తున్నారు. దారిలో ఒక ఏరు దాటవలసి వచ్చింది. ప్రవాహం మధ్యలో ఒక తేలు నీటిలో కొట్టుకు పోతూ కనిపించింది. ఒక ఆకు మీద దానిని ఎక్కించారు. పట్టుకోగానే అది కుట్టింది. బాధగా వేలిని రుద్దుకున్నారు. కొద్దిసేపటికి అది మళ్ళీ నీళ్ళలో పడిపోయింది. తిరిగి అదే పని చేశారు. అది కూడా తన పని తాను చేసింది. చేతిని గట్టిగా విదిలించారు. మూడోసారి మళ్ళీ నీళ్ళలో పడిపోయింది. ఈలోపు గట్టు వచ్చింది. తేలుని పట్టుకుని నేల మీద వదిలారు. మళ్ళీ ముద్దు పెట్టుకుంది. ఒక శిష్యుడికి సందేహం కలిగింది. గురువుగారు మేధావి కదా! ఇంత తెలివి తక్కువగా ఎందుకు ప్రవర్తించారు? అని. ''రెండు మార్లు కుట్టినా మూడో మారు కూడా ఎందుకు కాపాడారు?'' అని అడిగాడు. ''కుట్టటం దాని స్వభావం. దానిని తేలు మార్చుకోలేదు. కాపాడటం అనే నా స్వభావాన్ని నేను ఎందుకు మార్చుకోవాలి?'' అని సమాధానం చెప్పారు.

స్వభావం అంటే తన యొక్క, 'భావం' తత్త్వం. తనతనం. అది పుట్టుకతో వస్తుంది. ''పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోనే'' అనే సామెత తెలుసు కదా! అంటే మారదు అని అర్థం. దీనిని వంకగా పెట్టుకుని తమలో ఉన్న చెడు స్వభావాన్ని మార్చుకునే ప్రయత్నం చేయరు చాలా మంది. ఇదే మనిషి పురోభివృద్ధిని నిర్ణయించే ప్రధాన అంశం. సుమారుగా అందరికీ చాలా విషయాలు తెలుసు. ఏది మంచి ఏది చెడు అన్నదీ తెలుసు. తెలిసిన దానిని ఎంత వరకు ఆచరణలో పెట్టారు? అన్న దాని వల్ల పురోభివృద్ధిలో వ్యత్యాసం వస్తుంది. దానికి కారణం స్వభావం.

స్వభావం సరిదిద్దుకో వలసినది అయితే చాలా ప్రయత్నం చేయ వలసి ఉంటుంది. ముందుగా మార్చుకోవాలి అనే సంకల్పం ఉండాలి. క్రమంగా, నిలకడగా ప్రయత్నం చేయాలి.

మూతిని కట్టేసినా మాట్లాడకుండా ఉండలేని వారి చేత పాఠాలని చదివించిన ఉపాధ్యాయులని చూశాం. పెరిగాక వారిని యాంకర్లుగా చేస్తే సరి. పాఠం చదవటం వల్ల ఉచ్చారణ స్పష్టంగా ఉంటుంది. ఆగకుండా మాట్లాడి మంచి పేరు తెచ్చుకుంటారు. స్వభావాన్ని అనుకూలంగా ఉపయోగించుకునే మార్గం ఇది. అదేవిధంగా అబద్ధాలు ఆడే పిల్లవాడు ఉంటే, వాడి చేత కథలు రాయిస్తే వాడి సృజనాత్మకత అంతా అక్కడ చూపించటం జరుగుతుంది. నోరు విప్పని వారు ఉంటారు కొందరు. వారు రహస్యసమాచార శాఖలలో రాణిస్తారు. వ్యక్తి స్వభావాన్ని అనుసరించి తగినమార్గంలో పెడితే ఉన్నతస్థితికి చేరుకుంటారు. ఏదీ పనికి రానిది అని చెప్పటానికి వీలు లేదు. 'స్వభావో దురతిక్రమః'' మారదు కనుక మలచుకోవచ్చు.

> మంచి పనులు చేయటం ద్వారా మంచి స్వభావాన్ని పెంపొందించుకోవచ్చు. కనీసం మంచికి, మందికి ఉపయోగ పడవచ్చు. ఉదాహరణకి దేనిని చూసినా సొంతం చేసుకోవాలనే గుణం ఉంది అనుకుందాం. తప్పు అని తెలిసినా మనసు అదుపులో ఉండదు. అటువంటి వారిలో దొంగతనం అనే రోగం పోగొట్టటం ఎట్లా? వారి చేత ఇతరులకి ఇప్పిస్తూ ఉండాలి. అది తనదే కానక్కర లేదు. తీసుకున్న వారి ముఖంలో కనపడే ఆనందం చూసి 'సెరిటోనిన్' అనే హార్మోను విడుదల అయి వారికి ఆనందం కలిగిస్తుంది. అప్పుడు ఇతరుల వస్తువులని తీసుకోవాలనే స్వభావం క్రమక్రమంగా దూరమవుతుంది. కనీసం ఆలోచన ఆచరణ రూపం ధరించదు.

> "బట్టతలకి స్వభావానికి మందు లేదు." అన్న మాట అందరికీ తెలిసినదే. స్వభావం అంటే ఏమిటి? 'స్వ' అంటే తన యొక్క 'భావం' అంటే సహజ లక్షణం, లేదా సహజ గుణం. 'సహ' అంటే కలిసి 'జ' అంటే పుట్టినది. అంటే, ఒక వ్యక్తితో పాటు పుట్టేది అని అర్థం.

– డా. ఎన్. అనంతలక్ష్మి

వాగ్గేయకార వైభవం

గింజనే చూస్తే.... గింజవయిపోతావు

'వాగురయని తెలియక మగ గణములు వచ్చి తగులురీతి యున్నది..'' వాగుర అంటే వల. వల వేసేవాడు వల ఒక్కటే వేయడు. కింద గింజలు వేసి వలేస్తాడు. ఆకలిమీద ఉన్న ప్రాణి కిందున్న గింజలనే చూస్తుంది. రివ్వున వచ్చి వలలో చిక్కుకుని తినేవాడికి అదే గింజయి పోతుంది. తన ఆహారం కోసం వెళ్ళి వేరొకడికి ఆహారమయి పోతుంది. తాను ఏది పొందడానికి వచ్చాడో అది పొందకపోగా వేరొక దానిచేత దానిని పొంద బడుతున్నాడు. కారణం – మత్సరం. అప్పటికి నా అంతటి వాడు లేడు.. అని అహంకరించడం. మరొకడిని తక్కువ చేయడం, హేళన చేస్తూ తనను తాను గొప్పవాడిగా భావించుకోవడంలో ఒక చిన్న సంతోషం ఉంది. కానీ నిజానికి అది పతనం చేసే సంతోషం. మృగ గణములు వచ్చి తగులుకున్న రీతిగా నాకు హెచ్చరిక అందట్లేదు. అదే నాకు అప్పటికి సుఖకారణమనిపించి వలకు చిక్కినట్టు నన్ను కట్టిపడేస్తున్నదంటున్నాడు త్యాగయ్య.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఒకసారి పక్షులన్నీ వలలో చిక్కుకుపోయి ఉంటే... అటునుంచి ఒక రుషి వెళ్ళిపోతున్నాడు. రక్షించమని అవి వేడుకున్నాయి. విడిపిస్తాగానీ నేనొక మాట చెబుతా వింటారా...అనడిగితే సరే అన్నాయి. ''గింజలు కనబడగానే వాల రాదు''. ఇది బాగా గుర్తుపెట్టుకుంటే మీకు మళ్లీ ఇలాటి ఆపద రాదని చెప్పి ఆయన వెళ్ళిపోయాడు. మరో పది రోజుల తరువాత ఆయన మళ్ళీ అటుగా వస్తుంటే...మళ్ళీ అవే పక్షులు వలలో చిక్కుకుని 'రక్షించమని వేడుకున్నాయి. నా మాట మీరెందుకు వినలేదని ఆయన అడిగాడు. వినకపోవడమేమిటి... మీరు చెప్పినట్లే కదా చేసాం... అన్నాయి...అంటూ 'గింజలు కనబడగానే వాలరాదు' అందుకే వెంటనే వాలలేదు కదా... అన్నాయి... అలాగే వాగ్గేయకారుల కీర్తనలు ఎన్నిసార్లు పాడుకున్నాం, ఎన్నిసార్లు విన్నాం, ఎన్నిసార్లు చదివాం ... అని కాదు. అది అర్థం కావాలి. అర్థమయితే సుఖం. ఎంత బాగా పాడావు అన్నదానికన్నా... దానిలోని తత్త్వాన్ని ఎంత బాగా అర్థం చేసుకున్నావన్నది కదా ముఖ్యం. తత్త్వం అర్థమయితే అరిషడ్వర్గాలు గురువుగారి అనుగ్రహం వల్ల వెంటనే పోయినట్టే కదా! అప్పుడు ఆయన సద్గురువు.



అందుకే కీర్తన చివరన మదమత్సరమును తెరదీయగరాదా... అన్నాడు. ఎక్కడ మత్సరం ఉంటుందో అక్కడ మదం కూడా ఉంటుంది. అది నాకు కదా దక్కాలి... అన్నప్పుడు కామం ఉంది. వాడికే ఎందుకు దక్కాలి ... అన్నప్పుడు క్రోధం ఉంది. నాకు ఉండాలన్నప్పుడు లోభం ఉంది. దీనికంతా కారణ అజ్ఞానం అన్నప్పుడు మోహం ఉంది. అరిషడ్వర్గాలు అక్కడ పుట్టాయి. అందువల్ల తెర అంత దట్టంగా ఉంది.'నీలో మత్సరమును తెర ఉంది. అది తొలగించుకో' అని ఆయన అనలేదు. తన మీద పెట్టుకున్నాడు. శంకరభగవత్పాదులు రాసిన శ్లోకాల్లో నాకు అంటూంటారు. అంటే ఆయనకు కాదు. ఆ శ్లోకం ఎవరు చదువుతుంటే వాళ్ళకు–అని. వాళ్ళకు దైవానుగ్రహం కలగాలి. అలాగే త్యాగరాజస్వామి తనకు అన్వయం చేసుకుని చెప్పారు. మత్సరం ... మద మత్సరం... అసూయ వినాశ హేతువు. ఆ తెర తీయమంటున్నాడు.

బౌద్ధవాణి

ప్రేమతో గెలవాలి

బుద్ధుని కాలంలో నిగంఠనాథ పుత్రుడు అనే సాధుగురువు ఉండేవాడు. అతనికి చాలా మంది శిష్యులు ఉండేవారు. వారిలో దీర్ఘ తపస్వి అనే సాధువు ఒకడు. మనస్సు, వాక్కు, శరీరం అనే మూడింటిలో శరీరమే ప్రధానం అనేది నిగంఠుని సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని దీర్ఘ తపస్వి చాలా బలీయంగా ప్రచారం చేసేవాడు. దానితో నిగంఠుని శిష్యుల్లో శ్రేష్ఠుడయ్యాడు. ఈ దీర్ఘ తపస్వికి ఉపాలి అనే గృహస్తు మంచి అనుయాయి. ఉపాలి మంచి జ్ఞాని, ధనవంతుడు నిఘంటుని సాధు సంఘాన్ని అతనే పోషించేవాడు. అదే సమయంలో...

బుద్ధుడు తన బౌద్ధ సంఘంతో నలందకు వచ్చాడు. శరీరం, మనస్సు, వాక్కుల్లో బుద్ధుడు మనస్సుకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు. మనిషి చేసే కర్మలన్నింటికీ మనో కర్మే మూలం. మనసే అన్ని కర్మల్ని నడిపిస్తుంది అనేది బుద్ధుని సిద్ధాంతం. ఈ విషయం తెలిసి దీర్ఘ తాపసి కోపంతో... ''నేను ఇప్పుడే వెళ్ళి, ఆ గౌతముణ్ణి వాదంలో ఓడించి వస్తాను'' అని మండిపడ్డాడు. అప్పుడు ఉపాలి ''గురువర్యా! ఈ మాత్రం దానికి తమరెందుకు! నేను చాలు. బలమైన ఏనుగు నీటి తటాకంలో దిగి, ఆ నీటిని చెల్లా చెదురు చేసినట్లు గౌతముణ్ణి నా వాదంతో చెల్లా చెదురు చేసి వస్తాను'' అని బయలుదేరాడు. బుద్ధుని దగ్గరకు వెళ్ళాడు. వాదానికి దిగాడు. అతి కొద్ది సేపటికే వాదం ముగిసింది. ఉపాలి చివరికి అన్నింటికీ మనస్సే ముఖ్యం. మనసే మూలం అని అంగీకరించాడు.



ఒక వ్యక్తి తనని కర్రతో కొట్టితే... తాను ఇంత కాలం ఆ నేరం ''కొట్టిన కర్రది'' అనుకున్నానని గ్రహించాడు. ఆ తప్పు కొట్టిన చేతిది కూడా కాదు. ఆ వ్యక్తి హింసా ప్రవృత్తే కారణం అని తెలుసుకున్నాడు. ఆ ప్రవృత్తి కేంద్రం మనస్సే అనే సత్యాన్ని నిర్ధారించుకున్నాడు.

తాను ఇంతకాలం.. ఆ కర్రను పట్టుకుని వేలాడుతూ ఉన్నానని'' గ్రహించాక, వెంటనే, బుద్ధునికి ప్రణమిల్లాడు. సముద్రం లోతులు చూడాలని, సముద్రంలో దిగిన ఒక ఉప్పు బొమ్మ, తాను కరిగిపోయి, ఆ సముద్రంలో లీనమైపోయినట్లు ఉపాలి మాత్రమే కాదు... ఎందరో బుద్ధుని మానవీయ సిద్ధాంతంలో కరిగిపోయారు. ఆ ధర్మ సాగరంలో బిందువులయ్యారు. ద్వేషం కంటే ప్రేమ గొప్పది. సంకుచితత్వం కంటే విశాల దృక్పథం గొప్పదని చెప్పిన తథాగత బుద్ధుడు సర్వదా శ్లాఘనీయుడే!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



● నాగార్జున

మైసూర్‌లో నా సామిరంగ

హీరో నాగార్జున కొన్ని రోజులు మైసూర్‌కు మకాం మార్చారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేస్తూ నాగార్జున హీరోగా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'నా సామిరంగ'. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ మైసూర్‌లో ప్రారంభమైందని సమాచారం. నాగార్జున, ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల చిత్రీకరణ ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో 'అల్లరి' నరేశ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారని, ఆషికా రంగనాథన్, మిర్నా మీనన్ హీరోయిన్స్‌గా యాక్ట్ చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది.



● కార్తికేయన్, ఎస్‌జే సూర్య, వెంకటేశ్, రాఘవ లారెన్స్, కార్తీక్ సుబ్బరాజ్


ట్రైలర్ అదిరిపోయింది

– వెంకటేశ్

''జిగర్ తండ డబుల్ ఎక్స్' సినిమా ట్రైలర్ అదిరిపోయింది. కార్తీక్ సుబ్బరాజ్ టేకింగ్ ఎలా ఉంటుందో మరోసారి ఈ ట్రైలర్‌తో చూపించాడు. సినిమా తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుందనే గట్టి నమ్మకం ఉంది'' అని హీరో వెంకటేశ్ అన్నారు. రాఘవ లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తికేయన్ సంతానం నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ నెల 10న విడుదల అవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్ మాట్లాడుతూ–''లారెన్స్, ఎస్‌జే సూర్య వంటి ప్రతిభ ఉన్న నటులు ఈ సినిమాలో నటించారు. కార్తీక్ సుబ్బరాజ్ కల్ట్ డైరెక్టర్. నాకోసం తను త్వరలోనే ఓ స్క్రిప్ట్ తయారు చేస్తాడనుకుంటున్నాను'' అన్నారు. రాఘవ లారెన్స్ మాట్లాడుతూ–''తమిళనాడులో నేను ట్రస్ట్ పెట్టి సేవలు చేస్తున్నాను. ఇకపై తెలుగు రాష్ట్రాల్లో కూడా ఆ ట్రస్ట్ సేవలు అందించబోతున్నాను'' అన్నారు. ''అందరూ మా సినిమాను చూసి ఎంజాయ్ చేస్తారు'' అన్నారు ఎస్‌జే సూర్య. ''మా చిత్రం తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది'' అని కార్తికేయన్ సంతానం అన్నారు. ''జిగర్ తండ డబుల్ ఎక్స్' నాకు ఎంతో ప్రత్యేకం. నాలుగున్నరేళ్ల తర్వాత థియేటర్స్‌లోకి విడుదలవుతున్న నా సినిమా ఇది'' అన్నారు కార్తీక్ సుబ్బరాజ్. ఈ వేడుకలో సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్, డైరెక్టర్ శైలేశ్ కొలను, నటుడు నవీన్ చంద్ర మాట్లాడారు.

మసాలా రెడీ

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకి తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని 'దమ్ మసాలా' సాంగ్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ పాట పూర్తి లిరికల్ వీడియోను ఈ నెల 7న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. జగపతిబాబు, రమ్యకృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కానుంది.



● మహేశ్‌బాబు

ఒక టికెట్‌తో ఇద్దరు సినిమా చూడొచ్చు

– రక్షిత్ అట్లూరి

''నరకాసుర' సినిమాతో నటుడిగా నేను మరో మెట్టు ఎక్కానని ప్రేక్షకులు, సినీ విమర్శకులు చెబుతుండటం చాలా సంతోషాన్నిస్తోంది. మా చిత్రం ఇంకా మరింతమందికి చేరువ కావాలని, నేటి నుంచి మా సినిమాను ఒక టికెట్‌పై ఇద్దరు చూసేలా అవకాశం కల్పిస్తున్నాం'' అని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకుడు. రక్షిత్ అట్లూరి హీరోగా, అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ హీరోయిన్స్‌గా నటించిన సినిమా 'నరకాసుర'. డాక్టర్ అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ మాట్లాడుతూ–''ట్రాన్స్ జెండర్స్‌ను చిన్న చూపు చూడకూడదు.. మనుషులంతా ఒక్కటే అని 'నరకాసుర' తో మేము ఇచ్చిన సందేశం ప్రేక్షకులకు చేరువవుతోంది'' అన్నారు. ''మా సినిమా చూసినవారెవరూ బాగోలేదని చెప్పడం లేదు'' అన్నారు అజ్జా శ్రీనివాస్. ''నరకాసుర' ని హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు అపర్ణా జనార్దన్, సంకీర్తన విపిన్.



● శ్రీనివాస్, రక్షిత్, సెబాస్టియన్



● సమంత

క్రయోథెరపీ!

హీరోయిన్ సమంత గత కొన్నాళ్లుగా మయోసైటిస్ వ్యాధికి చికిత్స తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఏడాదిపాటు సినిమాలకు దూరంగా ఉంటానంటూ ప్రకటించారు కూడా. ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు ఆమె పలు రకాల వైద్య చికిత్సా పద్ధతులు అనుసరిస్తున్నారు. వైద్య చికిత్సలో భాగంగా తాజాగా క్రయోథెరపీ చేయించుకుంటున్నారామె. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు సమంత. క్రయోథెరపీలో భాగంగా గడ్డ కట్టేంత చల్లని నీటి టబ్‌లో మెడ భాగం వరకూ మునిగి ఉన్నారు సమంత. ''క్రయోథెరపీ వల్ల వ్యాధి కారక క్రిములతో పోరాడే తెల్ల రక్త కణాల సంఖ్య బాగా పెరగడంతో పాటు రక్తప్రసరణ కూడా సక్రమంగా జరుగుతుంది. అదేవిధంగా ఈ థెరపీ శరీరానికి సరికొత్త శక్తిని ఇవ్వడంతో పాటు మానసిక ప్రశాంతత కలిగిస్తుంది'' అని పేర్కొన్నారు. ఇక సమంత సినిమాల విషయానికొస్తే.. రాజ్ –డీకే ద్వయం తెరకెక్కించిన 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో నటించారు. ఈ వెబ్ సిరీస్ కోసం ఆమె అభిమానులు ఎదురు చూస్తున్నారు.

జపాన్ సంతృప్తి ఇచ్చింది

– నిర్మాత ఎస్ఆర్ ప్రభు



''మా డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఒక దానికొకటి భిన్నమైన చిత్రాలను నిర్మిస్తూ ప్రేక్షకుల ఆదరణ పొందడం నిర్మాతగా చాలా ఆనందాన్ని ఇస్తోంది. 'జపాన్' సినిమా పట్ల యూనిట్ అంతా చాలా సంతృప్తిగా ఉన్నాం. సినిమా తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుంది'' అని నిర్మాత ఎస్ఆర్ ప్రభు అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈ నెల 10న విడుదలవుతోంది. తెలుగులో అన్నపూర్ణ స్టూడియోస్ రిలీజ్ చేస్తోంది. ఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ–''రాజు మురుగన్ ఏదైనా విషయాన్ని నవ్విస్తూనే ఆలోజింపజేసేలా చెబుతారు. 'జపాన్' లో మానవత్వం గురించి చెప్పారు. ఇందులో కార్తీగారి జపాన్ పాత్ర ప్రేక్షకుల మనసులో చాలా కాలం నిలిచిపోతుంది. నాగార్జునగారు 'జపాన్' టీజర్, ట్రైలర్ చూసి 'ఇలాంటి వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎలా చేయగలుగుతున్నావ్' అంటూ కార్తీగారిని అభినందించారు. సినిమా విషయంలో నిర్మాత సుప్రియగారు, మా ఆలోచనలు ఒకేలా ఉంటాయి'' అన్నారు.

చేతిలో చెయ్యేసి...



● అమలాపాల్, జగత్ దేశాయ్

జీవితంలో మరో కొత్త అధ్యాయాన్ని మొదలు పెట్టారు హీరోయిన్ అమలాపాల్. వ్యాపారవేత్త జగత్ దేశాయ్‌తో కలిసి ఆమె వైవాహిక జీవితాన్ని ప్రారంభించారు. స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో జగత్, అమలాపాల్‌ల వివాహం కొచ్చిలోని ఓ హోటల్‌లో జరిగినట్లుగా తెలుస్తోంది. ''రెండు ఆత్మలు. ఒక విధి.. జీవితాంతం ఆమె చేతిలో చేయ్యేసి నడుస్తాను. దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' అంటూ తమ పెళ్లికి సంబంధించిన ఫోటోలను జగత్ దేశాయ్ షేర్ చేయగా, అవి వైరల్ అవుతున్నాయి. గత నెలలో(అక్టోబరు) అమలాపాల్‌కు జగత్ దేశాయ్ లవ్‌ని ప్రపోజ్ చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. మరోవైపు దర్శకుడు–నిర్మాత ఏఎల్ విజయ్‌ను తొలి వివాహం చేసుకున్నారు అమలాపాల్. అయితే ఇద్దరు 2017లో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు.

హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం ఇటలీలో బుధవారం రాత్రి జరిగిన సంగతి తెలిసిందే. ఆదివారం హైదరాబాద్‌లో వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరోలు చిరంజీవి, వెంకటేశ్, దర్శకులు ముత్యాల సుబ్బయ్య, గుణశేఖర్, సుకుమార్, నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్'రాజు, శివలెంక కృష్ణప్రసాద్, డీవీవీ దానయ్య, రామ్ ఆచంట–గోపీ ఆచంట, వై.రవిశంకర్, నటీనటులు జయసుధ, రాజేంద్ర ప్రసాద్, నాగచైతన్య, అలీ, మాజీ ఎంపీ టి.సుబ్బరామి రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.



● టి.సుబ్బరామిరెడ్డి, వరుణ్‌తేజ్, లావణ్యా త్రిపాఠి

సూర్యవన్షీ సాహసం

బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. ఈ చిత్రంలో అజయ్ దేవగన్, రణ్‌వీర్ సింగ్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, దీపికా పదుకొనె, కరీనా కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ మొదలైందని తెలుస్తోంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి అక్షయ్‌కుమార్ లుక్‌ను రిలీజ్ చేసి, వీర్ సూర్యవన్షీ పాత్రలో ఆయన నటిస్తున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. అలాగే రోహిత్ శెట్టి దర్శకత్వంలో అక్షయ్‌కుమార్ హీరోగా నటించిన 'సూర్యవన్షీ' (2021) చిత్రం విడుదలై ఆదివారంతో రెండేళ్లు పూర్తి చేసుకోవడంతో, 'సింగమ్ ఎగైన్' సినిమాలోని అక్షయ్ లుక్‌ను విడుదల చేసినట్లుగా రోహిత్ శెట్టి పేర్కొన్నారు. ఇందులో అక్షయ్ లుక్ చూస్తుంటే పోలీసాఫీసర్‌గా మరోసారి ఆయన సహసాలు చేయనున్నట్లు తెలుస్తోంది. 'సింగమ్ ఎగైన్' చిత్రం వచ్చే ఏడాది ఆగస్టులో విడుదల కానుంది.



● అక్షయ్ కుమార్

'చాలా బాగా ఆడావు విరాట్. నాకు 49 నుంచి 50 వరకు చేరేందుకు (వయసు) 365 రోజులు పట్టాయి. కానీ నువ్వు రాబోయే కొద్ది రోజుల్లోనే 49 నుంచి 50కి చేరుకొని (సెంచరీలు) నా రికార్డు బద్దలు కొడతావని ఆశిస్తున్నా. నీకు నా అభినందనలు'
-సచిన్ టెండూల్కర్



భారత్ తరఫున ఆడేందుకు వచ్చే ప్రతీ అవకాశం గొప్పదే. నా హీరో రికార్డును సమం చేయడం ఒక గౌరవంగా భావిస్తున్నా. బ్యాటింగ్‌లో ఆయన అన్ని విధాలా పర్‌ఫెక్షనిస్ట్. నాకు భావోద్వేగ క్షణమిది. ఇంత ఆనందాన్ని ఒకేసారి తట్టుకోవడం కష్టంగా ఉంది. సచిన్ అభినందన ఎంతో ప్రత్యేకం. నేను టీవీలో ఆయనను చూసిన రోజులు, ఆట మొదలు పెట్టిన రోజుల నుంచి చూస్తే ఇప్పుడు స్వయంగా ఆయన ప్రశంసలు అందుకోవడం నా దృష్టిలో అమూల్యం. నా పుట్టిన రోజున శతకం సాధించడం కలగా ఉంది. అభిమానులు దీనిని మరింత ప్రత్యేకంగా మార్చారు. ఇలాంటివి నాకు దక్కినందుకు దేవుడికి కృతజ్ఞతలు.
-విరాట్ కోహ్లి

9 వన్డేల్లో విరాట్ కోహ్లి తొమ్మిది వేర్వేరు దేశాలపై సెంచరీలు సాధించాడు. శ్రీలంకపై అత్యధికంగా 10 సెంచరీలు చేసిన కోహ్లి... వెస్టిండీస్‌పై 9, ఆస్ట్రేలియాపై 8, న్యూజిలాండ్‌పై 5, బంగ్లాదేశ్‌పై 5, దక్షిణాఫ్రికాపై 5, పాకిస్తాన్‌పై 3, ఇంగ్లండ్‌పై 3, జింబాబ్వే పై ఒక సెంచరీ సాధించాడు.

కోహ్లి శతకం... జడేజా మాయాజాలం

భారత్ ప్రతాపం | దక్షిణాఫ్రికా దాసోహం

243 పరుగులతో భారత్ బ్రహ్మాండ విజయం

రోహిత్ జట్టుకు వరుసగా ఎనిమిదో గెలుపు

49వ సెంచరీతో సచిన్ రికార్డును సమం చేసిన కోహ్లి

ఐదు వికెట్లతో మెరిసిన జడేజా

ఈడెన్ గార్డెన్స్ పిచ్ కష్టపెట్టింది. ఆరంభంలో రో'హిట్స్'తో పరుగులు సులువైనా... తర్వాత గగనమైంది. 'రన్ మెషిన్' విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ కనిపెట్టుకొని పరుగులు పేర్చితే జట్టు స్కోరు 300 మార్కు దాటింది. 'బర్త్‌డే బాయ్' విరాట్ సెంచరీ పర్వాన్ని చూపిస్తే... ఆ తర్వాత బౌలర్లు వికెట్ల కూల్చివేతల్లో త్వరపడ్డారు. దీంతో వార్ వన్‌సైడ్ అయిన ఈ మ్యాచ్‌లో భారత్ ఘనవిజయాన్ని నమోదు చేసుకుంది. ఈ టోర్నీలో వరుసగా ఎనిమిదో విజయంతో రోహిత్ శర్మ బృందం మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 16 పాయింట్లతో 'టాప్ ర్యాంక్'ను ఖరారు చేసుకుంది.



జడేజా



బవుమా

కోల్‌కతా: అదేంటో ఈ ప్రపంచకప్‌లో యుద్ధం తప్పదనుకున్న మ్యాచ్‌ల్లోనే భారత్ సులువుగా దండయాత్ర చేసి గెలుస్తోంది. ఆస్ట్రేలియాతో మొదలైన టీమిండియా తొలి మ్యాచ్, క్రికెట్ ప్రపంచం గుడ్లప్పగించి చూసిన పాక్‌తో సమరం... భారీస్కోర్లతో చెలరేగుతున్న దక్షిణాఫ్రికాతో తాజా పోరు... ఇవన్నీ కూడా పోటాపోటీగా సాగుతాయనుకుంటే భారత్ వీరంగంతో ఏకపక్షమయ్యాయి. దీంతో ఆతిథ్య జట్టు కాస్తా అజేయ శక్తిగా మారిపోయింది. ఈ ప్రపంచకప్‌లో భారత జట్టు తర్వాత జోరుమీదున్న దక్షిణాఫ్రికా టీమిండియా దూకుడుకు దాసోహమైంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత్ 243 పరుగులతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసి పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో అగ్రస్థానాన్ని ఖరారు చేసుకుంది. కోహ్లి పుట్టినరోజు (నవంబర్ 5) ఉదయం శుభాకాంక్షలతో మొదలైతే... సాయంత్రం వచ్చేసరికి శతక ప్రదర్శనతో ప్రశంసలు వెల్లువెత్తాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 326 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (121 బంతుల్లో 101 నాటౌట్; 10 ఫోర్లు) సచిన్‌కు సరిసమానమైన 49వ వన్డే సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ (87 బంతుల్లో 77; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం దక్షిణాఫ్రికా 27.1 ఓవర్లలో 83 పరుగులకే కుప్పకూలింది. జాన్సెన్ (14) టాప్ స్కోరర్! రవీంద్ర జడేజా (5/33) తన స్పిన్‌తో దక్షిణాఫ్రికాను చుట్టేశాడు. కుల్దీప్ యాదవ్, షమీ చెరో 2 వికెట్లు తీశారు. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను ఈనెల 12న బెంగళూరులో నెదర్లాండ్స్ జట్టుతో ఆడుతుంది.

రో'హిట్స్'తో మొదలై...

కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ (24 బంతుల్లో 40; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఎదురుదాడికి దిగడంతో స్కోరు సగటున 10 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. 6వ ఓవర్లోనే రబడ అతని వేగానికి క్లెం వేయగా... కోహ్లి, శుబ్‌మన్ గిల్ (24 బంతుల్లో 23; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగానే ఆడటంతో 10 ఓవర్లలో భారత్ 91/1 స్కోరు చేసింది. కేశవ్ మహరాజ్ బౌలింగ్‌కు దిగగానే పరిస్థితి ఒక్కసారిగా 'స్విచ్ఛాఫ్' చేసినట్లు మారింది. గిల్‌ను అవుట్ చేసి... సహకరించే పిచ్‌పై స్పిన్నర్ కేశవ్ మహరాజ్ కట్టడి చేయడంతో తర్వాతి 16 ఓవర్లలో భారత్ 60 పరుగులే చేయగలిగింది. 26 ఓవర్లు ముగిసే సరికి భారత్ 151/1 స్కోరుతో వేగంలో వెనుకబడింది.

'శత'క్కొట్టిన కోహ్లి

పిచ్ సంగతి అర్థమైన కోహ్లి... కేశవ్ బౌలింగ్ ప్రమాదకరమని గుర్తించాడు. అవతలివైపు అయ్యర్‌నూ అలర్ట్ చేసి సింగిల్స్, డబుల్స్‌తోనే స్కోరును ముందుకు సాగనిచ్చాడు. కానీ షమ్సీని మాత్రం వదల్లేదు. చక్కగా బౌండరీలు బాదారు. కోహ్లి 67 బంతుల్లో, అయ్యర్ 64 బంతుల్లో ఫిఫ్టీలు సాధించారు. ఈ జోడి మూడో వికెట్‌కు 134 పరుగులు జతచేశాక అయ్యర్ ఆటను ఎన్‌గిడి ముగించాడు. రాహుల్ (8) వచ్చివెళ్లాడు. ఆఖరి దశలో సూర్యకుమార్ (14 బంతుల్లో 22; 5 ఫోర్లు) జోరును షమ్సీ అడ్డుకోగా... జడేజా (15 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) వచ్చాకే భారత్ పుంజుకొని 300 దాటింది. కోహ్లి (119 బంతుల్లో) శతకం సాధించాడు. ఈ మేటి బ్యాటర్ క్రీజులో ఉన్నా కూడా... కేశవ్ పూర్తి కోటా వేసినా... ఒక్క బౌండరీ ఇవ్వకపోవడం విశేషం.

సఫారీ పేకమేడలా...

ఈ టోర్నీలోనే బాగా సెంచరీలు, భారీగా స్కోర్లు చేస్తున్న జట్టు... రన్‌రేట్‌లో ముందున్న జట్టు దక్షిణాఫ్రికానే! కానీ ఈ జట్టు కూడా భారత బౌలింగ్‌కు కుదేలైంది. ఇంకా చెప్పాలంటే వికెట్లు రాలిన ఉదంతాన్ని చూస్తే ఓ క్రికెట్ కూననే తలపించింది. సిరాజ్ డెలివరీకి డికాక్ (5) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. జడేజా ముందుగానే రంగంలోకి దించితే తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా క్రమం తప్పకుండా సఫారీ మేటి బ్యాటర్లను పడగొట్టేశాడు. బవుమా (11), క్లాసెన్ (1), మిల్లర్ (11)లను స్పిన్ ఉచ్చులో ఉక్కిరి బిక్కిరి చేయగా... మరోవైపు షమీ పేస్‌తో డసెన్ (13), మార్క్‌రమ్ (9)లను పెవిలియన్ చేర్చాడు. కుల్దీప్ కూడా తనవంతు మ్యాజిక్ చూపడంతో 40 పరుగులకే 5 వికెట్లను... 83 పరుగులకే దక్షిణాఫ్రికా మొత్తం వికెట్లను కోల్పోయి ఆలౌటైంది.



కోహ్లి

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) బవుమా (బి) రబడ 40; గిల్ (బి) కేశవ్ 23; కోహ్లి (నాటౌట్) 101; అయ్యర్ (సి) మార్క్‌రమ్ (బి) ఎన్‌గిడి 77; రాహుల్ (సి) డసెన్ (బి) జాన్సెన్ 8; సూర్యకుమార్ (సి) డికాక్ (బి) షమ్సీ 22; జడేజా (నాటౌట్) 29; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం** (50 ఓవర్లలో 5 వికెట్లకు) 326. **వికెట్ల పతనం:** 1-62, 2-93, 3-227, 4-249, 5-285. **బౌలింగ్:** ఎన్‌గిడి 8.2-0-63-1, జాన్సెన్ 9.4-0-94-1, రబడ 10-1-48-1, కేశవ్ మహరాజ్ 10-0-30-1, షమ్సీ 10-0-72-1, మార్క్‌రమ్ 2-0-17-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) సిరాజ్ 5; బవుమా (బి) జడేజా 11; డసెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 13; మార్క్‌రమ్ (సి) రాహుల్ (బి) షమీ 9; క్లాసెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 1; మిల్లర్ (బి) జడేజా 11; జాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 14; కేశవ్ (బి) జడేజా 7; రబడ (సి అండ్ బి) జడేజా 6; ఎన్‌గిడి (బి) కుల్దీప్ 0; షమ్సీ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం** (27.1 ఓవర్లలో ఆలౌట్) 83. **వికెట్ల పతనం:** 1-6, 2-22, 3-35, 4-40, 5-40, 6-59, 7-67, 8-79, 9-79, 10-83. **బౌలింగ్:** బుమ్రా 5-0-14-0, సిరాజ్ 4-1-11-1, జడేజా 9-1-33-5, షమ్సీ 4-0-18-2, కుల్దీప్ 5.1-1-7-2.

కోహ్లి=సచిన్

సచిన్ టెండూల్కర్ రికార్డును అందుకోవాలంటే మళ్లీ సచినే దిగి రావాలి... మాస్టర్ బ్యాటర్ ఘనతల గురించి ఒకప్పుడు వినిపించిన వ్యాఖ్యల్లో ఇదొకటి. సచిన్ రికార్డుల స్థాయి, అతను అందుకున్న అసాధారణ మైలురాళ్లను చేరుకోవడం దాదాపు అసాధ్యమనే భావన ఇందులో కనిపించింది... కానీ వాటిలో ఒక అరుదైన రికార్డును విరాట్ కోహ్లి ఇప్పుడు అందుకున్నాడు... తనకే సాధ్యమైన అద్భుత ఆటతో వన్డే క్రికెట్‌కు ముఖచిత్రంగా మారిన కోహ్లి 49వ సెంచరీని సాధించడం అనూహ్యమేమీ కాదు... ప్రపంచకప్‌కు ముందు 47 వద్ద నిలిచిన అతను మెగా టోర్నీలో కనీసం రెండు సెంచరీలు సాధించగలడని అందరూ నమ్మారు... బంగ్లాదేశ్‌పై సెంచరీ తర్వాత మరో రెండుసార్లు చేరువగా వచ్చి శతకానికి దూరమైన అతను ఈసారి విజయవంతంగా ఫినిషింగ్ లైన్‌ను దాటాడు. విరాట్ కోహ్లి నుదుటి రాతను దేవుడు రాయడు... అతనే స్వయంగా తన రాత రాసుకుంటాడు... కోహ్లి శతకం అందుకున్న క్షణాన కామెంటేటర్ అన్న ఈ మాట అక్షరసత్యం. ప్రపంచకప్ మ్యాచ్‌లో తన 35వ పుట్టిన రోజున సచిన్ సెంచరీల సరసన నిలవడం వంటి అద్భుత స్క్రిప్ట్ నిజంగా కోహ్లికే సాధ్యమైంది. ప్రపంచకప్ గెలిచిన క్షణంలో సచిన్‌ను భుజాల మీదకు ఎత్తుకున్న కోహ్లి... పుష్కరం తర్వాత భుజం భుజం కలుపుతూ అతని సరసన సమానంగా నిలిచాడు.

సాక్షి క్రీడా విభాగం



వన్డే క్రికెట్‌ను విరాట్ కోహ్లి చదువుకున్నంత గొప్పగా మరెవరి వల్లా సాధ్యం కాలేదేమో! ఇన్నింగ్స్‌ను ఎలా ప్రారంభించాలి, మధ్య ఓవర్లలో ఎలాంటి ఆట ఆడాలి, చివర్లో ఎంతగా దూకుడు జోడించాలి... సరిగ్గా తాసులో కొలిచి లెక్కించినట్లుగా అతను ఈ ఫార్మాట్‌లో తన ఆటను ప్రదర్శించాడు. రుచికరమైన వంటకం కోసం వేర్వేరు దినుసులను సరిగ్గా ఎలా కలపాలో బాగా తెలిసిన షెఫ్ తరహాలో వన్డేల్లో విజయం కోసం ఎలాంటి మేళవింపు ఉండాలో అతను ఆడి చూపించాడు. ముందుగా బ్యాటింగ్ చేయాల్సి వచ్చినా...లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చినా తన వ్యూహంపై ఉండే స్పష్టత కోహ్లిని అందరికంటే ప్రత్యేకంగా నిలబెట్టింది. సాధారణంగా తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే ఒత్తిడి ఎక్కువగా ఉండే లక్ష్య ఛేదనలో గొప్ప గొప్ప ఆటగాళ్ల రికార్డులు కూడా పేలవంగా ఉంటాయి. కానీ కోహ్లికి మాత్రం పరుగుల వేటలోనే అసలు మజా. ఎంత లక్ష్యాన్నైనా అందుకోవడంలో తనను మించిన మొనగాడు లేడన్నట్లుగా అతని బ్యాటింగ్ సాగింది. తొలి ఇన్నింగ్స్‌లతో (51.15 సగటు, 22 సెంచరీలు) పోలిస్తే ఛేదనలో కోహ్లి రికార్డు (65.49 సగటు, 27 సెంచరీలు) ఘనంగా ఉందంటే అతని ఆట ఎలాంటిదో అర్థమవుతుంది. ఈ 27లో 23 సార్లు భారత్ విజయం సాధించడం విశేషం. తన బ్యాటింగ్‌పై అపరిమిత నమ్మకం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఓటమిని అంగీకరించని తత్వం కోహ్లిని 'ది బెస్ట్'గా తీర్చిదిద్దగా... అసాధారణ ఫిట్‌నెస్, విశ్రాంతి లేకుండా సుదీర్ఘ సమయం పాటు సాగే కఠోర సాధన అతడి ఆటను మరో స్థాయికి తీసుకెళ్లాయి.

కోల్‌కతాలో శతకంతో మొదలై...

ఆగస్టు 18, 2008... కోహ్లి తొలి వన్డే మ్యాచ్ ఆడిన రోజు. కొద్ది రోజుల క్రితమే భారత్‌కు అండర్-19 ప్రపంచకప్ అందించిన కెప్టెన్‌గా కోహ్లికి గుర్తింపు ఉండగా... సచిన్, సెహ్వాగ్‌లు విశ్రాంతి తీసుకోవడంతో శ్రీలంకతో వన్డే సిరీస్‌లో అతనికి తొలి అవకాశం దక్కింది. ఐదింటిలో ఒక మ్యాచ్‌లో అర్ధ సెంచరీ చేసినా సీనియర్ల రాకతో తప్పుకోవాల్సి వచ్చింది. అయితే ఆ తర్వాత దేశవాళీలో, ఆస్ట్రేలియా గడ్డపై ఎమర్జింగ్ టోర్నీలో భారీ స్కోర్లతో చెలరేగిన తనను మళ్లీ ఎంపిక చేయాల్సిన పరిస్థితిని కల్పించాడు. దాంతో ఏడాది తర్వాత మళ్లీ జట్టులోకి పునరాగమనం చేసే అవకాశం దక్కింది. మూడు అర్ధసెంచరీల తర్వాత తన 14వ వన్డేలో శ్రీలంకపై 114 బంతుల్లో చేసిన 107 పరుగుల ఇన్నింగ్స్‌తో అతని ఖాతాలో తొలి సెంచరీ చేరింది. ఈ సెంచరీ కోల్‌కతాలోనే ఈడెన్ గార్డెన్స్‌లో నమోదు చేయడం విశేషం. ఈ మ్యాచ్ తర్వాత మరో మూడు వన్డేలకే మళ్లీ సెంచరీ నమోదు చేసిన కోహ్లికి ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. వన్డే టీమ్‌లో అతను పూర్తి స్థాయిలో రెగ్యులర్ మెంబర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2011 వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో సెహ్వాగ్‌తో పాటు కోహ్లి కూడా సెంచరీ సాధించాడు. అయితే ఫైనల్లో అతని ఇన్నింగ్స్ (35 పరుగులు) కూడా ఎంతో విలువైంది. 31 పరుగులకే సెహ్వాగ్, సచిన్ అవుటైన తర్వాత గంభీర్‌తో మూడో వికెట్‌కు జోడించిన కీలకమైన 83 పరుగులు చివరకు విజయానికి బాట వేశాయి.

ఒకదాన్ని మించి మరొకటి...

విరాట్ కెరీర్‌లో అప్పటికే ఎనిమిది సెంచరీలు వచ్చి చేరాయి. జట్టులో స్థానానికి ఢోకా లేకపోగా, జాగ్రత్తగా ఆడుతూ ఒక్కో పరుగు జత చేస్తూ ఇన్నింగ్స్ నిర్మించే 'క్లాసిక్' ఆటగాడిగా కోహ్లికి అప్పటికి గుర్తింపు వచ్చింది. కానీ అతనిలోని అసలైన దూకుడుకు హోబర్ట్ మైదానం వేదికైంది. శ్రీలంకతో మ్యాచ్‌లో 40 ఓవర్లలో 321 పరుగులు ఛేదిస్తేనే టోర్నీలో నిలిచే అవకాశం ఉన్న సమయంలో కోహ్లి నాలుగో స్థానంలో బరిలోకి దిగాడు. 86 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్స్‌లతో అజేయంగా 133 పరుగులు చేయడంతో 37వ ఓవర్లోనే భారత్ లక్ష్యాన్ని చేరింది. పరిస్థితిని బట్టి కోహ్లి తన ఆటను ఎలా మార్చుకోగలడో ఈ ఇన్నింగ్స్ చూపించగా, తర్వాతి రోజుల్లో ఇలాంటివి ఎన్నో వచ్చాయి. ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై చేసిన అత్యధిక స్కోరు 183, కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాపై 160 నాటౌట్, నేపియర్‌లో కివీస్‌పై 123, పుణేలో ఇంగ్లండ్‌పై 123, మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై 117... ఏది గొప్పదంటే ఏమి చెప్పాలి? జైపూర్‌లో ఆస్ట్రేలియాపై 52 బంతుల్లోనే చేసిన శతకం ఇప్పటికీ భారత్ తరఫున ఫాస్టెస్ట్ సెంచరీగా నమోదై ఉంది. అతని ఒక్కో వన్డే ఇన్నింగ్స్‌కు ఒక్కో ప్రత్యేకత ఉంది. ఈ శతకాలు అభిమానులకు పంచిన ఆనందం గురించి ప్రత్యేకంగా చెప్పాలా!



ఎవరు గొప్ప?

అంకెలపరంగా చూస్తే '49' సెంచరీలతో సచిన్, కోహ్లి సమానంగా కనిపిస్తున్నారు. రేపు కోహ్లి దీనిని అధిగమిస్తాడు కూడా. మరి వన్డేల్లో సచిన్ కంటే కోహ్లి గొప్ప బ్యాటరా? నిజానికి రెండు వేర్వేరు తరాల ఆటగాళ్లను పోల్చడమే అసహజం. సులువైన పిచ్‌లు, మారిన నిబంధనలు, ఫీల్డింగ్ పరిమితులు, రెండు బంతుల వాడకం... ఇలా అప్పటి సచిన్‌కంటే ఇప్పుడు కోహ్లికి సహజంగానే కొన్ని అనుకూలతలు ఉన్నాయి. అన్నింటికి మించి సచిన్ సమయంలో అతనొక్కడే జట్టు భారాన్ని సుదీర్ఘ సమయం పాటు మోశాడు. రిస్క్‌కు అవకాశం తక్కువ. కానీ కోహ్లికి సమర్థులైన ఇతర సహచరుల అండ ఉండటం అతనిపై ఒత్తిడిని తగ్గించింది. సచిన్ 32 సెంచరీల సమయంలో జట్టులో మరెవరూ సెంచరీలు చేయలేదు. కానీ కోహ్లి 22సార్లు మాత్రమే ఇలాంటి ఫీట్ నమోదు చేయడం ఆ తేడాను చూపిస్తోంది. అయితే ఇదంతా కోహ్లి చేతుల్లో లేనిది. ఇది అతని ఘనతను తగ్గించలేదు. తనకు ఎదురైన ప్రత్యర్థి ఎవరైనా వారిపై విరుచుకుపడటమే అతనికి తెలిసింది. సచిన్ ఓవరాల్ 100 సెంచరీలను కోహ్లి అందుకుంటాడా అనేది ఇక తర్వాతి చర్చ. ప్రస్తుతం కోహ్లి ఖాతాలో 79 శతకాలు ఉన్నాయి. మరో 21 సెంచరీల దూరంలో అతను ఉన్నాడు. టెస్టుల్లో అంతరం చాలా ఎక్కువగా (సచిన్ 51, కోహ్లి 29) ఉండగా... వన్డే ఫామ్‌లో అతను అక్కడికి చేరడం అసాధ్యం కాకపోవచ్చు!

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
శ్రీలంక	7	2	5	4	-1.162
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక X బంగ్లాదేశ్
వేదిక: న్యూఢిల్లీ

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ బోపన్న-ఎబ్డెన్ జోడీ

పారిస్: ఈ ఏడాది మూడో డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో బోపన్న-ఎబ్డెన్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జంట 2-6, 7-5, 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-వాసెలిన్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. గంటన్నరపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఎనిమిది ఏస్‌లు సంధించింది. రన్నరప్‌గా నిలిచిన బోపన్న-ఎబ్డెన్‌లకు 1,48,760 యూరోల (రూ. కోటీ 32 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది బోపన్న-ఎబ్డెన్ జోడీ ఏడు టోర్నీలలో ఫైనల్ చేరి రెండింటిలో టైటిల్ సాధించి, ఐదింటిలో రన్నరప్‌గా నిలిచింది. ఈనెల 12 నుంచి 19 వరకు ఇటలీలో జరిగే సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌కు కూడా బోపన్న-ఎబ్డెన్ అర్హత సాధించారు.



విజేత భారత్



రాంచీ: స్వదేశంలో తొలిసారి జరిగిన ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టీమిండియా 4-0 గోల్స్ తేడాతో జపాన్ జట్టును ఓడించింది. భారత్ తరఫున సంగీత కుమారి (17వ ని.లో), నేహా (46వ ని.లో), లాల్‌రెమ్‌సియామి (57వ ని.లో), వందన కటారియా (60వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఆసియా చాంపియన్స్ ట్రోఫీని భారత్ నెగ్గడం ఇది రెండోసారి. 2016లో టీమిండియా తొలిసారి ఈ టైటిల్ సాధించింది. విజేతగా నిలిచిన భారత జట్టుకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యురాలికిగా రూ. 3 లక్షలు చొప్పున అందజేస్తామని తెలిపింది.

ధీరజ్‌కు నాలుగో ర్యాంక్

బ్యాంకాక్: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ పురుషుల రికర్వ్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ 682 పాయింట్లు స్కోరు చేసి నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. భారత్‌కే చెందిన తరుణ్‌దీప్ రాయ్ 678 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. టీమ్ విభాగంలో భారత జట్టు 2027 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

చికిత 'పసిడి' గురి...

రష్మిక ఖాతాలో మూడో పతకం



చికిత



రష్మిక

పనాజీ (గోవా): జాతీయ క్రీడల్లో తెలంగాణకు మూడో స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన మహిళల ఆర్చరీ కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో తణిపర్తి చికిత పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. పెద్దపల్లి జిల్లా సుల్తానాపూర్ గ్రామానికి చెందిన చికిత ఫైనల్లో 143-142తో ప్రియా గుర్జర్ (రాజస్తాన్)పై గెలిచింది. మరోవైపు మహిళల టెన్నిస్ ఈవెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక మూడో పతకాన్ని దక్కించుకుంది. మహిళల టీమ్ విభాగంలో కాంస్యం నెగ్గిన రష్మిక... డబుల్స్ విభాగంలో శ్రావ్య శివానితో రజతం సాధించింది. ఆదివారం జరిగిన సింగిల్స్ విభాగంలో రష్మిక రజత పతకం సొంతం చేసుకుంది. వైదేహి (గుజరాత్)తో జరిగిన టైటిల్ పోరులో రష్మిక 5-7, 6-7 (3/7)తో పోరాడి ఓడిపోయింది. ప్రస్తుతం తెలంగాణ 3 స్వర్ణాలు, 8 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి 19 పతకాలతో 22వ స్థానంలో ఉంది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
6-11-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
283	97
64,364	19,231

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	13,478	▲	184
డోజోన్స్	34,061	▲	222
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,418	▽	29
డాక్స్	15,189	▲	46
షాంఘై	3,031	▲	21
నికాయ్	31,950	▲	348

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.99	103.36
€	యూరో	ఒకటి	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.58	56.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.20	62.14
SAR	సౌదీ రియాల్	ఐదుకంటే	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఐదుకంటే	21.78	23.57
¥	చైనా యువాన్	ఐదుకంటే	10.26	12.34

బీమా.. నడిపినోళ్లకు నడిపినంత!

గుప్తా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఢిల్లీలోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. వారానికి రెండు రోజులు ఆఫీస్‌కు వెళ్లి వస్తుంటాడు. మూడు రోజులు ఇంటి నుంచే పనిచేస్తుంటాడు. ఢిల్లీకి సమీపంలోని నోయిడాలో నివాసం ఉంటున్నాడు. ఆఫీస్‌కు వెళ్లి వచ్చే సమయంలోనే అతడు కారును ఉపయోగిస్తుంటాడు. తన నివాసం నుంచి ఆఫీస్ 20 కిలోమీటర్ల దూరంలో ఉంది.

30 ఏళ్ల మణి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తుంటాడు. రోజూ ఢిల్లీ నుంచి గురుగ్రామ్‌కు వెళ్లి రావడం అతడు ఉద్యోగంలో భాగం. అంతేకాదు, వారాంతంలో దూర ప్రయాణాలు (లాంగ్ డ్రైవ్) చేయడం అతడికి హాబీ. దీంతో ఏటా 30,000 కిలోమీటర్ల మేర అతడు ప్రయాణం చేస్తుంటాడు. కానీ, గుప్తా ఏడాది మొత్తం తిరిగేది 4,000 కిలోమీటర్లు మించదు.

వీరిలో రిస్క్ ఎవరికి ఎక్కువగా ఉంటుంది? సాధారణంగా ఎక్కువ దూరం ప్రయాణించే వారికి ప్రమాదాల రిస్క్ ఉంటుంది. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారికి రిస్క్ ఉంటుంది. కానీ, ఇక్కడ ఇద్దరూ తమ కారు కోసం ఏటా చెల్లిస్తున్నది ఒకే రకమైన ప్రీమియం. నియమ నిబంధనలను తూ.చా. తప్పకుండా పాటిస్తూ, పరిమిత వేగంతో, తక్కువ దూరం ప్రయాణించే వారిని.. ఎక్కువ దూరం ప్రయాణిస్తూ, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిని ఒకే గాటన కట్టడం సహేతుకంగా అనిపించదు. అందుకే నడిపినంత దూరానికే, నడిపే తీరు ఆధారంగా ప్రీమియం చెల్లించే సదుపాయాన్ని బీమా సంస్థలు తీసుకొచ్చాయి.

''రోజూ ఎక్కువ దూరం పాటు ప్రయాణించే వారు, దూర ప్రయాణాలకు తరచుగా వెళ్లే వారితో పోలిస్తే తక్కువ ప్రీమియం చెల్లించడానికే నా ప్రాధాన్యం. ఎందుకంటే నేను కారులో తిరిగేది చాలా తక్కువ దూరం. పైగా నేను ఎంతో జాగ్రత్తగా డ్రైవ్ చేస్తాను. అందుకే నేను చెల్లించే బీమా ప్రీమియం తక్కువగా ఉండాలని కోరుకున్నాను''అని గుప్తా తెలిపారు. అందుకే ఆయన 'పే యాజ్ యూ డ్రైవ్' (పీఏవైడీ), 'పే హౌ యూ యూజ్' (పీహెచ్ఐయూ) యాడాన్స్‌ను ఎంపిక చేసుకుని, గతంతో పోలిస్తే తక్కువ ప్రీమియం చెల్లిస్తున్నారు.

గుప్తా వంటి వారికి ఇప్పుడు పీఏవైడీ పాలసీలు ఒక మంచి ఎంపికగా, ఆకర్షణీయంగా మారాయనడంలో సందేహం లేదు. వాహనం ఎంత దూరం ప్రయాణిస్తుందన్న దాని ఆధారంగా బీమా సంస్థలు ప్రీమియం వసూలు చేయడం ఈ పాలసీల్లో ఉన్న వెసులుబాటు. అందుకే తక్కువ నడిపే వారికి, జాగ్రత్తగా నడిపే వారికి ఇవి పెద్ద ఊరటనిస్తున్నాయి. ఈ పీఏవైడీ, పీహెచ్‌యూఐ పాలసీలు ఎలా పనిచేస్తాయి? వీటిని తీసుకునే ముందు తెలుసుకోవాల్సిన అంశాలు? ఈ వివరాలను అందించే కథనమే ఇది.

నడిపిన దూరానికే బీమా రక్షణ

- కారు బయటకు తీసినప్పుడే బీమా అమల్లోకి
- జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే ప్రీమియంలో డిస్కౌంట్
- ఓన్ డ్యామేజ్, థర్డ్‌పార్టీ కవరేజీపై తగ్గింపు
- 25 శాతం వరకు తగ్గనున్న భారం



నేపథ్యం..

మోటార్ బీమా పాలసీలకు సంబంధించి టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలను ప్రవేశపెట్టేందుకు బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) 2022 జూలైలో అనుమతించింది. వినియోగ ఆధారిత వాహన బీమా ప్లాన్లు, రైడర్లు ఆ తర్వాత నుంచి మార్కెట్ ప్రవేశం చేశాయి. టెలీమ్యాటిక్స్ డివైజ్‌లు/గ్యాడ్జెట్ల (పరికరాలు) సాయంతో వాహన వినియోగాన్ని అంచనా వేసి, ఆ మేరకు ప్రీమియాన్ని సాధారణ బీమా సంస్థలు వసూలు చేస్తున్నాయి. కారు నడిపే తీరును కూడా అవి ఈ పరికరాల ద్వారా పరిశీలిస్తాయి. దీంతో సంబంధిత వాహనదారుడి



డ్రైవింగ్ తీరు, దూరంపై బీమా కంపెనీలకు కచ్చితమైన సమాచారం లభిస్తుంది. వీటిని విశ్లేషించిన అనంతరం, రిస్క్ ఆధారంగా ప్రీమియం నిర్ణయిస్తాయి. పీఏవైడీ ప్లాన్ల/రైడర్లలో వాహనం తక్కువ నడిపే వారికి ప్రీమియం భారం ఎలా అయితే తగ్గుతుందో.. వాహనం ఎక్కువగా వినియోగించే వారికి ప్రీమియం భారం పెరుగుతుంది. పీఏవైడీ, పీహెచ్‌ఐయూ యాడాన్‌లుగా లభిస్తాయి. ప్రస్తుత ప్లాన్‌కు అనుసంధానంగా తీసుకోవచ్చు. రెన్యువల్ సమయంలో బీమా కంపెనీకి ఈ విషయాన్ని చెబితే చాలు. బీమా ఏజెంట్ లేదంటే నేరుగా బీమా కంపెనీ పోర్టల్ నుంచే వీటిని తీసుకోవచ్చు. దరఖాస్తు పత్రాన్ని నింపి, అప్పటికే కలిగి ఉన్న బీమా ప్లాన్ వివరాలను సమర్పిస్తే చాలు.



పాలసీ కొనుగోలు సమయంలో ఎంపిక చేసుకున్న కిలోమీటర్ల ఆధారంగా పీఏవైడీ పాలసీల ప్రీమియం ఆధారపడి ఉంటుంది. పలు రకాల ప్రీమియం శ్లాబులు ఉంటాయి. వీటి నుంచి పాలసీదారుడు ఎంపిక చేసుకోవచ్చు. ''మన దేశంలో టెలీమ్యాటిక్స్ డివైజ్‌లు కేవలం కొన్ని రకాల కార్ల మోడళ్లకే అందుబాటులో ఉన్నాయి. అందుకని మేము తీసుకొచ్చిన పాలసీలో, ఓడోమీటర్ సాయంతో దూరాన్ని లెక్కిస్తున్నాం. ఓడోమీటర్ రీడింగ్‌ను టెలీమ్యాటిక్స్ డివైజ్ లేదంటే మొబైల్ యాప్ ద్వారా ట్రాక్ చేయవచ్చు''అని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో రిటైల్ బిజినెస్ ప్రెసిడెంట్ పార్థానిల్ ఘోష్ తెలిపారు. సాధారణ ప్రీమియంతో పోలిస్తే బీమా సంస్థలు పీఏవైడీ ప్లాన్ కింద.. 2,500 కిలోమీటర్ల వరకు తిరిగే కార్లకు ప్రీమియంలో 25 శాతం తగ్గింపునిస్తున్నాయి. ఏడాదికి 2,501 కిలోమీటర్ల నుంచి 5,000 కిలోమీటర్ల దూరానికి 17.50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నాయి. ఇక 5,001–7,000 కిలోమీటర్ల పరిధిలో తిరిగే వాహనాలకు ప్రీమియంలో 10 శాతం తగ్గింపును ఆఫర్ చేస్తున్నాయి. 7,501–10,000 కిలోమీటర్ల దూరం నడిచే కార్లకు ప్రీమియంలో 5 శాతం తగ్గింపు లభిస్తుంది. ఏడాదికి 10,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం పాటు నడిచే కార్లకు ప్రీమియంలో ఎలాంటి

దూరం ఆధారంగా..

రాయితీ ఉండదు. పాలసీ కొనుగోలు చేసే సమయంలో ఉన్న ఓడోమీటర్ రీడింగ్‌ను బీమా సంస్థలు నమోదు చేస్తాయి. తిరిగి రెన్యువల్ సమయానికి తిరిగిన దూరం ఆధారంగా ప్రీమియంను నిర్ణయిస్తాయి.

''ఇలా ఏడాదిలో తిరిగిన దూరం ఆధారంగా మరుసటి ఏడాది ప్రీమియంలో బీమా కంపెనీలు తగ్గింపును ఇస్తాయి. ఒకవేళ పాలసీదారుడు అదే కంపెనీ వద్ద రెన్యువల్ చేసుకోకుండా, మరొక కంపెనీ వద్ద పాలసీ తీసుకున్నా సరే, గడిచిన ఏడాదికి సంబంధించిన డిస్కౌంట్‌ను నెఫ్ట్ ద్వారా పాలసీదారు ఖాతాకు బదిలీ చేస్తాయి. అదే కంపెనీతో కొనసాగితే రెన్యువల్ ప్రీమియంలో తగ్గించి, మిగిలినది చెల్లిస్తే సరిపోతుంది''అని పార్థానిల్ ఘోష్ వివరించారు. పాలసీ తీసుకునే సమయంలో ఎంపిక చేసుకున్న కిలోమీటర్లను ఏడాది కాక ముందే అధిగమించేశారనుకుంటే, అప్పుడు టాపప్ చేసుకోవచ్చు. ఉదాహరణకు ఏడాదికి 6,000 కిలోమీటర్ల కోసం పాలసీ తీసుకుని, రెన్యువల్ గడువుకు ముందే ఈ దూరం దాటేస్తే, అప్పుడు దీన్ని పెంచుకోవచ్చు. ''ఒకటికి మించిన కార్లు ఉన్నవారు లేదా తక్కువ దూరం ప్రయాణించే వారికి పీఏవైడీ ప్లాన్లు మంచి ప్రయోజనాన్నిస్తాయి. ప్రీమియంలో తగ్గింపు అనేది కారు మోడల్, దాని వయసు, రిజిస్ట్రేషన్ అయిన ప్రాంతం ఆధారంగా నిర్ణయం అవుతుంది.

కొన్ని బీమా సంస్థలు రెన్యువల్ సమయంలో అదనపు రివార్డులను కూడా ఇస్తున్నాయి. పాలసీ సంవత్సరంలో కారు తక్కువ వినియోగిస్తాననే స్పష్టత యజమానికి ఉంటే, వాస్తంగా వినియోగించుకున్న మేరకే ప్రీమియం చెల్లించడం సహేతుకంగా ఉంటుంది''అని పాలసీబజార్ మోటార్ ఇన్సూరెన్స్ ఉత్పత్తుల హెడ్ ఆకర్ష్ శర్మ సూచించారు.

నడిపే తీరు కూడా ముఖ్యమే

గుప్తా మాదిరే తాము కూడా డ్రైవింగ్ విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తామని అనుకునే వారు 'పే హౌ యూ యూజ్' (పీహెచ్ఐయూ) ప్లాన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇందులో వాహనం నడిపే తీరు ఆధారంగా ప్రీమియం చార్జ్ చేస్తారు. పీఏవైడీ మాదిరే, పీహెచ్‌వైయూ (పే హౌ యు యూజ్) కూడా యాడాన్‌గా వస్తోంది. ''నడిపే తీరు ఆధారితంగా అల్గోరిథమ్ ఇంటర్నల్ స్కోర్‌ను ఇస్తుంది. ఈ స్కోరు ఆధారంగా అండర్‌రైటర్స్ (బీమా అధికారులు) ప్రీమియంను కచ్చితంగా లెక్కిస్తారు. దేశంలో కనెక్టెడ్ కార్లను ప్రారంభించడం పీఏవైడీ ఆఫర్ చేయడానికి అనుకూలం. అవి డ్రైవింగ్ తీరుపై బీమా సంస్థలకు నాణ్యమైన సమాచారాన్ని ఇస్తాయి''అని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ మోటార్ డిస్ట్రిబ్యూషన్ హెడ్ సుభాశీష్ మజుందార్ తెలిపారు. కనెక్టెడ్ కార్స్ అంటే ఇంటర్నెట్‌తో అనుసంధానమైనవి. వీటిల్లో కమ్యూనికేషన్ డివైజ్‌లు, సెన్సార్లు కూడా ఉంటాయి. ఈ ప్లాన్లను తమకు కావాల్సిన విధంగా ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంటుంది. పాలసీని ఆన్, ఆఫ్ చేసుకోవచ్చు. జునో జనరల్ ఇన్సూరెన్స్ ఆఫర్ చేస్తున్న 'స్విచ్' అనేది ఆన్ డిమాండ్ పాలసీ. పట్టణానికి వెలుపల ఉండి, కారును నడపని సమయంలో పాలసీని ఆఫ్ చేసుకోవచ్చు. దీనివల్ల బీమా ప్రీమియంలో ఆదా చేసుకోవచ్చు. కానీ, ఇలా ఆఫ్ చేసుకున్న సమయంలో కారుకు ఏదైనా నష్టం ఏర్పడితే అందుకు బీమా కంపెనీ నుంచి పరిహారం రాదని (కొన్ని మినహాయింపులు) గుర్తుంచుకోవాలి. కస్టమర్ కారు నడుపుతున్న తీరు ఆధారంగా డ్రైవింగ్ స్కోర్‌ను బీమా సంస్థలు కేటాయిస్తాయి. అధిక వేగం, పరధ్యానంతో డ్రైవింగ్, ఉన్నట్టుండి బ్రేక్‌లు కొట్టడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ స్కోర్ కేటాయిస్తాయి. ఒకవేళ పాలసీని స్విచాఫ్ చేసుకున్న తర్వాత, కారును వినియోగించినట్టయితే ఆ సమయంలో స్విచాన్ చేయడం మర్చిపోయినా.. వారి తరఫున యాప్ ఆ పనిచేస్తుంది.



అన్నింటిపై కాదు..

నడిపినంత దూరం, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడంపై వచ్చే డిస్కౌంట్ ఆధారపడి ఉంటుందని గుర్తు పెట్టుకోవాలి. ఇక్కడ ఓన్ డ్యామేజ్ అంటే వాహనానికి ఏదైనా కారణం వల్ల నష్టం వాటిల్లినా లేదా చోరీకి గురైనా పరిహారం ఇచ్చేదని అర్థం చేసుకోవాలి. థర్డ్ పార్టీ అంటే తమ వాహనం వల్ల ఎదుటి వాహనానికి, వ్యక్తులకు జరిగే నష్టానికి రక్షణనిచ్చే కవరేజీ. కొన్ని బీమా కంపెనీలు కేవలం ఓన్ డ్యామేజ్ వరకే ఈ డిస్కౌంట్‌ను ఇస్తున్నాయి. ఐసీఐసీఐ లాంబార్డ్ వంటి సంస్థలు థర్డ్ పార్టీ కవరేజీపైనా డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తున్నాయి. కనుక మొత్తం మీద డిస్కౌంట్ ఎంత వస్తుందన్నది ముందే విశ్లేషించుకోవాలి. ఉదాహరణకు కారు ప్రీమియం రూ.5,000 చెల్లిస్తున్నారనుకుంటే.. అందులో రూ.3,000 ఓన్ డ్యామేజ్ కోసం, రూ.2,000 థర్డ్ పార్టీ కోసం అయితే, ఓన్ డ్యామేజ్ రూ.3,000పై 5–25 శాతం వరకు డిస్కౌంట్ అంటే రూ.150–750 వరకు తగ్గుతుందని అర్థం. ఇక్కడ వాహనదారుడి ప్రయాణ సమాచారం ఎప్పటికప్పుడు బీమా కంపెనీలకు తెలుస్తుందని గుర్తు పెట్టుకోవాలి. గోప్యత కోరుకునే వారు దీన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఈ డేటా ఆధారంగానే బీమా సంస్థలు ప్రీమియంపై నిర్ణయానికి వస్తాయి. డిస్కౌంట్ పొందే వారి డ్రైవింగ్ తీరు సైతం బీమా కంపెనీలకు తెలిసిపోతుంది. భవిష్యత్తులో ప్రమాదాల క్లెయిమ్‌లు వచ్చిన సమయంలో ఈ డేటా వాటికి ఉపకరించొచ్చు. రద్దీ సమయాల్లో డ్రైవింగ్, ప్రమాదాలకు అధిక రిస్క్ ఉన్న ప్రాంతాల్లో డ్రైవింగ్‌కు సంబంధించి బీమా కంపెనీలు కొన్ని పరిమితులు విధించే అవకాశం లేకపోలేదు. బీమా కంపెనీ కోరినట్టు టెలీమ్యాటిక్స్, ఇతర పరికరాలు అమర్చుకోవాలంటే, అందుకు కొంత అదనపు వ్యయం అవుతుంది. ఈ పరికరాలకు మెయింటెనెన్స్, మరమ్మతుల ఖర్చు కూడా వాహనదారుడిపైనే పడుతుంది. వాహనంలో ఏవైనా మార్పులు చేయాల్సి వస్తే.. అందుకు సంబంధించి పాలసీ నియమ, నిబంధనలు ఏంటో ముందే తెలుసుకోవాలి.

వీటికి కవరేజీ..

- సంప్రదాయ బీమాలో మాదిరే అన్ని రకాల రిస్క్‌లను పీఏవైడీ కవర్ చేస్తుంది. అయితే ప్రీమియం చెల్లింపుల్లో వ్యత్యాసం ఉంటుంది.
- ప్రమాదం జరిగితే కారు రిపేర్ లేదంటే రీప్లేస్‌కు అయ్యే ఖర్చును బీమా కంపెనీ భరిస్తుంది.
- చోరీకి గురైతే లేదా చోరీ కారణంగా కారు డ్యామేజ్ అయినా పరిహారం లభిస్తుంది.
- వరదలు, భూకంపాలు తదితర విపత్తుల వల్ల కారుకు నష్టం ఏర్పడినా పరిహారం వస్తుంది.
- థర్డ్ పార్టీ కవరేజీ కూడా పీఏవైడీలతో వస్తుంది.
- కొన్ని పీఏవైడీ పాలసీలు గాయాల రక్షణ కవరేజీని ఆఫర్ చేస్తున్నాయి.

మినహాయింపులు..

- ఉద్దేశపూర్వకంగా చేసుకునే నష్టానికి పరిహారం రాదు.
- మద్యం, డ్రగ్స్ ప్రభావంతో కారు నడుపుతూ ప్రమాదం, నష్టం వాటిల్లితే బీమా సంస్థలు పరిహారం చెల్లించవు.
- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కారు నడపడం వల్ల ఎదురయ్యే నష్టానికి పరిహారం రాదు.
- రోజువారీ వినియోగం వల్ల వాహనంలో విడిభాగాలను మార్చాల్సి వస్తే వాటికి పరిహారం రాదు.
- ఎలక్ట్రికల్, మెకానికల్ ఫెయిల్యూర్ వల్ల నష్టం ఏర్పడితే పరిహారం చెల్లించవు.

ప్రీమియం తగ్గించుకునే టిప్స్..

- తక్కువ దూరం నడిపే వారికి పీఏవైడీతో ప్రీమియం ఆదా చేసుకోవచ్చు. దగ్గరి దూరానికి కారును ఉపయోగించుకోకుండా ఉండాలి. కార్యాలయానికి వెళ్లేవారు సహచర ఉద్యోగితో కలసి చెరొక రోజు కారును వినియోగించుకోవడం వల్ల ఆదా చేసుకోవచ్చు.
- చాలా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి. ఏ సందర్భంలోనూ ట్రాఫిక్ నియామాలు ఉల్లంఘించకూడదు. పరిమిత వేగాన్ని మించకుండా ఉండాలి. సడెన్ బ్రేక్‌లు వేయడం, రిస్క్ తీసుకుని క్రాస్ చేయడం ఇలా ప్రమాదాలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలి.
- ఎయిర్ బ్యాగ్‌ల వంటి భద్రతా ఫీచర్లు ఎక్కువగా ఉన్న కారును ఎంపిక చేసుకోవడం వల్ల కూడా ప్రీమియంలో ఆదా చేసుకోవచ్చు.
- మద్యపానం సేవించే వారు ఆ సమయంలో క్యాబ్ సేవలు వినియోగించుకుని, వ్యక్తిగత డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి.

స్టాక్స్ వ్యూ

అదానీ పోర్ట్స్	మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 795 టార్గెట్: రూ. 1010


ఎందుకంటే: ప్రయివేట్ రంగంలో దేశీయంగా అతి పెద్ద కంపెనీగా నిలుస్తున్న అదానీ పోర్ట్స్ అండ్ సెజ్(ఏపీసెజ్) సరుకు రవాణా(కార్గో) హ్యాండ్లింగ్‌లో 24 శాతానికిపైగా మార్కెట్ వాటాను కలిగి ఉంది. 2010–11లో కేవలం రెండు పోర్టుల(ముంద్రా, దహేజ్)తో కార్యకలాపాలు కొనసాగించిన కంపెనీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 14 ఓడరేవుల(పోర్టులు)తో దిగ్గజంగా ఆవిర్భవించింది. వ్యూహాత్మక ప్రాంతాలలోని పోర్టులు, కార్యకలాపాల నిర్వహణా సామర్థ్యం, సరుకు హ్యాండ్లింగ్‌లో భారీ విస్తరణ కంపెనీకి బలాన్నిస్తున్నాయి. హ్యాండ్లింగ్ పరిమాణం 2011తో పోలిస్తే నాలుగు రెట్లుపైగా దూసుకెళ్లింది. ఏపీసెజ్ పోర్టుల ద్వారా వివిధ విభాగాలలో అందుకుంటున్న పురోగతికి పోర్ట్‌ఫోలియో విస్తరణ ద్వారా మరింత జోష్‌ను తీసుకురానుంది. ఫలితంగా మార్కెట్ వాటాను మరింత పెంచుకునే అవకాశముంది. 2023–25 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన సరుకు హ్యాండ్లింగ్ పరిమాణం 12 శాతం చొప్పున పుంజుకోవచ్చని అంచనా. ఇది అటు ఆదాయం, ఇటు నిర్వహణ లాభం(ఇబిటా)లో వార్షిక ప్రాతిపదికన 15 శాతం చొప్పున పురోగతికి కారణమయ్యే వీలుంది.



పిరమల్ ఫార్మా	చాయిస్ బ్రోకింగ్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 104 టార్గెట్: రూ. 127

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో పిరమల్ ఫార్మా పటిష్ట ఫలితాలు సాధించింది. మా అంచనాలను మించుతూ ఆదాయం వార్షికంగా 11 శాతం వృద్ధితో రూ. 1,911 కోట్లను అధిగమించింది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మ్యాన్యుఫాక్చరింగ్ (సీడీఎంవో) బిజినెస్ దాదాపు 14 శాతం ఎగసింది. త్రైమాసికవారీగా(క్యూ1తో) అయితే 19 శాతం జంప్‌చేసింది. ఈ ఏడాది క్యూ2లో నిర్వహణ లాభం (ఇబిటా) 54 శాతం దూసుకెళ్లి రూ. 266 కోట్లకు చేరింది. వార్షికప్రాతిపదికన మార్జిన్లు 3.87 శాతం బలపడి 13.9 శాతాన్ని తాకాయి. త్రైమాసికవారీగా ఇవి 6.33 శాతం మెరుగుపడ్డాయి. ఇందుకు అధిక నిల్వలు, వ్యయ నియంత్రణలు, నిర్వహణ సామర్థ్య పెంపు చర్యలు తోడ్పాటునిచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాది ఏప్రిల్–జూన్(క్యూ1)లో నష్టాలను వీడి రూ. 5 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది క్యూ2లో రూ. 99 కోట్ల నికర నష్టం నమోదైంది. కాగా.. ఇకపై 64–65 శాతం స్థాయిలో స్థూల మార్జిన్లు నమోదుకాగలవని కంపెనీ అంచనా వేస్తోంది. సీడీఎంవో విభాగంలో పెరుగుతున్న ఆర్డర్లు, ఇతర విభాగాలలో నమోదవుతున్న పురోగతి కారణంగా రానున్న మూడేళ్ల(2023–26) కాలంలో ఆదాయం 13 శాతంపైగా వృద్ధి చెందే అవకాశముంది. స్థూల, నిర్వహణ లాభ మార్జిన్ల మెరుగుతో ఇబిటా 44 శాతం జంప్‌చేసే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఎస్‌బీఐ లాభం అప్

క్యూ2లో రూ. 16,100 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 9 శాతం పుంజుకుని రూ. 16,100 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 8 శాత వృద్ధితో రూ. 14,330 కోట్లను తాకింది. వేతనాలు, పెన్షన్లు సవరించేందుకు కొంత మొత్తాన్ని కేటాయించడంతో లాభాల్లో వృద్ధి పరిమితమైంది. కాగా.. నికర వడ్డీ ఆదాయం 12 శాతంపైగా ఎగసి రూ. 39,500 కోట్లకు చేరింది. అయితే డిపాజిట్ వ్యయాల కారణంగా నికర వడ్డీ మార్జిన్లు 0.12 శాతం నీరసించి 3.43 శాతానికి చేరాయి. వేతనాలు, పెన్షన్లకు ప్రొవిజన్లు రూ. 5,900 కోట్ల మేర పెరగడంతో నిర్వహణ లాభం 8 శాతం క్షీణించి రూ. 19,417 కోట్లకు పరిమితమైనట్లు ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖారా వెల్లడించారు. కాగా.. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) గత దశాబ్ద కాలంలోనే అతితక్కువగా 2.55 శాతాన్ని తాకాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా 600 బ్రాంచీలను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు ఖారా తెలియజేశారు. ఎస్‌బీఐ ప్రస్తుతం 22,400 బ్రాంచీలను కలిగి ఉంది. కనీస మూలధన నిష్పత్తి 14.28 శాతంగా నమోదైంది.

ఎన్‌పీఎస్, ఈపీఎఫ్ ఏది బెటర్..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్





నాకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాల పెట్టుబడులు ఉండగా, వీటిని విక్రయించాను. ఈ లాభం లక్షలోపు ఉంది. దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష లోపు ఉంటే పన్ను చెల్లించక్కర్లేదని విన్నాను. అయితే, ఈ లాభాలను ఆదాయపన్ను రిటర్నుల్లో వెల్లడించాలా? అవసరం లేదా? – గురుమూర్తి

మీ వార్షికాదాయం ఆదాయపన్ను వర్తించే శ్లాబులో ఉంటే తప్పకుండా రిటర్నులు వేయాల్సి ఉంటుంది. రిటర్నులు దాఖలు చేయాల్సిన ప్రతి ఒక్కరూ పన్ను పరిధిలోకి రాని మూలధన లాభం ఉన్నప్పటికీ దాన్ని రిటర్నుల్లో వెల్లడించాల్సిందే. లిస్టెడ్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడులు కలిగినా లేదా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను ఏడాదికి మించి కలిగి ఉంటే, వాటిపై వచ్చే లాభాన్ని దీర్ఘకాల మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ)గా పేర్కొంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు ఉంటే పన్ను లేదు. అంతకుమించిన లాభం వస్తే, ఆ మొత్తంపై 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్) ఆధారంగా మీరు దాఖలు చేయాల్సిన వార్షిక రిటర్నుల పత్రాల్లో ఈ వివరాలు ముందుగానే నింపి ఉంటాయి. కనీస ఆదాయపన్ను మినహాయింపు పరిధిలోనే ఆదాయం ఉంటే, పన్ను వర్తించని మూలధన లాభాలను వెల్లడించక్కర్లేదు. ఆదాయపన్ను పాత విధానం కింద సీనియర్ సిటిజన్లు అయితే (60 ఏళ్లు నిండిన) వార్షికాదాయం రూ.3 లక్షలు ప్రాథమిక పన్ను మిహాయింపు పరిమితిగా ఉంది. 80 ఏళ్లు నిండిన వారికి ఇది రూ.5లక్షలుగా ఉంది. మిగిలిన వారికి రూ.2.5 లక్షలుగా ఉంది. నూతన పన్ను విధానంలో వయసుతో సంబంధం లేకుండా అందరికీ ఆదాయపన్ను మినహాయింపు కనీస పరిమితి రూ.2.5 లక్షలుగానే ఉంది.

వార్షిక ఆదాయ మినహాయింపు పరిమితి రూ.2.5 లక్షలుగా ఉన్నప్పటికీ, వాస్తవ ఆదాయం ఇంతకంటే తక్కువగా ఉన్న వారు మూలధన లాభాలు (స్వల్పకాల, దీర్ఘకాల) కలిగి ఉంటే, ఆ మొత్తాన్ని కనీస పరిమితి కింద భర్తీ చేసుకోవచ్చు ఉదాహరణకు వార్షికాదాయం రూ.1.8 లక్షలుగానే ఉండి, మూలధన లాభం రూ.లక్ష వచ్చి ఉంటే, అప్పుడు బేసిక్ పరిమితిలో మిగిలిన రూ.70వేలను భర్తీ చేసుకోవచ్చు. ఇది పోను మిగిలిన రూ.30వేలపైనే మూలధన లాభాల పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఇలా కాకుండా మీ ఆదాయం రూ.2.5 లక్షలకు పైన ఉంటే, అప్పుడు మూలధన లాభాలను రిటర్నుల్లో వెల్లడించి నిబంధనల కింద పన్ను చెల్లించాల్సిందే.

ప్రస్తుతం నేను పనిచేస్తున్న సంస్థలో నా నెలవారీ వేతనం నుంచి ఈపీఎఫ్ పథకానికి చందాలు వెళుతున్నాయి. నేను వచ్చే ఏడాది నేను పదవీ విమరణ తీసుకోబోతున్నాను. పీఎఫ్ నిధి సుమారు రూ.50 లక్షలుగా ఉంటుంది. ఈ సమయంలో ఎన్‌పీఎస్‌కు మారేందుకు కార్యాలయం నాకు ఆప్షన్ ఇచ్చింది. మరి నేను ఎన్‌పీఎస్‌కు మారాలా? అది నాకు ప్రయోజనమేనా? – రాజేష్ కుమార్ భాసిన్

రిటైర్మెంట్ ప్రణాళిక కోసం ఎన్‌పీఎస్, ఈపీఎఫ్ రెండూ ముఖ్యమైన పథకాలుగా ఉన్నాయి. ఈపీఎఫ్ అనేది మీ వేతనం నుంచి తప్పకుండా మినహాయించే ప్రావిడెంట్ ఫండ్ ఆప్షన్. రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకోవడమే ఇందులోని ఉద్దేశం. పదవీ విమరణ సమయంలో చేతికి అందే మొత్తంపై పన్ను ఉండదు. ఎన్‌పీఎస్ అనేది స్వచ్ఛంద పథకం. పదవీ విరమణ నిధి ఏర్పాటుకు ఇది కూడా ఒక సాధనం. మీరు మరో ఏడాదిలో రిటైర్మెంట్ తీసుకుంటున్నారు.

ఈపీఎఫ్ ద్వారా ఇప్పటికే నిధిని సమకూర్చుకున్నారు. కనుక ఈ సమయంలో ఎన్‌పీఎస్‌కు మారడం వల్ల వచ్చే అదనపు ప్రయోజనం ఏమీ ఉండదు. వేచి చూసి రిటైర్మెంట్ తర్వాత వచ్చే ఈపీఎఫ్ నిధిని మీ అవసరాలకు అనుగుణంగా ఇన్వెస్ట్ చేసుకోవడం సరైనది. పదవీ విరమణ తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం కోరుకునేట్టు అయితే, మీ ఉద్దేశ్యాలకు అనుగుణంగా సాధనాలను ఎంపిక చేసుకోవాలి. క్రమం తప్పకుండా ఆదాయం కోరుకోకపోతే అప్పుడు ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. స్వచ్ఛందంగా అయినా ఎన్‌పీఎస్ ఖాతాను 70 ఏళ్ల వరకు తెరిచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

త్వరలో పట్టాలెక్కనున్న వందే సాధారణ్

దీపావళి కానుకగా 'పేదల వందేభారత్' • హైదరాబాద్-ఢిల్లీకి పచ్చజెండా

పరిశీలనలో హైదరాబాద్-నాగర్‌కోయిల్

త్వరలో అందుబాటులోకి

చెన్నై ఐసీఎఫ్ నుంచి తొలి రైలు ముంబైకి చేరిక



సాక్షి, హైదరాబాద్: వందేభారత్ రైళ్ల తర్వాత అదే తరహాలో సిద్ధమవుతున్న వందే సాధారణ్ రైళ్లు వచ్చే నెలలో పట్టాలెక్కబోతున్నాయి. వందేభారత్ రైళ్లు పూర్తి ఏసీ కోచ్‌లతో ఉండగా, ఇవి నాన్ ఏసీ కోచ్‌లతో నడిచే సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లు. వందేభారత్ రైళ్లలో టికెట్ ఛార్జీలు ఎక్కువగా ఉండటంతో పేద ప్రజలు వాటిలో ప్రయాణించడానికి ఇష్టపడటం లేదు. ఈ వెలితిని దూరం చేయాలన్న ఉద్దేశంతో దాదాపు అదే రూపంతో, ఇంచుమించు అంతే వేగంతో నడిచేలా కేంద్ర ప్రభుత్వం వందే సాధారణ్ పేరుతో ఈ రైళ్లను అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో సిద్ధమైన తొలి రైలును పశ్చిమ రైల్వేకు కేటాయించారు. అది రెండు రోజుల క్రితం ముంబైకి చేరుకుంది. దాన్ని ఢిల్లీ–ముంబై మధ్య నడిపే యోచనలో అధికారులున్నారు. ఇప్పటికే వందే సాధారణ్ రైళ్ల కోసం ఐదు మార్గాలకు రైల్వే బోర్డు అనుమతించింది. ఇందులో హైదరాబాద్–న్యూఢిల్లీ కూడా ఉండటం విశేషం. మరో 13 మార్గాలలో నడిపేందుకు అధికారులు ప్రతిపాదించారు. వాటికి అనుమతి రావాల్సి ఉంది. ఆ జాబితాలో హైదరాబాద్–నాగర్‌కోయిల్ సర్వీసు కూడా ఉండటం విశేషం. వెరసి తెలంగాణకు రెండు వందేసాధారణ్ రైళ్లు అందుబాటులోకి రాబోతున్నాయి.

పుష్‌పుల్ పద్ధతిలో..

తొలి రెండు విడతలలో పట్టాలెక్కిన వందేభారత్ రైళ్లు తెలుపు రంగుపై నీలి చారలతో ఆకట్టుకున్నాయి. మూడో విడతకొచ్చేసరికి కాషాయం–నలుపులతో కూడిన మరింత ఆకర్షణీయ కలర్ కాంబినేషన్ ప్రత్యక్షమైంది. ఇప్పుడు వందే సాధారణ్ రైళ్లు కూడా కాషాయ–నలుపు కాంబినేషన్‌తో వస్తున్నాయి. వందేభారత్ తరహాలోనే ఇవి కూడా పుష్‌పుల్ ఇంజన్లతో నడుస్తాయి. అయితే, వందేభారత్‌లో ఇంజిన్లు విడిగా ఉండవు. రైలులోనే అంతర్భాగంగా ఉంటాయి. వందే సాధారణ్‌లో మాత్రం డబ్ల్యూపీ–5 లోకోమోటివ్‌లను ముందు ఒకటి వెనక ఒకటి అమరుస్తారు.

130 కి.మీ. గరిష్ట వేగం..

డబ్ల్యూపీ–5 లోకోమోటివ్‌లు గంటకు 200 కి.మీ. వేగంతో ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. కానీ, వందే సాధారణ్ రేక్ వేగాన్ని తట్టుకునే 130 కి.మీ.వేగాన్ని మాత్రమే తట్టుకుంటాయి. ఇక ట్రాక్ సామర్థ్యం కూడా చాలా ప్రాంతాల్లో అంతే ఉంది. దీంతో ఈ రైలు గరిష్ట వేగం గంటకు 130 కి.మీ.

- 2004లో రైల్వే జన్‌సాధారణ్ పేరుతో రైళ్లను ప్రారంభించారు. సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే వేగంగా వెళ్లే ఈ రైళ్లు పూర్తిగా అన్ రిజర్వ్‌డ్ కోచ్‌లతో ఉంటాయి. కానీ, అవి సరిగా నడవలేదు. ఇప్పుడు వాటిని రీప్లేస్ చేస్తున్నట్టుగా వందే సాధారణ్ పేరుతో రైళ్లను ప్రారంభిస్తుండటం విశేషం.
- ఈ రైలులో రెండు ఇంజన్‌లతోపాటు 12 స్లీపర్ క్లాస్ కోచ్‌లు, 8 జనరల్ కంపార్ట్‌మెంట్ కోచ్‌లుంటాయి.
- ప్రతి కోచ్‌లో సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీట్ వద్ద ఫోన్ ఛార్జింగ్ పాయింట్లు, మడత స్నాక్ టేబుల్స్, లగేజీ ర్యాక్, అగ్ని నియంత్రణ వ్యవస్థ ఉంటాయి.
- సెమీ పర్మనెంట్ కప్లర్స్ వ్యవస్థ వల్ల కుదుపులు తక్కువ.
- ఈ రైళ్లు 8.36 నిమిషాల్లో 110 కి.మీ. వేగాన్ని అందుకుంటాయి. 130 కి.మీ. వేగాన్ని 9.2 నిమిషాల్లో అందుకుంటాయి.

అనుమతి పొందిన మార్గాలు

- ఢిల్లీ- ముంబై
- ఢిల్లీ - పాట్నా
- ఢిల్లీ - హౌరా
- ఢిల్లీ - హైదరాబాద్
- గువాహటి - ఎర్నాకులం

పరిశీలన జాబితాలో ఉన్న రూట్లలో కొన్ని:

- హైదరాబాద్ - నాగర్‌కోయిల్
- దర్భంగా- లూథియానా
- ముంబై-చాప్రా
- ముంబై-రాక్సౌల్
- ముంబై-జమ్మూతావి
- దర్భంగా-అహ్మదాబాద్
- కోల్‌కతా-పోర్‌బందర్
- వారణాసి-దర్భంగా
- సార్సా-అమృత్‌సర్
- మెంగళూరు-కోల్‌కతా
- గువాహటి-జమ్మూతావి





ఉద్యాన పంటలకు ఉపాధిహామీ పథకం అండగా నిలుస్తోంది. మహిళా రైతుల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం సత్ఫలితాలనిస్తోంది. పండ్ల తోటల పెంపకం ద్వారా సన్న, చిన్నకారు రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తోంది. మరికొందరికి ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేటగిరీ 'బి'లో మునగ తోటల పెంపకం సుస్థిర ఆదాయ మార్గాన్ని పెంచుతోంది.

ఈ ఏడాదంతా మునగడే

ఉపాధిహామీ కింద తోటల పెంపకం

జాబ్ కార్డు ద్వారా 100 రోజుల పనిదినాలు

లాభాలు గడిస్తున్న మహిళా రైతు

ఆర్థిక భరోసా నింపుతున్న పండ్లతోటలు



సాక్షి ప్రతినిధి, కడప: జాబ్ కార్డు కలిగిన గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని కల్పించడం ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశం. ఆ పనుల్లో కేటగిరి 'బి'కి సంబంధించి వ్యక్తిగత ఆస్తుల అభివృద్ధి చేసేందకు ఉపాధి హామీ పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేశారు. ఇందులో భాగంగా 5ఎకరాల లోపు భూమి కలిగిన, విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతు కుటుంబాలకు మునగ తోటల పెంపకానికి అవకాశం కల్పించారు. సుస్థిర ఆదాయ మార్గం ద్వారా జీవనోపాధి పెంచడమే లక్ష్యం కావడంతో లాభదాయకంగా ఉంటోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అందిస్తున్న ఉపాధి పనులు, రాయితీలు రైతులకు ప్రోత్సాహకంగా మారాయి.

మునగ సాగుతో.. మహిళా రైతు ముందంజ

వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలంలోని దేవరాజుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని జాబ్ కార్డు హోల్డర్ భూమిరెడ్డి రామసుబ్బమ్మ(60) మునగ సాగుతో ఉపాధి పొందుతున్నారు. అతి తక్కువ పెట్టుబడితో, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ, ఆర్థిక సహకారంతో తనకున్న చిన్నపాటి 34 సెంట్ల పొలంలో మునగ సాగు చేసి మెరుగైన జీవనోపాధిని పొందుతున్నారు. మునగ తోట పెంపకం కోసం 2022–2023 ఆర్థిక సంవత్సరంలో మహిళా రైతు బి రామసుబ్బమ్మ (జాబ్ కార్డు నెం: 80092) ద్వారా మునగ తోట పెంపకానికి అంచనా వేయగా 0.34 ఎకరాకు గాను 152 మొక్కలను సాగు చేసేందుకు అంచనా మొత్తం రూ. 55,413 లుగా నిర్ణయించారు. ఇందులో వేతనాల కింద రూ. 39,296, 153 పని దినాలు, సామగ్రి కొనుగోలు కింద రూ. 11,260లు, ఇతరత్రా ఖర్చులు రూ. 4,857 ప్రకారం అంచనా వేసి క్షేత్రస్థాయిలో మునగ సాగు పనులను మొదలు పెట్టారు. పెట్టుబడి సాయం దక్కడంతో దిగుబడి తగ్గ ఫలితాలు రానున్నాయి.



రామసుబ్బమ్మ సాగుచేసిన మునగతోట

తక్కువ ఖర్చుతో లాభాలు

వ్యవసాయ పంటలు కలిసిరాక కష్టాల సాగులో కొట్టుమిట్టాడుతున్న రైతన్నలకు ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తోంది.రైతులు వ్యవసాయ పొలాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. జిల్లాలో వ్యవసాయ పంటలకు అనుకూలంగా లేని రైతులు ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసిని ఉద్యాన పంటలను సాగు చేసుకుని తక్కువ ఖర్చులతో అధిక లాభాలు పొందవచ్చు.

– వి.విజయ్ రామరాజు, జిల్లా కలెక్టర్, వైఎస్ఆర్ జిల్లా.

'ఉపాధిహామీ'ని సద్వినియోగం చేసుకోవాలి

పని కోరిన వారికి పని కల్పించడం ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశం. ఉద్యాన పంటలకు అనుసంధానం ద్వారా జిల్లాలో 22.70 ఎకరాల్లో మునగ పంట సాగులోకి తెచ్చాం. కమలాపురం మండలంలో జాబ్ కార్డుదారు రామసుబ్బమ్మ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ఆమెకు ఇప్పటి వరకు 30 పనిదినాలు కల్పించి రూ. 7,426 వేతనం చెల్లించాం. లబ్ధిదారులు ఇంటి సమీపంలోనే ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో 152 మునగ మొక్కలను పెంచి ప్రస్తుతం వారు దిగుబడిని కూడా అందుకుంటున్నారు. ఆసక్తి, అవకాశం ఉన్న సన్న చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పి.యదుభూషన్ రెడ్డి, పథక సంచాలకులు, వైఎస్ఆర్ జిల్లా, కడప

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

మంత్రికి సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి: మంత్రి శివరాజ్ తంగడిగిని ఆయన నివాసంలో కారటగి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సర్దార్ అలి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాజ్ తంగడిగి ఉద్యోగుల సమస్యల పట్ల స్పందించి ఎన్నో డిమాండ్లను పరిష్కరించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘం తాలూకా కార్యదర్శి తిమ్మణ్ణ నాయక, సంఘటన కార్యదర్శి కనకప్ప, ఉపాధ్యక్షులు హనుమంతప్ప, ట్రెజరర్ వెంకోబ పాల్గొన్నారు.

జేడీని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న నిరుపాది

రాయచూరు రూరల్: రాయచూరు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ దేవికను సస్పెండ్ చేయాలని రాష్ట్ర సమితి అధ్యక్షుడు నిరుపాది డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన శాఖలో ఆమె ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, అర్హతలేని వారిని అధికారులుగా నియమించిందని, తన మాట వినడం లేదని నెల రోజుల క్రితం రాయచూరు శాఖలో విధులు నిర్వహించే అధికారులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయించారని ఆరోపించారు. కల్యాణ కర్నాటక పరిధిలోని 371(జె) ద్వార స్థానికులను దూరం చేసి బదిలీ చేయించిన జెడి దేవికను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిరంతర విద్యుత్ అందించాలి



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కంప్లి: కోతల్లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని వివిధ సంఘాలు ఎమ్మిగనూరు గ్రామ జెస్కాం సిబ్బందిని డిమాండ్ చేశారు. ఎడాపెడా విద్యుత్ కోతల వల్ల వ్యవసాయం, పిండిమరలు, హోటళ్లు తదితర వ్యాపార సంస్థలు దెబ్బతింటున్నాయని, గతంలోను ఇదే విషయమై జెస్కాం అధికారులతో చర్చించామని, మరోసారి కూడా విజ్ఞప్తి చేస్తున్నామని కర్ణాటక పదవీ ధర వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు హెచ్ మల్లేషప్ప అన్నారు.

ప్రశాంతంగా కేపీఎస్‌సీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీసీ

రాయచూరు రూరల్: జిల్లాలో కేపీఎస్‌సీ గ్రూప్ సీ ఉద్యోగ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఠాగూర్ స్మారక కళాశాలలో అదనపు జిల్లాధికారి దురుగేష్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 4299 అభ్యర్థులలో 4026 హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సురేశ్ తెలిపారు.

పట్టాలపై నిలిచిపోయిన గూడ్స్

- ప్యాసింజర్ ప్రయాణికుల అవస్థలు



పట్టాలపై నిలిచిపోయిన గూడ్స్ రైలు

రాయచూరు రూరల్: గూడ్స్ రైలు మరమ్మతులకు గురై పట్టాలపై నిలిచిపోవడంతో ఆ మార్గంలో వెళ్లాల్సిన మరో ప్యాసింజర్ రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం యాదగిరి జిల్లా నాలవార వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. రాయచూరు నుంచి విజయపురకు ప్యాసింజర్ రైలు బయలుదేరడానికి ముందు ఆ లైన్‌లో గూడ్స్ రైలు వెళ్లింది. అది మరమ్మతులకు గురై పట్టాలపై నిలిచిపోయింది. దీంతో వెనుక ఉన్న ప్యాసింజర్ రైలును నిలిపివేశారు. దాదాపు మూడు గంటల పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తమైంది.

కన్నడభాషకు ప్రోత్సాహం ఇవ్వాలి

రాయచూరు రూరల్ : పట్టణ ప్రాంతాలలో కన్నడ భాషకు ప్రోత్సాహమివ్వాలని కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపు ఇచ్చారు. ఆదివారం కన్నడ భవనంలో రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా నృపతుంగా అవార్డును అందించి మాట్లాడారు. కార్యక్రమంలో అరవింద్ కులకర్ణి, మ్యాదర్, అశోక్‌కుమార్ జైన్, రఫీక్ అహ్మద్, శాంత కులకర్ణి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు



జీన్స్ దుస్తులు కుదుతున్న కార్మికులు



పంటలు ఎండిపోవడంతో దిగాలుగా రైతులు (ఫైల్)

- జీన్స్ దుస్తుల తయారీ కార్మికులు కుదేలు
- మరోవైపు ఎండుతున్న పంటలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

సాక్షి బళ్లారి: తీవ్ర వర్షాభావ పరిస్థితులతో కరువు విలయ తాండవం చేస్తుండగా కరెంట్ కోతల వల్ల వ్యవసాయం, పరిశ్రమలు మరింత కష్టాల్లో కూరుకుపోతున్నాయి. జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండిపోవడంతో పాటు జీన్స్ దుస్తుల తయారీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నగరంలో జీన్స్ దుస్తులు తయారు చేస్తున్న వారు దాదాపు 12 వేల మందికిపైగా ఉన్నారు. ఇందులో మహిళలు కూడా సగానికిపైగా ఉన్నారు. జీన్స్ దుస్తుల తయారీ కార్మికులు అందరూ నిరుపేదలే. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుట్టు మిషన్‌పై కూర్చొని దుస్తులను తయారు చేస్తే వీరికి రూ.300 నుంచి రూ.400ల వరకు సంపాదించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇటీవల కుట్టుమిషన్లకు మోటార్లు అమర్చడంతో విద్యుత్ కోతల వల్ల వారి ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

గంటల తరబడి కరెంట్ కట్:

జిల్లాలో విద్యుత్‌ను ఉత్పాదన చేసే కేపీటీసీఎల్ ప్లాంటు తుంగభద్ర డ్యాం ఉన్నప్పటికీ జిల్లాలో విద్యుత్ సమస్య ఎప్పటి నుంచో పరిష్కారం కావడంలేదు. బళ్లారి నగరంలో విద్యుత్ కోతలు ఇష్టారాజ్యంగా విధిస్తున్నప్పటికీ ప్రశ్నించేవారు లేరు. విద్యుత్ కోతల వల్ల పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. దీంతో పాటు విద్యుత్ ఉంటేనే జీవనం సాగించే జీన్స్ దుస్తులను తయారు చేస్తున్న కార్మికులు వేలాది మంది వీధినపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. ఉపాధి లభించకపోవడంతో స్వస్థలాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. విద్యుత్ కోత వల్ల జనరేటర్లకు డిమాండ్ పెరిగింది. ఒక్కొసారి గంటల తరబడి విద్యుత్ కోతను విధిస్తున్నారు. త్వరలో దీపావళి పండుగ నేపథ్యంలో జీన్స్ దుస్తుల కొనుగోలు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని విద్యుత్ కోత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

బలిజలకు 2ఏ రిజర్వేషన్ కల్పించాలి

బళ్లారిఅర్బన్: రాష్ట్రంలోని 197 కులాలు ఉన్నప్పటికి బలిజలు అత్యంత వెనుకబాటులో ఉన్నారని, వారికి తక్షణం 2ఏ రిజర్వేషన్ కల్పించాలని సంఘం నేత కేఎస్ ద్వారకనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వడ్డరబండలోని బలిజ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 30 ఏళ్లుగా 2ఏ రిజర్వేషన్ కోసం పోరాటం చేశామన్నారు. గతంలోని బీజేపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి యడియూరప్ప బలిజ సమాజానికి కేవలం ఎగ్జిక్యూషన్ మాత్రమే 2ఏలో అవకాశం కల్పించి సమాజంలో ఉపాధి పొందేందుకు రిజర్వేషన్ లేక పోవడం వల్ల ఇప్పటికి పోరాడుతునే ఉన్నామన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2ఏ రిజర్వేషన్ కల్పించి తమకు న్యాయం చేయాలని సమాజానికి చెందిన ప్రముఖులు అన్ని జిల్లాల నుంచి వెళ్లి కలుస్తున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో బలిజ సంఘం సభ్యత్వం పొంది ఐక్యతతో పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా బళ్లారి జిల్లా బలిజ సంఘం అధ్యక్షులు రమేష్ బుజ్జి, సమాజ ప్రముఖులు దొడ్డహనుమంతప్ప, శ్రీనివాస్, సూర్యబాబు, కళా చంద్ర, తిప్పేస్వామి, నారాయణ, రామకృష్ణ, వీరణ్ణ పత్తార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలిజ సంఘం నేత ద్వారకనాథ్

కిత్తూరు చెన్నమ్మ జయంత్యుత్సవం



పూర్ణకుంభాలతో వస్తున్న మహిళలు, చిత్రంలో ఎమ్మెల్యేగాలి తదితరులు



సమరయోధుల వేషధారణలో చిన్నారులు

గంగావతి: కిత్తూరు రాణి చెన్నమ్మ జయంత్యుత్సవాన్ని పంచమశాలి సమాజం వారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ కుంభాల ఊరేగింపును ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాణి చెన్నమ్మ దేశానికి స్వాతంత్ర సాధన కోసం కృషి చేసిన వీరవనిత గుర్తు చేశారు. ఆమె ఆదర్శాలు, తత్వాలను నేటి యువత అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంచామశాలి గురువు జయ మృత్యుంజయ స్వామి అశ్వ వాహనంపై కూర్చోగా, యోధుల వేషధారణతో చిన్నారులు బయలుదేరారు. ఈ సందర్భంగా డప్పులు, వాయిద్యాలతో నగర వీధుల గుండా జంతకల్‌లోని మద్దనేశ్వర స్వామి దేవస్థానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్ శ్రీనాథ్, పంచమశాలి ప్రముఖులు శివప్ప వీరేష్ బెనకల్, మనోహర్‌గౌడ హెరూరు, పంచమశాలి సమాజ ప్రముఖులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నాటకాలకు ఆదరణ కొరవడింది



నాటకంలోని ఓ సన్నివేశం



ప్రశంసాపత్రాలు అందుకున్న కళాకారులు

హొసపేటె: నేడు నాటకాలకు ఆదరణ కొరవడిందని సీనియర్ కళాకారుడు నారాయణప్ప ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి తాలూకాలోని కారిగనూరు ప్రభుత్వం పాఠశాలలో కారిగనూరు కళా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జానపద నృత్యం, నాటక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో నాటకాలు కనుమరుగవుతున్నాయని, ప్రజల్లో కూడా ఆసక్తి తగ్గిపోయిందని అన్నారు. ఇదే సమయంలో నాటక ప్రదర్శనలు లేక ఈ వృత్తినే నమ్ముకున్న కళాకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలన్నారు. అనంతరం కనసు అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారుడు గిరిరెడ్డి గోవిందారాజు, సోము తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వరకు కొనసాగిన కౌన్సెలింగ్

హొసపేటె: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన కౌన్సెలింగ్‌ను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి వరకు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలో ఖాళీగా సుమారు 441 జీపీటీ పోస్టుల భర్తీ ప్రక్రియను రాత్రి వరకు కొనసాగించారు. దీంతో అభ్యర్థులు పడిగాపులు పడ్డారు.

గడ్డివాముకు నిప్పు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

శ్రీనివాసపురం: తాలూకాలోని పాతముత్తక పల్లి గ్రామంలో శనివారం రైతు నారాయణస్వామికి చెందిన గడ్డివాముకు నిప్పంటుకుంది. సుమారు రూ. 50 లక్షల విలువ చేసే 8 లోడ్‌ల రాగి గడ్డి వాముగా పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో తెలియడం లేదని రైతు నారాయణస్వామి వాపోయాడు.

నిందితుడిపై పోలీసు కాల్పులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు

మాలూరు: తాలూకాలోని జయమంగల గ్రామ పంచాయతీ సభ్యుడు మీణసంద్ర అనిల్ కుమార్ హత్య కేసుకు సంబంధించి పోలీసులు ఆదివారం ఉదయం నిందితుడు అశోక్‌ను పట్టుకునే క్రమంలో అతను ఎదురుదాడికి దిగడంతో కాల్పులు జరిపి అరెస్ట్ చేశారు. వివరాలు...నిందితుడు అశోక్ హుంకరళగెరె క్రాస్ ఉన్నట్లు సమాచారం అందుకున్న ఇన్స్‌పెక్టర్ వసంతకుమార్, సిబ్బందితో అక్కడికి చేరుకున్నాడు. పట్టుకోవడానికి యత్నించగా పోలీసులపై కత్తితో దాడికి దిగాడు. దీంతో పోలీసులు కోదండపాణి, అశోక్‌లకు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన సీఐ వసంత్‌కుమార్, అశోక్ కాలిపై కాల్చాడు. దీంతో అతను కుప్పకూలిపోయాడు. పోలీసులతో పాటు నిందితుడిని కూడా ఆస్పత్రికి తరలించారు.

అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్ట్

హుబ్లీ: నగరంలోని పరాతా గల్లీలోని ఓ దుకాణంలో కరిగించిన రూ.61 లక్షల విలువైన లిక్విడ్ బంగారు చోరీ కేసుకు సంబంధించి ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 6.5 లక్షల నగదు, రూ. 12 లక్షల బంగారు స్వాధీనం చేసుకున్నారు.

కారు దొంగలు పట్టివేత

హుబ్లీ నగరంలోని పంచాక్షరి నగరి బసవాయ స్ట్రేట్‌లో కారు అపహరణకు సంబంధించిన కేసులో ముగ్గురు నిందితులను నవనగర ఏపీఎంసీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.4.5 లక్షల విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ మద్యం విక్రేతకు కటకటాలు

హుబ్లీ: బహిరంగ ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని గుజరాత్ భవన దగ్గర అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసి ఓ కారు, రూ. 24 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

హొసపేటె: బహిర్భుమికి వెళ్లిన మహిళపై ఎలుగుబంటి దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడిన ఘటన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా బండేభసాపురంలో శనివారం రాత్రి చోటు చేసుకొంది. బండేభసాపురం గ్రామానికి చెందిన కాళీబాయి రాత్రి బహిర్భుమికి పొలం వైపు వెళ్లింది. ఆ సమయంలో ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు అక్కడికి చేరుకుని బాధితురాలిని కూడ్లిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడం సంతోషం

శ్రీనివాసపురం: ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలకు సహాయం చేసి వారి కౌశల్యాలకు అనుగుణంగా మార్గదర్శనం చేసి మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేస్తుండటం ఎంతో సంతోషించదగ్గ విషయమని మహిళా వేదిక జిల్లా అధ్యక్షురాలు మాయా బాలచంద్ర తెలిపారు. ఆదివారం పట్టణంలోని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన దసరా పూజా కార్యక్రమంలో భాగంగా గణపతి, నవగ్రహపూజ, హోమా కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. మహిళలు ధర్మస్థల సంఘం అందిస్తున్న సహకారంతో ఆర్థికంగా ముందుకు రావాలని తెలిపారు. కురుబర సంఘం తాలూకా అధ్యక్షుడు వేమన్న మాట్లాడుతూ ధార్మికంగా అందరు ఒకచోట చేరి ఆచరణ చేసే కార్యక్రమాలు సముదాయం మధ్యన ఐక్యతను పెంచుతాయన్నారు. కార్యక్రమంలో తాపం మాజీ సభ్యుడు కెకె మంజునాథ్‌రెడ్డి, నాగవేణిరెడ్డి, ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంఘం యోజనాధికారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాలను నిర్వహించిన దృశ్యం

కార్తీక్ హత్య కేసులో నిందితుడి కోసం గాలింపు

కోలారు : కోలారు నగరంలో సంచలనం సృష్టించిన మైనర్ బాలుడి హత్య కేసులో నిందితుడిగా భావిస్తున్న షైన్ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. మూడు బృందాలుగా గాలిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి కార్తీక్ సింగ్ (17)ను నగరంలోని నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో హత్య చేసిన విషయం తెల్సిందే

షైన్‌పై ఆరోపణలు :

హత్య కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న షైన్ పలు కేసులకు సంబంధించి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. నిందితుడు షైన్ పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు కావడంతోనే పోలీసులు నచ్చచెప్పి కేసులు పెట్టకుండా పంపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీసీ కాలనీలో ఉంటున్న షైన్ హతుడు కార్తీక్ సింగ్ ఇద్దరు ఒకే కళాశాలలో చదువుతున్నారు. ఇద్దరి మధ్య స్నేహం కూడా ఉంది. గతంలో చిన్న విషయానికి కార్తీక్, షైన్‌ల మధ్య గొడవ జరిగింది. దీనినే మనసులో పెట్టుకుని షైన్ ఈ అకృత్యానికి పాల్పడ్డాడని స్థానికులు అంటున్నారు.

బీట్ వ్యవస్థ కల్పించండి :

నగరంలో హత్యలు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. రాత్రి సమయాలలో సరైన బీట్ వ్యవస్థ లేకపోవడం వల్లనే ఇలా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి 10 గంటల సమయంలో నగరం నడిబొడ్డున హత్యకు దారితీసినా పోలీసులకు తెలియలేదు. పోలీస్ బీట్ లేకపోవడం వల్లనే ఇలా జరుగుతోందని స్థానికుల ఆరోపణ.

పోలీసులపై ఐజీ గరం గరం :

కోలారు జిల్లాలో జరుగుతున్న హత్యలపై ఐజీపీ రవికాంతేగౌడ ఉన్నతాధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నగరంలో ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశమైన ఐజీ, పోలీసుల నిర్లక్ష్య వైఖరిపట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఎస్ఐ, కానిస్టేబుళ్ల సస్పెండ్

కోలారు : శ్రీనివాసపురం పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసన్ అలియాస్ కౌన్సిలర్ శ్రీనివాస్ హత్యకేసుకు సంబంధించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణపై ఎస్ఐతో పాటు ఏడుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. శ్రీనివాసపురం ఎస్ఐ ఈశ్వరప్ప, హెడ్ కానిస్టేబుల్ దేవరాజ్ రెడ్డి, కానిస్టేబుల్ మంజునాథ్‌లతో పాటు మరో నలుగురు పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ నారాయణ్ ఆదేశాలు జారీ చేశారు. హత్య జరిగిన వెంటనే పోలీసులు సత్వర చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. విచారణలో నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తేలడంతో వారిని సస్పెండ్ చేశారు. హత్య జరిగినా పోలీసులు సత్వరమే స్పందించలేదనే ఆరోపణలు ఉన్నాయి

అధిష్టానందే తుది నిర్ణయం



మాట్లాడుతున్న బోసురాజ్

రాయచూరు రూరల్: ముఖ్యమంత్రి, ఇతర పదవుల విషయంలో అధిష్టానందే తుది నిర్ణయమని మంత్రి బోసురాజ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలో వర్గాలు లేవని, హోం మంత్రి పరమేశ్వర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రి రాజన్న చెప్పిన విషయం వ్యక్తిగతమని, అధిష్టానం తీసుకునే నిర్ణయాలకు ప్రతి ఒక్కరు బద్దుదు కావాలన్నారు.

మేయర్ పదవికి త్రివేణి రాజీనామా

- పదవి చేపట్టిన ఏడునెలలకే వైదొలగిన వైనం
- మేయర్ రేసులో మించు శ్రీనివాస్, కుబేర
- ఏడాదికి ఇద్దరు మేయర్లు అయితే అభివృద్ధి మాటేమిటి?



మేయర్ పదవికి రాజీనామా చేసిన త్రివేణి





మేయర్ రేసులో మించు శ్రీనివాస్, కుబేర

సాక్షి,బళ్లారి: బళ్లారి నగర మేయర్ త్రివేణి తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు 7 నెలల క్రితం ఆమె పదవిని అధిష్టించారు. అతి చిన్న వయస్సులోనే మేయర్ పదవిని దక్కించుకున్న త్రివేణి 6 నెలలు గడిచిన తర్వాత మరొకరికి అధికారం కట్టబెట్టాలనే ఒప్పందం మేరకు ఆమె రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో మేయర్ కుర్చీపై ఏడాది ఒకసారి మార్చడం ఆనవాయితీగా వస్తోంది. ఏడాది ఒకసారి రిజర్వేషన్లు మారుస్తూ కొత్త వ్యక్తులకు అవకాశం కల్పిస్తారు. ఏడాది ఒకసారి రిజర్వేషన్లు మార్పు, కొత్త వ్యక్తి మేయర్ సీటుపై కూర్చోవడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే సాగుతోంది. ఏడాది లోపు మేయర్ నగరంలోని 39 వార్డులను తిరగడానికే సమయం సరిపోతుంది. ఇక అభివృద్ధి, సమస్యల గురించి ఏ విధంగా పరిష్కరిస్తారో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ఏటా మేయర్ స్థానం మార్పు ప్రభుత్వ నిబంధన కావడంతో ఐదేళ్లలో 5 మంది మేయర్లు మారడం తెలిసిందే. ప్రస్తుతం రెండవ అవధి కింద మేయర్ పదవిలో కుర్చొన్న త్రివేణి ఏడాది కూడా గడవక ముందే రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఇలా ఉండగా ప్రస్తుత మేయర్ రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త మేయర్ ఎంపికపై పైరవీలు సాగుతున్నాయి. మేయర్ స్థానాన్ని అధిష్టించేందుకు మించు శ్రీనివాస్, కుబేర ఇద్దరు సోదరులలో ఒకరికి మేయర్ స్థానం దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. కార్పొరేటర్ల మద్దతుతో పాటు స్థానిక నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర ఆశీస్సులు ఎవరి లభిస్తే వారికి మేయర్ పదవి దక్కుతుందని చెప్పవచ్చు. మించు, కుబేరతో పాటు మరొకరు కూడా మేయర్ పదవికి కోసం తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

వృద్ధురాలు కళ్లదానం



నింగమ్మ (ఫైల్)

కంప్లి: దానాలన్నింటిలోనూ ప్రాణ దానం గొప్పదంటారు. దానికి దోహదపడేది అవయవదానం. ఇలా అవయవదానం చేసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు ఓ వృద్ధురాలు. హగరి బొమ్మనహళ్లి తాలూకా హిరేసొబటి గ్రామ కిచ్చన బండి నింగమ్మ (80) శనివారం మృతి చెందారు. తన మరణంలోనూ ఆమె సార్థకతను చాటుకున్నారు. తన కళ్లను దానం చేశారు. నింగమ్మ కళ్లను బళ్లారి విమ్స్ వైద్యులు సేకరించారు.

కరెంటు షాక్‌తో ఐటీ ఉద్యోగి మృతి



మృతి చెందిన సోమశేఖర్

లేపాక్షి: లేపాక్షి మండలం పి.బసనపల్లిలో ఉన్న మల్బరీ తోట వద్ద విద్యుత్ షాక్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం రూరల్ మండలంలోని వీరంపల్లికి చెందిన సోమశేఖర్ (31) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పి.బసనపల్లి పొలాల్లో ఉన్న మల్బరీ షెడ్డును నీటితో శుభ్రం చేయడానికి వెళ్లారు. మోటారు ఆన్ చేసే సమయంలో కరెంటు షాక్ తగలడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే చనిపోయాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. భార్య ఆశ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో వేల కోట్ల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం



మాట్లాడుతున్న అన్వర్ బాషా

రాయచూరు రూరల్: రాష్ట్రంలో వేల కోట్ల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమైనట్లు రాష్ట్ర వక్ఫ్ మండలి అధ్యక్షుడు అన్వరబాషా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వక్ఫ్ ఆస్తుల అతిక్రమణలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరు కూడా ఉందని ఆరోపించారు. జిల్లాలో మసీదులు, దర్గా, కబరస్థాన్‌లను ఆక్రమించిన అంశంపై గత బీజేపీ సర్కార్ సర్వేలో తేలిందన్నారు. కలబుర్గిలో నెల రోజుల క్రితం వంద ఎకరాల వక్ఫ్ భూమిని స్వాధీనం చేసుకున్నామని, రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలకు సంబంధించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించామన్నారు.

బస్సు వెనుక ఢీకొన్న టిప్పర్



ఘటనాస్థలిలో గుమిగూడిన జనం

రాయదుర్గం: రాయదుర్గం నుంచి బళ్లారి వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును డి.హీరేహాళ్ మండలం పులకుర్తి గేట్ వద్ద ఓవర్‌టేక్ చేయబోయిన టిప్పర్ వెనుక భాగాన ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయాయి, అదృష్టవశాత్తు 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బస్సు డ్రైవర్ స్వల్పంగా గాయపడడంతో బళ్లారి ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ ముందు భాగం అనిగిపోయింది. జరిగిన సంఘటన చూస్తే పెద్ద ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కంకరలోడ్లతో వెళ్లే టిప్పర్ల వేగానికి తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

మేఘమథనం షురూ



మేఘమథనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల ఏర్పడటంతో కృత్రిమంగా వర్షాలు కురిపించడానికి చర్యలు చేపట్టారు. ఆదివారం జిందాల్ విమానాశ్రయం నుంచి రాయచూరు జిల్లాలో నాలుగు రోజుల పాటు మేఘమథనం కార్యక్రమాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఫౌండేషన్ బోసురాజు, పీకేకే ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు ప్రకాష్ కొలివాడ, కాంగ్రెస్ నేతలు బసవన్నగౌడ బాదర్లి, అరుణ్, వెంకటరావ్, శరణయ్యనాయక్, వసంత్‌నాయక్, విజేష్ పాటిల్ పాల్గొన్నారు.

యడ్యూరప్ప బంధువు కాంగ్రెస్‌లో చేరిక



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిక్కనగౌడర్

హుబ్లీ: ఆపరేషన్ హస్తం జోరుగా సాగుతోంది. ధార్వాడ జిల్లా బీజేపీ కీలక నేత, యడ్యూరప్ప బంధువు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఐ చిక్కనగౌడర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొన్నారు. ఆదివారం మాజీ సీఎం జగదీష్‌శెట్టర్ స్వయంగా సీఎం సిద్ధరామయ్య దగ్గరకు వెళ్లి చిక్కనగౌడర్‌కు కాంగ్రెస్‌లో చేర్పించారు. జిల్లాలోని కుందగోళ ఎమ్మెల్యేగా ప్రజాదారణ చూరగొన్న చిక్కనగౌడర్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్టు దక్కకపోవడంతో కుందగోళ నుంచి బీజేపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. కాగా జగదీష్‌శెట్టర్ నేతృత్వంలో మరికొంత మంది ఉత్తర కర్ణాటక బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.